www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 41 | గురువారం | 30-07-2026 | హైదరాబాద్

Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12 | వెల రూ. 5.00




## 08 జోర్డాన్‌లో అమెరికా స్థావరాలపై ఇరాన్ ఆకస్మిక దాడి

● అమెరికా–సౌదీ దాడిలో 20 మంది పిఎంఎఫ్ సైన్యం మృతి ● ఐదు ఇరాన్ క్షిపణులు కూల్చేసిన జోర్డాన్ హోర్ముజ్‌లో మూడు చమురు ట్యాంకర్లు ధ్వంసం

# నిరసనలు, వాగ్వాదాలు

● విద్యార్థి నిరసనకారులపై కాల్పులకు అమిత్ షా అధికారమిచ్చారు : రాహుల్‌గాంధీ ఆరోపణ ● ప్రతిపక్షనేత క్షమాపణలు చెప్పాలి, ఆధారాలు చూపించాలని అధికార సభ్యుల డిమాండ్ ● పార్లమెంట్ ఉభయసభల్లో కీలక చట్టాలు ఆమోదం ● హోంమంత్రి సభకు హాజరు కావాలంటూ ప్రతిపక్షాల వాకౌట్

## పేపర్ లీకేజీల నియంత్రణ సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఓకె

## ‘వందేమాతరం’ సవరణ బిల్లు -2026 రాజ్యసభలో పాస్



నిరసనలు, తీవ్ర వాగ్వాదాల మధ్య బుధవారం పార్లమెంట్ ఉభయ సభలు కీలక చట్టాలను ఆమోదించాయి. అనంతరం రోజంతా ఉద్రిక్తంగా సాగిన పార్లమెంట్ కార్యకలాపాలు గురువారం నాటికి వాయిదా పడ్డాయి. ప్రతిపక్షాలు పదేపదే అంతరాయం కలిగించినప్పటికీ, లోక్‌సభ పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026ను మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, పోలీసులు జరిపిన అణచివేత చర్యల సమయంలో విద్యార్థి నిరసనకారులపై కాల్పులు జరపడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధికారం ఇచ్చారని ఆరోపించారు. ఈ ఆరోపణలకు మద్దతుగా క్షమాపణ, ఆధారాలు చూపాలని బిజెపి సభ్యులు డిమాండ్ చేయగా, స్పీకర్ ఓం బిర్లా తర్వాత రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తొలగించారు. జనన, మరణాల ఆలస్య నమోదుకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేస్తూ, సంఘటన జరిగిన రెండేళ్ల తర్వాత చేసే నివేదికలకు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (ఫస్ట్ క్లాస్) ఆమోదం తప్పనిసరి చేస్తూ కేంద్రం బుధవారం లోక్‌సభలో ఒక బిల్లును ప్రవేశపెట్టింది. ఇదిలా ఉండగా, జాతీయ గీతం వందేమాతరంను అవమానించడాన్ని నేరంగా పరిగణించే ‘దేశ గౌరవాన్ని అవమానించడాన్ని నివారించే (సవరణ) బిల్లు, 2026’ను రాజ్యసభ ఆమోదించింది. నీట్ పేపర్ లీక్ నిరసనకారులపై పోలీసులు చర్య తీసుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు హాజరు కావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీలు చర్చ సందర్భంగా వాకౌట్ చేశాయి.

# అమిత్‌షాదే బాధ్యత

● ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ధ్వజం ● విద్యామంత్రిత్వ శాఖను నడిపేది ఆర్‌ఎస్‌ఎస్ ● యునివర్శిటీ వైస్‌చాన్సలర్లు ఆర్‌ఎస్‌ఎస్ వారేనని ఆరోపణ



**న్యూఢిల్లీ :** పేపర్ లీక్‌ల నియంత్రణ చట్టసవరణ బిల్లుపై రెండవ రోజు బుధవారం కూడా లోక్‌సభలో వాడీవేడిగా చర్చ జరిగింది. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలకు హోం మంత్రి అమిత్ షా అధికారం ఇచ్చారని ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలు లోక్‌సభలో భారీ దుమారాన్ని రేకెత్తించాయి. విద్యార్థులు, తమకే అన్నీ

తరువాయి 8లో

## విద్యార్థుల లాఠీఛార్జిపై హోంమంత్రి ప్రకటన చేయాల్సిందే

### ఉభయసభల్లో ప్రతిపక్షాల పట్టు

పార్లమెంట్‌లో బుధవారం కూడా ప్రతిష్టంభన కొనసాగింది. ఉభయల్లోనూ విపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. సిజెపి కార్యకర్తలు, విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జి అంశంలో.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని కోరుతూ విపక్షాలు డిమాండ్ చేశాయి. లోక్‌సభ ఉదయం ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాల

తరువాయి 8లో

# పోలీస్ శాఖల్లో 7,437 ఉద్యోగాలు

● నోటిఫికేషన్‌లు జారీ
● పోలీసు, ఎస్‌పిఎఫ్, ఫైర్, జైళ్ల శాఖల్లో భారీ నియామకాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి (టిఎస్‌ఎల్‌పిఆర్‌బి) బుధవారం పోలీసు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పిఎఫ్), ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్, జైళ్ల శాఖల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి నాలుగు వేర్వేరు నియామక నోటిఫికేషన్లు విడుదల చేసింది. త్వరలో ఆన్‌లైన్ దరఖాస్తుల షెడ్యూల్ ప్రకటించనున్నట్లు తెలిపింది. నోటిఫికేషన్ ప్రకారం పోలీసు శాఖలో అత్యధికంగా 3,697 సివిల్ కానిస్టేబుల్, 1,052 ఎఆర్ కానిస్టేబుల్, 148 సబ్ ఇన్‌స్పెక్టర్

తరువాయి 12లో





## కర్నాటక సిఎంతో మంత్రి ఉత్తమ్ భేటీ

**తుంగభద్ర, కృష్ణానదీ జలాలు, అంతర్రాష్ట్ర జల అంశాలపై కీలక చర్చ**

ప్రజాపక్షం/హైదరాబాద్

ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌తో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్‌లు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించిన పలు అంశాలతో పాటు తుంగభద్ర, కృష్ణానదీ జలాలు, అంతర్రాష్ట్ర జల అంశాలపై కీలకంగా చర్చించారు. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, ప్రజా ప్రయోజన అంశాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. ఆ తరువాత మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కెటిఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే

తరువాయి 12లో

## పాత తేదీలతో పర్యావరణ అనుమతులు ఇకపై చెల్లవు

● ఇప్పటి వరకు అనుమతులు కట్టబెడుతున్న ఆఫీస్ మెమోరాండం కొట్టివేత
● చట్ట ప్రకారం అనుమతులివ్వాలే తప్ప అధికారిక పత్రంతో కాదని సుప్రీం కోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** ముందస్తు అనుమతులు పొందకుండానే చేపట్టిన ప్రాజెక్ట్‌లకు పాత తేదీ నుండే పర్యావరణ అనుమతులు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం, ఇతర ప్రభుత్వ అధికారులకు అధికారం కల్పించిన 2021 నాటి ఆఫీస్ మెమోరాండం (అధికార పత్రాన్ని) సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పాంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం నాడు ఏకగ్రీవ తీర్పును వెలువరించింది. ఈ తీర్పు భవిష్యత్తులో మాత్రమే వర్తించనుందని, తద్వారా ఇప్పటికే పాత తేదీలతో పర్యావరణ అనుమతులు పొందిన ప్రాజెక్టులకు వర్తించబోదని , కాబట్టి ప్రాజెక్టులు కూల్చివేత, ఇతర శిక్షల వంటి చర్యల నుంచి అవి కాపాడపడతాయని వివరించింది. ఇలాంటి ప్రాజెక్టులలో ఒడిశాలోని ఎయిమ్స్ సహా కర్ణాటకలోని విజయనగర్‌లోని గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, కాలుష్య నియంత్రణకు కీలకమైన అనేక ఉమ్మడి

తరువాయి 8లో



## విద్యార్థులు ఉగ్రవాదులు కారు.. దేశ భవిష్యత్తు

**ప్రభుత్వం సరైన దారిలో నడవకపోతే యువత ప్రభుత్వాన్ని మారుస్తుంది : అభిజీత్ దీప్కే**

**ఛత్రపతి సంభాజీనగర్ :** నిరసన తెలుపుతున్న విద్యార్థులు ఉగ్రవాదులు కారని, వారు దేశ భవిష్యత్తు అని ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రభుత్వం వారిని ఇబ్బంది పెట్టడం మానుకోవాలన్నారు. ప్రభుత్వం సరైన దారిలో నడవకపోతే యువత ప్రభుత్వాన్ని మారుస్తుందని ఆయన హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్త ఉద్యమంగా మారి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన నెల రోజుల సుదీర్ఘ నిరసన కార్యక్రమానికి సిజెపి నాయకత్వం వహించింది. ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన

తరువాయి 12లో



## లైంగిక వేధింపుల కేసు జైలుకు ట్రైనీ ఐపిఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి

● 14 రోజుల రిమాండ్
● క్వాష్ పిటిషన్‌పై విచారణ నాలుగు వారాలకు వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్

తోటి మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో అరెస్ట్ అయిన ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి ఉప్పరపల్లి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు ఆయనను ఆగస్టు 11 వరకు చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ నెల 18న కర్ణాటకకు చెందిన మహిళా ట్రైనీ ఐపిఎస్

తరువాయి 12లో

# కురిసిన వర్షం... పైరుకు జీవం...

రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

● రైతుల ముఖాల్లో వెల్లివిరిసిన ఆనందం ● పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు ● పలు చోట్ల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు ● ములుగు జిల్లాలో సుడిగాలి బీభత్సం ● మూడు నాలుగు కిలోమీటర్ల మేర నేలకొరిగిన వందలాది వృక్షాలు



ప్రజాపక్షం విలేకరుల బృందం

తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇన్ని రోజులు వానజాడ కోసం ఎదురు చూసిన రైతుల ముఖాల్లో సంతోషం కనిపించింది. నీరు లేక ఎండిపోయే దశకు చేరుకున్న పైరుకు మళ్లీ ప్రాణం పోసినట్లైందని కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరికొన్ని చోట్ల స్తంభాలపై చెట్లు పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జోరువానలతో పలుచోట్ల వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జోరు వానలు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నిర్మల్ జిల్లాలో 82.9 మి.మీ., మంచిర్యాలలో 80.6 మి.మీ., ఆదిలాబాద్‌లో 52.2 మి.మీ., కుమురంభీంఆసిఫాబాద్ జిల్లాలో 41.7 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. నిర్మల్ అర్బన్‌లో 132.3 మి.మీ., కడెం పెద్దూర్‌లో 131.2 మి.మీ., కాసిపేటలో 123.5 మి.మీ., తిర్యాణిలో 108.2 మి.మీ. వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 56,497 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.7248 టిఎంసిల నీరు నిల్వ ఉంది. కడెం ప్రాజెక్టుకు 22,505 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

తరువాయి 8లో



నిజామాబాద్‌లో..



జగిత్యాలలో..



వాజేడులో..

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకూ తీసుకెళ్తాం

● పారదర్శకంగా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ● ఢిల్లీలో టిపిసిసి సమన్వయ కమిటీ భేటీ అనంతరం మీడియాతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్



భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి పౌరుడి ఓటు హక్కే మూలస్తంభమని, అర్హుడైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడ మే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షే మ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ క్యాడర్, సంస్థాగత వ్యవస్థ ద్వారా ప్ర తి ఇంటికీ చేర్చేందుకు సమావేశంలో ఒక పకడ్బందీ ‘ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక’ ను రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలోని ఎఐసిసి

తరువాయి 12లో

## తప్పులు లేని ఓటరు జాబితా కోసమే ‘సర్’

● ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదు
● తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రస్తుతం కొనసాగుతున్న ‘ఎస్‌ఐఆర్’ ప్రక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకేనని, కానీ ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎటువంటి సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 76 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం పూర్తయిందని తెలిపారు. ‘ఎస్‌ఐఆర్ ప్రక్రియ పురోగతి డిజిటలైజేషన్’ అంశంపైన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో ఐదు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు 3వతేదీలోపు డిజిటలైజేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలోని ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హజూర్‌నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోథ్ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్

తరువాయి 12లో

# ఇది 'ఆత్మరక్షణ' బిల్లు..

పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకులను అరికట్టడానికి ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభలో ఆమోదముద్ర పడడం, ఈ సమస్యకు సాధ్యమైనంత త్వరగా ముగింపు పలకాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనకు అద్దం పడుతున్నదే తప్ప, సమస్యకు తెరదించాలన్న నిబద్ధతను ప్రతిబింబించడం లేదు. లోతైన చర్చలు.. విస్తారమైన సంప్రదింపులు లేకుండా, ప్రభుత్వం ఈ బిల్లుకు మూజువాణి ఓటుతో ఆమోదముద్ర వేయించుకోవడమే ఇందుకు నిదర్శనం. బిల్లులో లీకేజీ సమస్యకు నామమాత్రపు పరిష్కారాలే తప్ప, కూకటివేళ్లతో పెకలించే విధానాలు లేవని ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేకపోలేదు. మన దేశంలో పోటీ పరీక్షలను విద్యా వ్యవస్థలో ఒక భాగంగా పరిగణించడం కంటే, లక్షలాది కుటుంబాల ఆశలు, యువత కలలు, సమాజం ప్రతిభను ఎంపిక చేసుకునే విధానంగా, ప్రభుత్వ పరిపాలనకు అవసరమైన మానవ వనరులను గుర్తించే యంత్రాంగంగా పేర్కోవడం సముచితం. ఒక విద్యార్థి ఎన్నో సంవత్సరాల శ్రమ, తల్లిదండ్రుల ఆర్థిక త్యాగం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, వ్యక్తిగత క్రమశిక్షణ చివరకు ఒక పరీక్షలో ప్రతిబింబిస్తాయి. అలాంటి పరీక్షలపై ప్రజలకు నమ్మకం లేకపోతే దాని ప్రభావం ఒక్క విద్యార్థిపైనే కాదు, మొత్తం సమాజంపైన పడుతుంది. అందుకే ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో అక్రమాలు, ఫలితాలపై అనుమానాలు వంటి పరిణామాలు సాధారణ పరిపాలనా వైఫల్యాలుగా కాకుండా ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే సంక్షోభాలుగా చూడాలి. అందుకే ఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా యువత అంతగా పోరాడింది. కానీ, మోదీ ప్రభుత్వం గతంలో మాదిరిగానే మరోసారి ఒక మహా ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నది. గతంలో రైతు ఆందోళనకు తలవంచి, వివాదాస్పదమైన మూడు వ్యవసాయ బిల్లులను రద్దు చేసిన మోదీ సర్కారు, ఆ సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని ఇప్పటి వరకూ నెరవేర్చలేదు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత నేటికీ రానేలేదు. అదే తరహాలో ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాన్ని కూడా నిద్రపుచ్చే ప్రయత్నం చేస్తున్నది. విద్యార్థుల తీవ్రమైన ప్రతిఘటన తర్వాత, నిందితులను అరెస్టు చేయడం, కఠిన శిక్షలు ప్రకటించడం, కొత్త చట్టాలు తీసుకురావడంతో తన బాధ్యత తీరిపోయినట్టు ప్రవర్తిస్తున్నది. సమస్యను మూలాలను గుర్తించి పరిష్కరించే దిశగా వ్యవస్థను పునర్నిర్మించే విధానంపై స్పష్టత ఎక్కడా లేదు. ఒక నేరం జరిగిన తర్వాత శిక్షించడం కంటే, ఆ నేరం జరగకుండా అడ్డుకోవడమే మంచి పాలనకు ప్రమాణం. ప్రశ్నాపత్రం లీక్ కావడం అంటే లక్షలాది మంది విద్యార్థులు చేసిన శ్రమ విలువను దోచుకోవడం కాబట్టి, ప్రశ్నల రూపకల్పన నుంచి సవరణ, అనువాదం, డిజిటల్ భద్రపరచడం, ముద్రణ, ప్యాకింగ్, రవాణా, నిల్వ, పరీక్షా కేంద్రాలకు పంపిణీ, పరీక్ష ప్రారంభమయ్యే వరకు ఉన్న అనేక దశల్లో కీలక పాత్ర పోషించే విధానాలపై నిశిత దృష్టి ఉంచాలి. పరీక్షల భద్రతను చివరి దశలో అమలుచేసే చర్యగా కాకుండా, మొత్తం ప్రక్రియలో కొనసాగాల్సిన బాధ్యతగా చూడాలి.

డిజిటల్ యుగంలో పరీక్షల నిర్వహణ కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు ప్రశ్నాపత్రం కాగితాల రూపంలో మాత్రమే ఉండేది. ఇప్పుడు ప్రశ్నల తయారీ, సవరణ, అనువాదం, డేటా మార్పిడి, ముద్రణ వంటి అనేక దశలు డిజిటల్ వేదికలపై జరుగుతున్నాయి. అందువల్ల సైబర్ భద్రత పరీక్షల విశ్వసనీయతలో అంతర్భాగంగా మారింది. అనుమతి లేకుండా ఫైళ్లను చూడడం, డేటా కాపీ చేయడం, సర్వర్లలోకి చొరబడడం, అంతర్గత సమాచారాన్ని బయటకు పంపించడం వంటి ప్రమాదాల ను ఎదుర్కొనే సామర్థ్యం లేకపోతే ఎంత కఠినమైన చట్టం ఉన్నా ప్రయోజనం ఉండదు. ప్రతి సున్నితమైన పత్రానికి 'డిజిటల్ ఆడిట్ ట్రయిల్' ఉండాలి. ఎవరు, ఎప్పుడు, ఏ కారణంతో ఆ సమాచారాన్ని వినియోగించారో నమోదు కావాలి. భద్రతా వ్యవస్థలను స్వతంత్రంగా పరిశీలించే యంత్రాంగం సైతం అవసరం. అయితే సాంకేతిక పరిజ్ఞానం ఒక్కటే పరిష్కారం కాదు. దానిని నిర్వహించే సంస్థల సామర్థ్యం కూడా అంతే ముఖ్యం. కోట్లాదిమంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పరీక్షలను నిర్వహించే సంస్థలకు తగిన సంఖ్యలో శాశ్వత సిబ్బంది, నిపుణులు, సమాచార భద్రతా బృందాలు, పరీక్షల నిర్వహణలో అనుభవజ్ఞులైన అధికారులు అవసరం. తాత్కాలిక ఏర్పాట్లు, ఖాళీ పోస్టులు, పరిమిత వనరులతో ఇంత పెద్ద బాధ్యతను నిర్వహించడం క్రమంగా వ్యవస్థ ను బలహీనపరుస్తుంది. పరీక్షల సంఖ్య పెరిగిన కొద్దీ సంస్థాగత సామర్థ్యం కూడా అదే స్థాయిలో పెరగాలి. పరీక్షా నిర్వహణలో జవాబుదారీతనం స్పష్టం గా ఉండాలి. ఏ దశలో లోపం జరిగిందో గుర్తించగలిగే విధంగా బాధ్యతల విభజన ఉండాలి. పరీక్షల సంస్కరణలతో పాటు విద్యా అవకాశాల విస్తరణ కూడా సమానంగా అవసరం. పరీక్ష నిర్వహణ అనంతరం భద్రతా సమీక్షలు నిర్వహించడం, లోపాలను బహిరంగంగా అంగీకరించడం, సరిదిద్దే చర్యలను వెల్లడించడం, ఫిర్యాదుల పరిష్కారానికి స్వతంత్ర వ్యవస్థ ఏర్పాటు చేయడం వంటి చర్యలు విశ్వాసాన్ని పెంచుతాయి. కానీ, పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లు ఇంత విస్తారమైన బాధ్యతను నిర్వర్తించేదిగా కనిపించడం లేదు. లీకేజీలకు పాల్పడిన వారికి పది సంవత్సరాల వరకూ కఠిన కారాగార శిక్ష అమలయ్యేలా చేయాలనుకోవడం తప్పుకాకపోవచ్చు. కానీ, ప్రశ్నాపత్రాల చౌర్యాన్ని అరికట్టే పటిష్టమైన విధానాలను తీసుకురాకుండా, ప్రవేశపెట్టే హడావుడి బిల్లులతో ఎవరికి లాభం? సమస్యకు ఎక్కడ పరిష్కారం?

గత 10 సంవత్సరాల్లో 152 ప్రశ్నాపత్రాలు లీకు అయితే ఎవరినీ శిక్షించిన దాఖలాలు లేకపోవటం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనంగా ప్రతిపక్షాలు నిలదీస్తుంటే ప్రభుత్వం వద్ద సమాధానం లేదు. అందువల్ల చట్టాల్లోని శిక్షాత్మక క్లాజులు కఠినతరం చేయటం ఆత్మరక్షణాత్మక చర్య తప్ప అవి నేరస్థులను పట్టి ఇవ్వవు. చిత్తశుద్ధి, అంకితభావం, స్వార్థరహితంగా పనిచేసే విద్యావ్యవస్థ నిర్మాణం ఆవశ్యకతను గుర్తించటం ప్రభుత్వంలో కనిపించదు.

ప్రశ్నాపత్రం లీకైన తర్వాత ఎంతమందిని శిక్షించామన్నది ప్రభుత్వ విజయానికి ప్రమాణం కాదు. లీక్ జరిగే అవకాశాన్ని ఎంతవరకు నిర్మూలించగలిగామన్నదే అసలు కొలమానం. పరీక్షా కేంద్రంలోకి అడుగుపెట్టే ప్రతి విద్యార్థి తన కృషి మాత్రమే తన భవిష్యత్తును నిర్ణయిస్తుందనే విశ్వాసంతో కూర్చోగలిగిన రోజునే నిజమైన పరీక్షా సంస్కరణలు విజయవంతమైనట్టు భావించాలి. ఈ దిశగా అడుగులు పడకపోతే, పతనమవుతున్న విద్యా వ్యవస్థను సరిదిద్దకపోతే, కార్పొరేట్ పోటీ నుంచి విద్యారంగాన్ని కాపాడకపోతే, ఎన్ని బిల్లులు వచ్చినా.. ఎన్ని చట్టాలు చేసినా ఫలితం ఉండదు. విద్యార్థులకు న్యాయం జరగదు. ●



## విరాళాల చోరీలో బిజెపి ప్రభుత్వ వైఫల్యం

**అయోధ్య రామాలయంలో విరాళాలు చోరీ ఆరోపణల విషయంలో ప్రజల విశ్వాసాన్ని కాపాడటంలో బిజెపి ప్రభుత్వ వైఫల్యం ప్రతిబింబిస్తోంది. ప్రభుత్వం విచారణలను ఎదుర్కొంటుందని ఆశించలేం. సమస్య ఒక్కటే. భక్తులు సమర్పించిన కానుకలు, పెట్టెలను కాపాడలేనివారు, పేపర్ లీక్‌లను ఆపుతారని ఆశించలేం. ప్రజల విశ్వాసంతో ఆడుకునే వారు, మన యువత భవిష్యత్తుతో సైతం చెలగాటం ఆడగలరు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సంక్షోభం ఈ ప్రభుత్వమే. మోదీ ప్రభుత్వం గద్దె దిగేంత వరకూ ఈ సమస్యలు కొనసాగుతుంటాయి.**

– సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్



## సామాజిక రుగ్మతగా మారిన నిరుద్యోగం?

నేడు దేశంలో యువతను అత్యధికంగా పీడిస్తున్న సామాజిక రుగ్మత నిస్సందేహంగా నిరుద్యోగమే. అత్యున్నత విద్యార్హతలు ఉన్నా కోట్లాదిమంది యువతీ యువకులు ఉద్యోగావకాశాలు లేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 147 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో సుమారు 371 మిలియన్ల మంది యువత ఉన్నారు. వారిలో దాదాపు 100 మిలియన్ల మంది నిరుద్యోగ రక్కసి కబంధ హస్తాల్లో చిక్కి విలవిల్లాడుతున్నారు. విద్యార్హతలకు, నైపుణ్యాలకు తగ్గ ఉద్యోగం దొరకక, ఉపాధి కరువై, వయసు పెరిగేకొద్దీ తమ కాళ్లపై తాము నిలబడలేక, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చలేక, ఉద్యోగ అన్వేషణలో తమ కుటుంబాలను అప్పులకుప్పగా మారుస్తున్నామనే మానసిక వేదనతో సతమతమవుతూ కొంతమంది పిచ్చివాళ్లుగా మారి కొంతమంది బలవన్మరణాలకు పాల్పడుతుండడం బాధాకరం.

**నిరుద్యోగానికి ప్రధాన కారణాలు**

**విద్యా విధాన లోపం:** ప్రాథమిక విద్య నుండి గ్రాడ్యుయేషన్ వరకు స్కిల్స్ లేని 'రోట్ లెర్నింగ్'కే పరిమితమవుతున్నాం. అనలిటికల్, టెక్నికల్, ప్రాక్టికల్ లెర్నింగ్ లేకపోవడం వల్ల యువత ఆలోచనా పరిధి పెరగడం లేదు.

**నైపుణ్యాల కొరత:** భాషాపరమైన అవరోధాలు, ఇంటర్వ్యూ నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం లేకపోవడం. కంప్యూటర్, టెక్నికల్ స్కిల్స్ లేకపోవడం వల్ల ప్రైవేట్ ఉద్యోగాలు చేజారిపోతున్నాయి.

**ప్రభుత్వ ఉద్యోగాల మోజు:** చాలామంది యువత జీవితమంతా ప్రభుత్వ కొలువు కోసమే కేటాయిస్తున్నారు. చివరకు ఏ ఉద్యోగం దొరక్క ఆత్మవిశ్వాసం కోల్పోతున్నారు.

**సాంకేతికత ప్రభావం:** AI రాకతో చాలా ప్రైవేట్ ఉద్యోగాలు పోతున్నాయి. తక్కువ ఉద్యోగాలు, ఎక్కువ పోటీ నెలకొంది.

**ఇతరత్రా:** బిజినెస్, రియల్ ఎస్టేట్, ఎంట్రప్రెన్యూర్‌షిప్ వంటి రిస్క్ ఉన్న రంగాల్లోకి యువత రాకపోవడం. GDPలో విద్యకు తగిన బడ్జెట్ కేటాయించకపోవడం ప్రధాన అవరోధంగా భావించక తప్పదు.

**దేశానికి, కుటుంబానికి నష్టం**

కుటుంబం, సమాజం, బంధువుల నుండి వచ్చే 'ఉద్యోగం ఎప్పుడు?' అనే ఒత్తిడితో నిరుద్యోగ యువత మానసికంగా కుంగిపోతున్నారు. కండబలం, ఉడుకు రక్తం కలిగిన యువశక్తి ఖాళీగా ఉంటే నష్టం వ్యక్తులకు కుటుంబాల కే కాదు, దేశానికి కూడాను. యువ మేధస్సును వాడుకోకుండా దేశాభివృద్ధికి దోహదం చేయలేకపోతున్నాం.

ప్రపంచ వేదిక పై 'నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ'గా డప్పు కొట్టుకునే ప్రభుత్వానికి 100 మిలియన్ల నిరుద్యోగ యువత గుండె చప్పుడు వినబడకపోవడం విడ్డూరమేననే బుద్ధిజీవుల మాటలతో ఏకీభవించకతప్పదు. మరోవైపు దేశంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించే విద్యా సంస్థలు కొరవడి ఉన్నత చదువుల పేరుతో విదేశాలకు వెళ్లే యువత సంఖ్య పెరుగుతోంది. మన యువశక్తిని ఇతర దేశాలు వాడుకుని అభివృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కోవాలి.

**నిరుద్యోగ నిర్మూలన పాలసీలు:** కొత్త పరిశ్రమలు, MSMEలకు ప్రోత్సాహకాలు.

**స్కిల్ డెవలప్మెంట్:** విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్, టెక్నికల్ నైపుణ్యాల శిక్షణ.

**బడ్జెట్ పెంపు:** GDPలో విద్యకు ఎక్కువ వాటా కేటాయించాలి.

**విద్యా సంస్కరణలు:** చైనా విద్యా విధానం లాగా ప్రతి పనిని, జీవన విధానాన్ని చిన్నతనం నుండే అలవాటు చేయాలి. జపాన్ తరహాలో ప్రైమరీ నుండే నైతిక విలువలు బోధించాలి.

డాక్టర్ నీలం సంపత్, 9866767471.

# మోదీకి నిద్ర పట్టలేదా? నిద్ర పోలేదా?



ఆయిరబోయిన బిక్షపతి
(అగల్ జోయా)
7993248717

మోదీకి నిద్ర పట్టలేదా? నిద్ర పోలేదా? అధికారానికి రెండు రకాల రాత్రులు ఉంటాయి. ఒకటి విజయాల తర్వాత వచ్చే నిశ్చింత రాత్రి. మరొకటి ప్రజల మనసులో ఏదో మారుతుంది అనే సంకేతం మొదటిసారి వినిపించిన తర్వాత వచ్చే రాత్రి. మొదటి రాత్రిలో శరీరం విశ్రాంతి తీసుకుంటుంది. రెండో రాత్రిలో కళ్ళు మూసుకున్నా ఆలోచనలు మేల్కొని ఉంటాయి. ఎందుకంటే అధికారాన్ని నిజంగా మేల్కొలిపేది ప్రతిపక్షం కాదు. ఎన్నికలు కాదు. మీడియా కాదు. ప్రజలు నిశ్శబ్దంగా తమ అభిప్రాయాన్ని మార్చుకోవడం ప్రారంభించిన క్షణమే. సింహం గర్జించడం ఆపిన రోజు అడవి మారదు. జింక భయపడడం మానేసిన రోజు అడవి మారుతుంది. రాజకీయాల్లో కూడా అంతే. అధికారాన్ని కదిలించేది ప్రతిపక్షం కాదు. ప్రజల మనసులో మారిపోయిన లెక్క. చరిత్రలో ఎన్నో ప్రభుత్వాలు ఎన్నికల్లో ఓడిపోయిన రోజున బలహీన పడలేదు. తమ గురించి రాసుకున్న కథను మార్చడం ప్రారంభించిన రోజే వాటి అసలు పరీక్ష మొదలైంది. అందుకే ప్రజల నిశ్శబ్దాన్ని చిన్నచూపు చూసిన ప్రతి అధికారం ఒకరోజు తన సొంత నిశ్శబ్దానికి సమాధానం చెప్పాల్సి వస్తుంది. జర్మనీకి చెందిన పాస్టర్ మార్టిన్ నీల్ మోర్ ఒక గొప్ప హెచ్చరికను ప్రపంచానికిఇచ్చాడు. 'First they came for communists, next for the trade unionists, later for the Jews, I remained silent until they finally came for me what can I do'. ఈ చిన్న వాక్యంలో ఒక పెద్ద సత్యం దాగి ఉంది. అన్యాయం ఒక్కరోజులో సమాజాన్ని చుట్టుముట్టదు. అది ఒక్కో సమస్యగా, ఒక్కో వర్గాన్ని తాకుతూ ముందుకు సాగుతుంది. ప్రతిసారి అది నా సమస్య కాదు అని సమాజం మౌనంగా ఉన్న కొద్దీ అన్యాయం మరింత ధైర్యం తెచ్చుకుంటుంది. చివరికి విడివిడిగా కనిపించిన అసంతృప్తులన్నీ ఒక ప్రవాహంగా కలుస్తాయి.

ఢిల్లీలో చెలరేగిన విద్యార్థుల ఉద్యమాన్ని కూడా కేవలం ప్రశ్నపత్రాల లీకేజ్‌గా మాత్రమే అర్థం చేసుకోవడం సరైనది కాదు. దానికి ముందే నిరుద్యోగంపై పెరిగిన ఆందోళన, విద్యా వ్యవస్థపై దెబ్బతిన్న నమ్మకం, ప్రభుత్వ విధానాలపై పేరుకుపోయిన అసంతృప్తి, మూడు పర్యాయాల పాలనలో ఒక్కొక్కటిగా కూడబెట్టుకున్న ప్రశ్నలు, ఇవన్నీ నెమ్మదిగా ఒకచోట చేరాయి. పరీక్షల వివాదం వాటికి నిప్పంటించింది. అందుకే అది కొందరి విద్యార్థుల ఆందోళనగా ఆగిపోలేదు. ఒక తరం తన అసంతృప్తిని దేశం ముందుంచిన రాజకీయ ఘట్టంగా మారింది. అందుకే కాక్రోచ్ జనతా పార్టీ అనే పేరు కొద్ది రోజుల్లోనే ఒక ప్రతీకం గా మారింది. అది రాజకీయ పార్టీ పేరు కాదు. అవమానాన్ని నిరసనగా మార్చుకున్న యువత ఆత్మగౌరవానికి పెట్టుకున్న పేరు. ఒక ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌తో మొదలైన పిలుపు దేశవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులను ఒకే వేదికపై తీసుకువచ్చి 'మమ్మల్ని చిన్నచూపు చూస్తే మేము మౌనంగా ఉండం' అనే ఒక తరం ప్రకటనగా మారింది. లాఠీ చార్జీలు ఉద్యమాన్ని ఆపలేదు, గాయాలు దాని స్వభావాన్ని తగ్గించలేదు. ప్రముఖుల సంఘీభావం దానికి మరింత నైతిక బలం ఇచ్చిం ది. చివరికి ప్రభుత్వం స్పందించి అర్ధరాత్రి మోదీ నుండి ఒక ప్రకటన వెలువడింది. అయితే అది పరిపాలన నిర్ణయం మాత్రమే కాదు అధికారానికి నిద్రలేని రాత్రుల ప్రారంభాన్ని ప్రకటించిన రాజకీయ మలుపు. ఒక మంత్రి రాజీనామా చేయడం పరిపాలన పరిణామం కావచ్చు కానీ దాని వెనుక వినిపించింది యువత గొంతే. ఈ ఉద్యమాన్ని మరింత అర్థం చేసుకోవాలంటే తరాల మనస్తత్వాన్ని కూడా అర్థం చేసుకోవాలి.

జెన్ X వ్యవస్థను మార్చడానికి ఓపికను నమ్మింది. జెన్ Y అవకాశాలను నమ్మింది. అభివృద్ధి, ఉద్యోగం, ఆర్థిక పురోగతి, దాని రాజకీయ ఆలోచనలను ప్రభావితం చేశాయి. కానీ జెన్ Z పూర్తిగా భిన్నం. ఈ తరం నాయకుడిని చూసి చప్పట్లు కొట్టదు. నిర్ణయాన్ని చూసి ప్రశ్నిస్తుంది. ప్రచారాన్ని కాదు పారదర్శకతను కోరుతుంది.





హామీలను కాదు, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తుంది. సోషల్ మీడియా దీని ఆయుధం మాత్రమే కాదు; సమాచారాన్ని తనిఖీ చేసే సాధనం కూడా. అందుకే ఈ తరాన్ని పాత రాజకీయ సూత్రాలతో కొలవడం సాధ్యం కాదు.

గత 10 ఏళ్లలో నరేంద్ర మోదీ చుట్టూ ఒక శక్తివంతమైన రాజకీయ ప్రతిమ నిర్మితమైంది. వరుస ఎన్నికల విజయాలు, కరిష్మా, కేంద్రీకృత నాయకత్వం, అపారమైన ప్రచార యంత్రాంగం ఇవన్నీ కలిపి ఆయనను అపరాజయ (విశ్వగురు) నాయకుడిగా నిలబెట్టాయి. క్రమంగా ఆ ప్రతిమ చుట్టూ ఒక రాజకీ య 'ఆరా' ఏర్పడింది. ప్రత్యర్థులు కూడా ఆయనను ఓడించడం అసాధ్యం అనే భావనలోకి వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. కానీ ప్రజాస్వామ్యంలో ఏ 'ఆరా' అయినా ప్రజల అంగీకారంతోనే నిలుస్తుంది. అదే అంగీకారం ప్రశ్నగా మారడం ప్రారంభించినప్పుడు ముందుగా కదిలేది అధికారం కాదు. ఆ అధికారం చుట్టూ నిర్మించుకున్న అపరాజేయత భావన. ఆ భావన బీటలు వారినప్పుడు కనిపించేది ఒక వ్యక్తి నిర్ణయం కాదు. అధికార స్వభావములో వచ్చిన మార్పు.

అయితే ఇక్కడ ప్రశ్న ఒక మంత్రి రాజీనామా చేశాడా లేదా అన్నది కాదు. దిగిపోయింది అధికారమా? అహంకారమా? ఎందు కంటే ఈసారి అధికారాన్ని ఎదుర్కొన్నది ప్రతిపక్ష రాజకీయాలు కాదు. నైతిక మనస్సాక్షి.(Moral conscience) అందుకే ప్రభుత్వం ఒక ఉద్యమాన్ని మాత్రమే ఎదుర్కోలేదు. ప్రజల విశ్వాసాన్ని తిరిగి సంపాదించాల్సిన సవాలను ఎదుర్కొంది. ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడం ఏ ప్రభుత్వానికైనా అతిపెద్ద రాజకీయ సవాలు. ఎందుకంటే ఎన్నికలు అధికారాన్ని ఇస్తాయి. కానీ ప్రజల విశ్వాసమే ఆ అధికారానికి స్థిరత్వాన్ని ఇస్తుంది

చరిత్రలో ప్రభుత్వాలు ఒక్కరోజులో బలహీన పడలేదు. ప్రజలు వాటిని చూసే దృష్టి మారినప్పుడు బలహీనపడ్డాయి. అధికారానికి అత్యంత ప్రమాదకరమైనది ప్రతిపక్షం కాదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రారంభించిన సమాజం. ఎందుకంటే ఆ ప్రశ్నలను ఎంతకాలం విస్మరించిన అవి చివరికి రాజకీయ తీర్పుగానే తిరిగి వస్తాయి. ఇలాంటి సందర్భాల్లో రాజకీయాల్లో మొదట మారేది ప్రభుత్వాలు కాదు. ప్రజల రాజకీయ దృష్టి. నిన్నటివరకు వ్యక్తుల చుట్టూ తిరిగిన చర్చ నెమ్మదిగా వ్యవస్థవైపు మళ్లుతుంది. రాజకీయాల్లో ప్రశ్నల స్వభావం మారినప్పుడు సమాధానాల స్వభావం కూడా మారక తప్పదు. అదే ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన మలుపు. ఎందుకంటే ఆ తర్వాత ప్రజలు నాయకులను కాదు. వారి పరిపాలనను కొలవడం ప్రారంభిస్తారు. ఈ ఉద్యమం రేపు ఎటువైపు వెళుతుందో కాలమే చెబుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. భారత రాజకీయాల్లో కొత్త ఓటర్ తన ఉనికిని గట్టిగా తెలియజేస్తున్నాడు. అతడు కులంతో మాత్రమే ఓటు వేయడం లేదు. మతంతో మాత్రమే స్పందించడం లేదు. ఉద్యోగం, విద్య అవకాశాలు, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాలు ఇప్పుడు అతని రాజకీయ నిర్ణయాల్లో కీలకంగా మారుతున్నాయి. ఈ మార్పును గుర్తించిన వారే రేపటి రాజకీయాలను అర్థం చేసుకోగలరు. గుర్తించలేని వారు గత విజయాల జ్ఞాపకాలతోనే మిగిలిపోతారు.

రాజకీయాల్లో ప్రతి సంఘటనకు ఒక తక్షణ ప్రభావం ఉంటుంది. కానీ కొన్ని సంఘటనలు అసలు అర్థ కాలం గడిచిన తర్వాతే బయటపడుతుంది. అందుకే ఆ అర్ధరాత్రి వెలవడిన ప్రకటనను ఒక పరిపాలన నిర్ణయంగా మాత్రమే చూడడం సరిపోదు. అది ఒక సమస్యకు ఇచ్చిన సమాధానమా? లేక మారుతున్న రాజకీయ వాస్తవానికి ఇచ్చిన తొలి అంగీకారమా? అన్నది రాబోయే పరిణామాలే చెబుతాయి. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం. ప్రజాస్వామ్యంలో ప్రతి నిర్ణయం అధికారంతో ప్రకటించబడుతుంది. కానీ కొన్ని నిర్ణయాలను రాయించేది ప్రజలే.

# ఒక తెలుగోడు, ఒక మొనగాడు...ఆయనే వేములపల్లి శ్రీకృష్ణ



నందిరాజు రాధాకృష్ణ
98481 28215

'చేయెత్తి జైకొట్టు తెలుగోడా! గతమెంతో ఘనకీర్తి గలవోడా' గీతం తెలుగు సాహిత్య కీర్తికిరీటంలో కలికి తురాయి. ఆ గీతంతో తెలుగు జాతి చైతన్యాన్ని మేల్కొల్పిన ప్రజాకవి, కమ్యూనిస్టు నాయకుడు కే.శే.వేములపల్లి శ్రీకృష్ణ అని ఈ తరంలో చాలామందికి తెలీకపోవచ్చు. ఆయన రాసిన ఒక గేయం దశాబ్దాలపాటు తెలుగునేల నాలుగు దిక్కులా పిక్కటిల్లింది. అన్ని భావాలు, అన్ని వాదాలు కలగలిపి సువిశాలాంధ్ర గళం వినిపించారు. తెలుగుజాతి చైతన్యాన్ని మేల్కొల్పిన ప్రజాకవి, 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా..!!' అన్న ఆయన పిలుపునకు యువత పౌరుషంతో పరుగులెత్తింది ఆ రోజుల్లో. తెలుగుతనాన్ని తట్టిలేపి దేశ రాజకీయాల్లో చైతన్యం కలిగించిన ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు నోట నర్తించిన ఆ గేయం. ఆయన ఒక నిబద్ధత కలిగిన విశాలాంధ్ర పాత్రికేయునిగా, పత్రిక ప్రధాన ఎడిటర్‌గా, పాత్రికేయ ప్రతిభను కనబరచారు. గుంటూరు జిల్లా పెదకాకాని హేమలత టెక్స్‌టైల్ మిల్‌వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. నిరాడంబరంగా నిజాయితీ ఊపిరికలిగిన కమ్యూనిస్టుగా జీవితం సాగించి, మూడుసార్లు శాసనసభ ప్రజాప్రతినిధిగా సేవలందించిన మహనీయుడు వేములపల్లి. 'మనసులోని అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పటం అలవర్చుకోండి. ప్రజల దైనందిన సమస్యలు తెల్సుకుని సాన్నిహిత్యం పెంచుకోండి. చెప్పే మాటలకూ, చేసే పనులకూ దూరం పెరిగే కొద్దీ మీకు ప్రజలు దూరమవుతారు. సిద్ధాంత పరిజ్ఞానంతోపాటు వాస్తవ పరిస్థితుల అధ్యయనం అవసరం' అనే స్ఫూర్తిదాయక వ్యాఖ్యలు ఆయన్ను చిరస్మరణీయునిగా నిలిపాయి.

విస్తృత జీవితానుభవాలతో, రాజకీయ ఉద్యమ సుభావాలతో రాటుదేలిన శ్రీకృష్ణ ఎలా ఉండేవారో పాత కమ్యూనిస్టు తరానికి; తలపండిన పాత్రికేయ మిత్రులకు మాత్రమే స్ఫురణకు వస్తా రు. కొద్దిమందికి ఆయన ఒక పాత్రికేయునిగా గుర్తు. విశాలాంధ్ర ఎడిటర్‌గా రాష్ట్రంలో పాతకాలం పత్రి కా పాఠకులకు తెలిసుండవచ్చు. తరతరాల సాహితీవేత్తలకూ, ప్రజాప్రతినిధులకు ఆదర్శనీయులుగా నిలిచారు.

రేపల్లెలోని బేతపూడిలో మధ్యతరగతి రైతు కుటుంబంలో వేములపల్లి శ్రీకృష్ణ 1917 జులై 30న (తండ్రి వేములపల్లి వెంకట్రామయ్య) జన్మించారు. పాఠశాలలో మాకినేని బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు, ఎం.పరంధామయ్య, పమిడిముక్కల లక్ష్మణరావు, కంఠంనేని వెంకటరత్నం తదితర ప్రముఖులు శ్రీకృష్ణకు సీనియర్లు. వారితో పరిచయం, ఆనాటి జాతీయోద్యమం, అతివాద సాహిత్యం ఆయనపై ప్రభావం చూపి కమ్యూనిజం వైపు అడుగులు వేయించాయి. గుంటూరులో బ్రాడీపేటలో చదువుతున్న కాలంలో పులుపుల వెంకటశివయ్య, ప్రభల కృష్ణమూర్తి, ప్రతాప రామసుబ్బయ్య, ఏటుకూరి బలరామమూర్తి, అమరవాది కృష్ణమూర్తి తదితరులతో ఏర్పడిన బంధాలు, సంబంధాలు కారణంగా 1935–36లో కమ్యూనిస్టు పార్టీ అనుబంధ విభాగంలో ప్రవేశించారు.



109వ జయంతి జులై 30

చీరాల ఐ.ఎల్.టి.డి. కార్మికుల సమ్మె పోరాటంలో పోలీసు కాల్పులు జరిగిన సమయంలో సమ్మెలోని కార్మికుల సహాయార్థం కన్యాశుల్కం నాటకం ప్రదర్శించి వచ్చిన ఆదాయమంతా కార్మికులకందించారు. బి.ఎ. పట్టా అందుకున్న తరువాత కొంతకాలం బందరు మ్యూచువల్ ఇన్సూరెన్సు కంపెనీలో ఉద్యోగం చేసారు. ఆ సమయంలో కామ్రేడ్ శివయ్య పిలుపుతో ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీ రహస్య యంత్రాంగ నిర్వహణ బాధ్యత చేపట్టారు. 1937లో కొత్తపట్నంలో నిర్వహించిన ప్రసిద్ధ రాజకీయ పాఠశాలకు హాజరై, ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించి లాఠీఛార్జిలో గాయపడ్డారు.. 1938లో కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం పొందారు. 1942– 43లో హిట్లర్ సైన్యాలను మాస్కో వద్ద రెడ్ ఆర్మీ అటకాయించి తిప్పికొడుతున్న రోజుల్లో 'మాస్కో పొలిమేరల్లో నా 'కోలాటం పాట, బెంగాల్ కరవుపై 'బ్రహ్మపట్నం పోదామంటే' అంటూ, కయ్యూరు వీరులపై...ఇలా ఎన్నో పాటలు రాశారు. 1948లో కమ్యూనిస్టు పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శిగా, అనంతరం రెండు సార్లు రాష్ట్ర పార్టీ కార్యదర్శివర్గ సభ్యులుగా, రెండు సార్లు జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికై సమర్థతతో బాధ్యతలు నిర్వర్తించారు. 1952లో బాపట్ల నుంచి, 1962, 1972లో మంగళగిరి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. శాసనసభలో కమ్యూనిస్టు పక్ష నాయకునిగా, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. 1965–66లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకై ఉద్యమం సందర్భంగా శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సి.ఆర్.ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి దాని నిర్మాణానికి విశేష కృషి చేశారు. భారత్ సోవియట్ మిత్రమండలి, శాంతి స్నేహ సంఘాల అభివృద్ధికి శ్రమించారు. 2000 ఏప్రిల్ 8న శ్రీకృష్ణ హైదరాబాద్‌లో కన్నుమూశారు. వేములపల్లి రాసిన

*'చేయెత్తి జైకొట్టు తెలుగోడా –*
*గతమెంతో ఘనకీర్తి గలవోడా–*
*వీర రక్తపుధార వారబోసిన సీమ, పలనాడు నీదెరా*
*– వెలనాడు నీదెరా*
*బాలచంద్రుడు చూడ ఎవరోయి –*
*తాండ్ర పాపయ్య గూడ నీవాడోయ్ –*
*నాయకీ నాగమ్మ, మల్లమాంబ, మొల్ల,*
*మగువ మాంచాల, నీ తోడబుట్టినవోళ్ళ*
*చేయెత్తి జైకొట్టు తెలుగోడా – గతమెంతో*
*ఘనకీర్తి గలవోడా*

పాట ఘంటసాల కంచుకంఠంతో ఆంధ్రదేశ యువతలో ఉత్తేజం మేల్కొలిపింది.



# పరిశ్రమల్లో భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

## రిస్కీ ఆపరేషన్లలో కాంట్రాక్ట్ కార్మికులతో పనులు చేయించొద్దు

### ఎఫ్‌టిసిసిఐలో జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని పరిశ్రమల్లో అత్యున్నత భద్రతా ప్రమాణాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు), గనుల శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం, యాజమాన్యాలు, కార్మికులు సమన్వయంతో పనిచేస్తూ బలమైన భద్రతా సంస్కృతిని పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. లక్డీకాపూల్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ)లో నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెండు రోజుల 'ప్రాసెస్ సేఫ్టీ ఆఫ్ కంబస్టిబుల్ డస్ట్స్' వర్క్‌షాప్‌ను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంబస్టిబుల్ డస్ట్స్‌పై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కంబస్టిబుల్ డస్ట్, గ్యాస్ లీకేజీల కారణంగా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రతా నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు.

**సిగాచి ఘటన ప్రతి పరిశ్రమకూ గుణపాఠం**

సిగాచి ఘటన ప్రతి పరిశ్రమకు గుణపాఠంగా నిలవాలని మంత్రి పేర్కొన్నారు. రూ.15 నుంచి రూ.20 లక్షల వ్యయంతో చేపట్టాల్సిన భద్రతా చర్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల అమూల్యమైన ప్రాణనష్టం, సంస్థకు వందల కోట్ల రూపాయల నష్టం సంభవించిందన్నారు. ప్రమాదకర విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులను నియమించవద్దని మంత్రి స్పష్టం చేశారు. కంబస్టిబుల్ డస్ట్, గ్యాస్ లీకేజీల వంటి ప్రమాదాల నివారణకు ప్రత్యేక భద్రతా మార్గదర్శకాలు రూపొందించి పరిశ్రమల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఫ్యాక్టరీల శాఖ డైరెక్టర్‌కు మంత్రి సూచించారు. కార్యక్రమంలో సిఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సూర్యనారాయణ, ఫ్యాక్టరీల శాఖ డైరెక్టర్ మోహన్ బాబు, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ ప్రతినిధులు, వివిధ పరిశ్రమలకు చెందిన సీనియర్ అధికారులు, నిపుణులు, సిమెంట్, ఫుడ్ ప్రాసెసింగ్, బొగ్గు, టెక్స్‌టైల్ తదితర రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు మరిన్ని చర్యలు

## కొనుగోలు కేంద్రాల్లో యంత్రాల వినియోగం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ ఉత్పత్తులు (వరి, పప్పు ధాన్యాల)సేకరణను మరింత వేగవంతం చేయడంతో పాటు రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కీలక




చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి బుధవారం పౌరసరఫరాల భవన్‌లో కమిషనర్, ఎక్స్ అఫీషియో ప్రధాన కార్యదర్శి ఎం. స్టీఫెన్ రవీంద్ర అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ సురేంద్ర మోహన్, టిజి మార్క్‌ఫెడ్ ఎండి రాహుల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకన్నారు. అధిక లావాదేవీలు జరిగే కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరతను అధిగమించేందుకు పూర్తిగా ఆధునీకరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆటోమేటెడ్ స్టాకర్లు, క్లీనర్‌కమ్ బ్యాగింగ్ యంత్రాలను ఏర్పాటు చేయాలని తద్వారా వాహనాల లోడింగ్ సమయం తగ్గి, ధాన్యం రవాణాతో పాటు ధాన్యం సేకరణ కూడ వేగవంతం అవుతుందన్నారు. అదేవిధంగా కస్టమ్ మిల్డ్ రైస్ (సిఎంఆర్) నిల్వల కోసం ప్రత్యేక గోదాముల స్థలాన్ని కేటాయించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే రాష్ట్రంలో ఉన్న 11 ధరల పర్యవేక్షణ కేంద్రాల ద్వారా నిత్యావసర వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు.

# వ్యవసాయ మార్కెట్లలో అవినీతి, అక్రమాలపై చర్యలు

## సిఎస్‌కు రైతు కమిషన్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ మార్కెట్లను బలోపేతం చేయడంతో పాటు అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ విజ్ఞప్తి చేసింది. బుధవారం సచివాలయంలో సిఎస్‌ను రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీ రెడ్డి కలిసి వ్యవసాయ మార్కెట్లపై సమగ్ర నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మార్కెట్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక సదుపాయాల కొరత, దళారీల దోపిడీ, అవినీతి, అక్రమాలు, అధికారుల పర్యవేక్షణ లోపాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. మార్కెట్లను బలోపేతం చేయడం, కనీస



సౌకర్యాలు కల్పించడం, ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్‌కు వారువిజ్ఞప్తి చేశారు. నివేదికను పరిశీలించి సంబంధిత శాఖలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ హామీ ఇచ్చినట్లు రైతు కమిషన్‌కు హామి ఇచ్చినట్లు ఛైర్మన్ కోదండరెడ్డి వెల్లడించారు.

# బిజెపి అగ్రనేతల మద్దతుకే కెటిఆర్ ఢిల్లీ పర్యటనలు

## ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ ప్రజల్లో ఆదరణ కోల్పోయిందని, అందుకే ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఢిల్లీ పర్యటనలు చేస్తూ బిజెపి అగ్రనేతల మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్‌లో రెండో స్థానానికి హరీశ్ రావు, కెటిఆర్ మధ్య పోటీ నడుస్తోందని, అందుకే ఇద్దరూ బిజెపి పెద్దలతో సంబంధాలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. అమిత్ షా అపాయింట్‌మెంట్ దొరకకపోతే కేంద్ర మంత్రులను కలుస్తున్నారని, పగటిపూట కేంద్ర మంత్రులతో సమావేశాలు, రాత్రిపూట బిజెపి పెద్దలతో చర్చలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. హైకోర్టు హైడ్రా వ్యవస్థను లేదా దాని పనితీరును తప్పుపట్టలేదని, కేవలం కమిషనర్ రంగనాథ్‌ను మాత్రమే మందలించిందని తెలిపారు. హైదరాబాద్‌లో అనేక చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను హైడ్రా పరిరక్షించిందని



చెప్పారు. గత రెండేళ్లలో కబ్జాకు గురైన దాదాపు మూడు వేల ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించిందని, వాటి మార్కెట్ విలువ దాదాపు రూ. లక్ష కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తున్నారని, హైడ్రా పనితీరుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయని బల్మూర్ వెంకట్ అన్నారు.

## ఆయిల్‌పామ్ రైతుల సమస్యలపై ప్రధాని

# అపాయింట్‌మెంట్ కోరిన మంత్రి తుమ్మల

### దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో సమావేశానికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయిల్ పామ్ రైతుల సమస్యలు, దేశంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అవసరమైన విధానపరమైన నిర్ణయాలపై చర్చించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ ఇవ్వాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన బుధవారం లేఖలు రాశారు. ప్రధానమంత్రి ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్‌పామ్ దేశాన్ని వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తున్న కీలక కార్యక్రమమని మంత్రి పేర్కొన్నారు. ఈ మిషన్ అమలులో దక్షిణాది రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు సాగులోకి వచ్చిన ఆయిల్ పామ్ విస్తీర్ణంలో 75 శాతం వాటా ఈ రాష్ట్రాలదేనని తెలిపారు. తెలంగాణకు నిర్దేశించిన 1.45 లక్షల హెక్టార్ల లక్ష్యంలో ఇప్పటికే 0.98 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి రాష్ట్రం దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు. అయితే కనీస హామీ ధర , దిగుమతి సుంకాల స్థిర విధానం, నాణ్యమైన మొలకల లభ్యత, ఆర్థిక సహాయాల వంటి అంశాల్లో కేంద్రం విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతులకు స్థిరమైన విధాన భరోసా కల్పిస్తేనే ఆయిల్‌పామ్ సాగు మరింత విస్తరించి, దేశం వంటనూనెల దిగుమతులపై ఆధారపడే పరిస్థితి తగ్గుతుందని తెలిపారు.ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో కూడిన బృందానికి ప్రధానమంత్రిని కలిసే అవకాశం కల్పించాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం ద్వారా రాష్ట్రాల ఉమ్మడి సమస్యలు, రైతుల అభిప్రాయాలు, ఆయిల్ పామ్ రంగ అభివృద్ధికి అవసరమైన విధాన సూచనలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.అలాగే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రాసిన లేఖలో ప్రధానమంత్రితో సమావేశం ఏర్పాటు చేయడంలో సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో జరిగే ఈ సమావేశం ఆయిల్‌పామ్ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పాత బకాయిల సంగతేంటి?

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై సిఎం ప్రకటనను స్వాగతిస్తున్నాం : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రతి ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం స్వాగతిస్తున్నామని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. అయితే గత 4 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలపై ప్రభుత్వం ముందుగా స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గత నాలుగు విద్యా సంవత్సరాల్లో చదువు పూర్తి చేసిన లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక కళాశాలలకు స్వయంగా ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వచ్చిందని వారు ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం పూర్తైన విద్యార్థులు కూడా ఇప్పటికీ సర్టిఫికెట్లు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఇతర బకాయిలను చెల్లించిన ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన బకాయిలను మాత్రం ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని ప్రకటించడం మాత్రమే కాకుండా, ఆ హామీని అమలు చేయాలని కోరారు.పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలన్నింటినీ ఒకేసారి విడుదల చేసి విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.



# హైడ్రాపై కెటిఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

## మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైడ్రాపై బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో నిర్వహిస్తున్న 'ముఖాముఖి' కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. బంగాళాఖాతంలో మునిగిపోయిన బిఆర్ఎస్ వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గాంధీ భవన్‌ను ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే వేదికగా భావిస్తున్నారని, అక్కడ వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి కలెక్టర్లతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని విధంగా ప్రజలతో నేరుగా ముఖాముఖి నిర్వహిస్తున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని మంత్రి పేర్కొన్నారు. పేదలు, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే విశ్వాసంతో గాంధీ భవన్‌కు వస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఇప్పటివరకు 30 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. గత 150 ఏళ్లలో చూడని ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఉందని, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామ గ్రామాన ప్రజలకు అవగాహన కల్పిస్తూ అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. రైతులు మెట్ట పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారని, ఆయిల్‌పామ్ సాగుపై కూడా ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని తెలిపారు.

# చెరకు సాగు పెంపుపై సమగ్ర కార్యాచరణ

## అధికారులకు సిఎస్ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచి, చక్కెర పరిశ్రమలను పునరుద్ధరించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు సాగు విస్తరణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం.86 మేరకు ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం గురువారం సచివాలయంలో సిఎస్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 12 చక్కెర కర్మాగారాల్లో ప్రస్తుతం 7 మాత్రమే పనిచేస్తున్నాయని, అవి పూర్తి సామర్థ్యంతో నడవాలంటే ఏటా 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమని, ప్రస్తుతం కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నులే ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. వరి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులు అవలంభిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026–27 వ్యవసాయ



సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల ప్రోత్సాహక విధానాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు చెరకు రైతులకు కూడా టన్నుకు రూ.500 ప్రోత్సాహకం ఇవ్వాలని, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నాలుగు ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు

భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకంలో భాగంగా రాష్ట్రంలో 4 ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు కేంద్రానికి సమర్పిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ భవ్య పథకంలో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్క్ ల పురోగతిపై రాష్ట్ర సచివాలయంలో బుధవారం సంబంధిత ఉన్నతాధికారులతో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పరిశ్రమలు వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సిక్తా పట్నాయక్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, భవ్య పథకంలో మొదటి దశలో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసే 4 ఇండస్ట్రియల్ పార్కులకు సంబంధించిన పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్ ను కేంద్రానికి ఈనెలాఖరులోగా అందచేస్తున్నామని తెలిపారు. ఒక్కో పార్కు 500 ఎకరాలకన్నా అధిక విస్తీర్ణంలో ఉంటుందని, ఇందుకుగాను భూసేకరణ ఇతర ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని తెలిపారు. వీటిలో కందుకూరు మండలం తిమ్మాపూర్, ఇబ్రహీంపట్నం ఎలిమినేడు, ఘట్కేసర్ మండలం మాదారం, చౌటుప్పల్ మండలం దండు మైలారం ఉన్నాయన్నారు. వీటిలో ఎలక్ట్రానిక్, సాఫ్ట్ వేర్ తదితర రంగాలకు చెందిన పరిశ్రమల ఏర్పాటుకు పలు ప్రముఖ కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. వీటితోపాటు, మరో 16 ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని ఆయన వివరించారు.

# అసమానతలు ఉన్నంతకాలం రిజర్వేషన్లు కొనసాగించాల్సిందే

## ఆగస్టు 7న జరిగే జాతీయ ఓబిసి మహాసభను విజయవంతం చేయాలి : అఖిలపక్ష బిసి నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో అసమానతలు, అస్పృశ్యత, కుల వివక్షత ఉన్నంతకాలం సామాజిక రిజర్వేషన్లు కొనసాగించాల్సిందేనని, జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి దక్కేవరకు జాతీయ స్థాయిలో బిసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో బెంగళూరులో ఆగస్టు 7న జరగనున్న జాతీయ ఓబిసి మహాసభ విజయవంతం చేయాలని కోరుతూ అఖిలపక్ష పార్టీలు, బిసి కుల సంఘాల నేతల సంయుక్త సమావేశం జరిగింది. కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బండారు దత్తాత్రేయ (మాజీ గవర్నర్), సిరికొండ మధుసూదనా చారి, వి.శ్రీనివాస్ గౌడ్ (బిఆర్ఎస్), ఈరావత్రి అనిల్ కుమార్( కాంగ్రెస్), జాజుల శ్రీనివాస్



గౌడ్ (బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు) లు ముఖ్య అతిథులుగా పాల్గొని 'హలో బిసి ఛలో బెంగళూరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేశంలో ఉన్న 60 శాతం బిసిల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి తాను లేఖ రాస్తానని తెలిపారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఢిల్లీలో కాక్రోచ్‌లు చేసిన పోరాటం ముగిసిన తర్వాత దేశవ్యాప్తంగా కొద్ది మంది రిజర్వేషన్ వ్యతిరేకులు ఆన్‌లైన్ ఉద్యమం పేరుతో రిజర్వేషన్ రద్దు చేయాలని సోషల్ మీడియా వేదికగా కుట్రలు చేస్తున్నారని, ఈ కుట్రలను ఛేదించడానికి బహుజన సమాజం ఏకం కావాలని పిలుపునిచ్చారు. వి.శ్రీనివాస్ గౌడ్, సిరికొండ మధుసూదనాచారి, ఈరావత్రి అనిల్‌లు మాట్లాడుతూ ఈ పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లు ప్రవేశపెట్టకపోతే పార్లమెంటును ముట్టడించడానికి బిసిలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చిన్న శ్రీశైలం యాదవ్, గుజ్జ కృష్ణ, శేఖర్ సగర, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాంకుర్మా తదితరులు పాల్గొన్నారు

## జెన్-జీ యువతకు కంగనా రనౌత్

# బహిరంగ క్షమాపణ చెప్పాలి

### సిపిఐ నేత డాక్టర్ కె.నారాయణ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జెన్‌జీ యువత, మహిళలను ఉద్దేశించి బిజెపి ఎంపి, సినీ నటి కంగనా రనౌత్ చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయమైనవి కావని, తక్షణమే ఆమె బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే సమయంలో బాధ్యతాయుతంగా, సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలను పెంచడంతో పాటు ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిస్తాయని అన్నారు. ఆమె అవమానించిన జెన్‌జీ యువతకు, మహిళలకు క్షమాపణ చెప్పడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అదేవిధంగా ప్రదర్శనకారులను ఉద్దేశించి గతంలో చేసిన 'బొద్దింకలు (కాక్రోచ్ ) వ్యాఖ్యలపై ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఆ వ్యాఖ్యల వల్ల కలిగిన బాధను గుర్తించి వాటిని సరిదిద్దుకునే వైఖరి న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని ప్రతిబింబిస్తుందని నారాయణ పేర్కొన్నారు.

# సింగరేణి అనుబంధ సంస్థ 'ఆప్మెల్'లో సోలార్ వెలుగు

## 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ను వర్చువల్‌గా ప్రారంభించిన సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి అనుబంధ సంస్థ అయిన విజయవాడలో ఉన్న ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్ (ఆప్మెల్) స్వర్ణోత్సవాల సందర్భంగా ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌ను సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి బుధవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్లాంట్‌లో కొత్తగా నిర్మించిన సిసి రోడ్లు, ఆర్‌సిసి రోడ్లను కూడా ఆయన ప్రారంభించారు. సింగరేణితోపాటు అనుబంధ సంస్థ అయిన ఆప్మెల్‌ను బహుముఖంగా విస్తరించే ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. 50 ఏళ్ల ఆప్మెల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.63.13 కోట్ల టర్నోవర్, రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాలను ఆర్జించడంపై ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. గత ఏడాది రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆప్మెల్‌ను సందర్శించిన సమయంలో ఇచ్చిన దిశానిర్దేశం, స్ఫూర్తితో సాధించిన విజయమని పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో స్వర్ణో



త్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ప్రస్తుతం ప్లాంటులో తయారు చేస్తున్న యంత్ర పరికరాలు, విడిభాగాలతో పాటు రానున్న రోజుల్లో వివిధ పరిశ్రమల ఆధునిక అవసరాలను పరిగణనలోనికి తీసుకుని వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టాలన్నారు. ఆప్మెల్ అభివృద్ధికి, ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడానికి, తద్వారా మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి సింగరేణి సంస్థ ఎప్పుడు సహకరిస్తూనే ఉంటుందన్నారు.

**సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో విద్యుత్ ఖర్చులలో భారీ ఆదా**

ఆప్మెల్ ప్లాంటు విద్యుత్, కాలనీ అవసరాలు కలిపి ప్రతీ ఏడాది రూ.60 లక్షల విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారని, ప్రస్తుతం రూ.1.24 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సోలార్ ప్లాంట్‌తో ఏడాదికి రూ.24 లక్షలు ఆదా అవుతాయని ఐదేళ్లలో పెట్టుబడి మొత్తాన్ని రాబట్టుకోవచ్చని, పర్యావరణ హిత చర్యలకు ప్రోత్సాహం అందించినట్లు అవుతుందన్నారు. ఆప్మెల్ చైర్మన్ ఎన్వికె శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంస్థ అభివృద్ధికి చేపట్టనున్న ప్రణాళికలను వివరించారు. సింగరేణి, కోల్ ఇండియా, ఎన్ఎండిసి సంస్థల నుంచి లభించిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం.తిరుమలరావు, ఇడి (కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. విజయవాడ ఆప్మెల్ నుంచి ఎండి ఎర్రన్న ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సర్టిఫికేట్లు విడుదల చేయండి

## దాసోజుశ్రవణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో సంబంధం లేకుండా, ఎటువంటి షరతులు విధించకుండా రాష్ట్రంలోని నిజాం కళాశాల, కోటి మహిళా కళాశాల, సైఫాబాద్ సైన్స్ కళాశాల, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సహా' అన్ని ప్రభుత్వ, అనుబంధ, అటానమస్ కళాశాలల్లో నిలిపివేసిన ఒరిజినల్ సర్టిఫికేట్లను విద్యార్థులకు వెంటనే అందజేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజుశ్రవణ్ డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పులను, యుజిసి, ఎఐసిటిఇ నిబంధనలను ఉల్లంఘిస్తూ, విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసి, బలవంతపు ఫీజు వసూళ్లకు పాల్పడుతున్న నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర కళాశాలల ప్రిన్సిపాల్స్‌పైన తక్షణమే విచారణ చేపట్టి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి విద్యాసంస్థలకు అందాల్సిన వేలాది కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, హైకోర్టు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఆ బకాయిలపైన స్పష్టమైన కాలపరిమితితో కూడిన షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించాలని దాసోజుశ్రవణ్ బుధవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను, టోల్‌ఫ్రీ నంబర్‌ను విద్యాశాఖ ద్వారా ఏర్పాటు చేయాలని అన్నారు.


**పేరు మార్పు**

**వంకూడవత్ విజయ కుమార్, తండ్రి: చిమ్మ** (పాత పేరు) కలిగి ఉన్నది. ఇంటి నెంబర్: 5-23, బక్కలింగైపల్లి, అక్కవరం, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
ప్రస్తుతం **వంకుడవత్ విజయ్ కుమార్, తండ్రి: వంకుడవత్ చిమ్మ** అని ఆధార్ కార్డు, పాన్ కార్డు తో పాటు అన్ని రికార్డులు **విజయ్ కుమార్**గా నమోదు అయి ఉన్నది. దీనికి పరిగణంలోకి తీసుకొని **వంకుడవత్ విజయ్ కుమార్** గా అవకాశం కల్పించాలని కోరడం జరిగింది.

తెలంగాణ ప్రభుత్వం
**పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయం, మిషన్ భగీరథ, సర్కిల్, కరీంనగర్.**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
NIT No.03/SE/MB/KNR/2026-27, Dt: 29.07.2026
దిగువ సంతకందారు హనుమకొండ జిల్లా యందు గ్రామీణ త్రాగునీటి సరఫరాకు మెరుగుదల పనుల సంఖ్య (01 No) - 2వ పిలుపు, **అంచనా వ్యయం:** 28.00 లక్షలకు (DMFT గ్రాంట్) గాను **తేదీ: 31.07.2026** నుండి బిడ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. తదుపరి వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ WWW.tenders.telangana.gov.in, లో చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజనీర్
మిషన్ భగీరథ సర్కిల్, కరీంనగర్
DIPR R.O. No. : 6955-PP/CL/ADVT/2026-27, Date: 29-07-2026

## వర్షాకాలంలో అప్రమత్తం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/హయత్ నగర్:** వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు మ్యాన్ హోల్స్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం క్లీన్ చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎమ్మెల్యే లింగోజిగూడ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ హనుమాన్ దేవాలయం వద్ద రెండు రోజులుగా వర్షపు నీటిలో డ్రైనేజీ నీరు కలిసి రోడ్డు మీద నిలిచి ఉండడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలిసి కాలనీవాసుల సూచన మేరకు సుధీర్‌రెడ్డి బస్తిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి గత కొన్ని రోజులుగా వరదనీరు తొలగిస్తున్న మళ్ళీ వచ్చి చేరుతుందని ఎమ్మెల్యేకి తెలిపారు. కార్యక్రమంలో తిలక్ రావు, కాలనీ అధ్యక్షులు రాము, జనరల్ సెక్రెటరీ జగన్నాథరెడ్డి, రాజు యాదవ్, జగన్మోహన్ పాల్గొన్నారు.

## సర్‌లో 83.73శాతం డిజిటలైజేషన్ పూర్తి

షాద్‌నగర్ ఆర్‌డిఒ సరిత




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన ఓటర్లకు ఓటుహక్కు కల్పించాలనే లక్ష్యంతోనే ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతోపాటు 83.73శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశామని షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత వివరించారు. బుధవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో సర్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ సరిత మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఇప్పటి వరకు 83.73శాతం డిజిటలైజేషన్ పూర్తి చేశామని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసిన తరువాతే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పనులు వేగంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతల ఏర్పాటు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** వర్షపు నీటిని ఒడిసి పట్టడంతోపాటు భూగర్భ జలాలను పెంచేందుకు ప్రతి ఒక్కరు విధిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని వెల్‌జర్ల సర్పంచ్ రాత్లావత్ బాబునాయక్ సూచించారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల గ్రామంలో సర్పంచ్ బాబునాయక్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబునాయక్ మాట్లాడుతూ వర్షపు నీటిని వృథా పోనివ్వకుండా ఒడిసి పడితే భూగర్భ జాలాలు పరిగే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ దొడాల వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు పవన్‌కుమార్, రవినాయక్, రమేష్, వెంకటయ్య, కావలి లక్ష్మయ్య, లావణ్య దేవేందర్, దొడ్డి లక్ష్మి రవీందర్, ప్రవళిక మహేష్, చందర్‌నాయక్, వడ్ల అనిత ఆచారి, తుప్పారి వనజ కుమార్, పంచాయతీ కార్యదర్శి బాల మల్లేష్, జీపిఓ విష్ణు తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజలందరి సహకారంతోనే 99.80శాతం డిజిటలైజేషన్ పూర్తి



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రజలందరి సహకారంతోనే మండలంలో 99.80 శాతం ఎన్యుమరేషన్‌ను డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరిగిందని కొందుర్గు తహసీల్దార్ అజం అలీ అన్నారు. బుధవారం కొందుర్గు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అజం అలీని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు రాములుగౌడ్, మాజీ ఎంపిటిసిలు మల్లేష్ గౌడ్, అంజిరెడ్డి, బిఆర్ఎస్ నేత రెడ్డి నర్సింలు, సిపిఎం నేత గోపాల్, రాజేందర్ గౌడ్, దుర్గని శ్రీను, జీపివోలు హరిష్, నరేష్, శ్రీకాంత్, రామస్వామి, దశరథ్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. రోడ్డు ప్రమాదాలు అరికట్టండి

ట్రాఫిక్ డిసిపి శివం ఉపాధ్యాయ



**ప్రజాపక్షం/కొత్తూరు:** ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు వాహనదారులు కృషి చేయాలని ట్రాఫిక్ డిసిపి శివం ఉపాధ్యాయ సూచించారు. బుధవారం కొత్తూరు మున్సిపాలిటిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డిసిపి శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ చేసే సమయాల్లో విధిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకొని డ్రైవింగ్ చేయాలని, ఇతర వాహనదారులు సీట్ బెల్టు పెట్టుకొని డ్రైవ్ చేస్తే ప్రమాదాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎసిపి చంద్రశేఖర్, షాద్‌నగర్ ట్రాఫిక్ సిఐ శంకరయ్యతోపాటు సిబ్బంది ఉన్నారు.

# అంతర్ రాష్ట్ర చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు

7 తులాల బంగారం, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి




**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** వ్యవసాయ పొలాలకు ఒంటరిగా వెళ్తున్న మహిళలను టార్గెట్ చేసుకొని చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన అంతర్ రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు ఫ్యూచర్ సిటి పోలీస్ కమీషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. షాద్‌నగర్ డిసిపి శిరీష కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సిపి తరుణ్ జోషి మాట్లాడుతూ జూలై 25న కేశంపేట మండలం సంతాపూర్ గ్రామానికి చెందిన సోమరాజు బాలమ్మ ఒంటరిగా వ్యవసాయ పొలానికి వెళ్తున్న సమయంలో వెనుక నుండి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మెడలో నుండి నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు తీసుకువెళ్ళినట్లు తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలు, సిసి కెమెరాలు, నిఘా సమాచారంతో దర్యాప్తు చేపట్టగా పంజాబ్ రాష్ట్రానికి చెందిన సుఖ్‌దేవ్ సింగ్ (38), శంషేర్ సింగ్ (36), మన్‌ప్రీత్‌సింగ్ (24) అనే ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలను బుధవారం కేశంపేట ఎక్స్‌రోడ్డులో అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయాలు బయటకు వచ్చాయని తెలిపారు. కేశంపేటతోపాటు కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో మహిళ మెడలో నుండి మూడు తులాల బంగారు గొలుసు ఈ ముఠా తీసుకువెళ్ళినట్లు తెలిపారు. ఈ ముగ్గురిపై ఇప్పటికే కొత్తకోట, కేశంపేట, కడ్తాల్ పోలీస్ స్టేషన్లలో చైన్ స్నాచింగ్ కేసులు ఉండటం తోపాటు మహబూబ్‌నగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మోటర్ సైకిల్ చోరీ కేసు సైతం ఉన్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును సమర్థవంతంగా చేధించినందుకు పోలీస్ సిబ్బందికి నగదు రివార్డులు అందించారు. ప్రజలు నివాస ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతోపాటు అనుమానాస్పద వ్యక్తులు ఉంటే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అంధించాలని సూచించారు. సమావేశంలో షాద్‌నగర్ డిసిపి శిరీష, ఎసిపి లక్ష్మీ నారాయణ, కేశంపేట సిఐ నరహరి, రూరల్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ టి.రాజ్‌కుమార్, జోనల్ క్రైమ్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు రాకుండా పైపులైన్ పనులు

సిఎంసి కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** వర్షకాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పైపులైన్ పనులను ముందస్తు చర్యలను వేగవంతంగా పూర్తి చేయాలని సైబారాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, సైబారాబాద్ పోలీస్ కమీషనర్ రమేష్ సూచించారు. బుధవారం సిఎంసి కమీషనర్ సృజన మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ఏరియాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపు నీరు ఎక్కడ రోడ్లపైన గాని ఇతర ప్రాంతాలలో వాటర్ లాగింగ్ సమస్యలు రాకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీరు వేగంగా వెళ్ళేలా బాక్స్ డ్రెయిన్ ఏర్పాటు చేయాలని అదేశించారు. లోతట్టు ప్రాంతాలలో రెక్టాంగ్యులర్ డక్ట్ సెక్షన్లతో క్యాచ్ పిట్లు నిర్మించి, సిఓడీ జంక్షన వద్ద క్యాచ్‌పిట్లపై ఎంఎస్ గ్రిల్స్ ఏర్పాటు చేసి డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యన్ని పెంచి, నీటి ప్రవాహనికి అడ్డంకులు తొలగించి పనులను గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం ఏరియాలలో పనులు జరుగుతున్న ప్రదేశాలలో ట్రాఫిక్ సమస్యలు తలేత్తకుండా భద్రతా ప్రమాణాలు పాటించడంతో పాటు అవసరమైన ట్రాఫిక్ మళ్ళింపులపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించి పనులను పూర్తి చేయాలని కోరారు. పర్యటనలో సైబారాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్‌తో పాటు సైబారాబాద్ జాయింట్ కమీషనర్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ అడిషనల్ డిసిపి హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసిపి చంద్రశేఖర్ రెడ్డి, సిఎంసి డిప్యూటీ కమీషనర్, ఏఈ, ఏఈఈ, హైడ్రా సిబ్బంది, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు లేకుండా డేటా నమోదు

జిహెచ్ఎంసి జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్ఐఆర్ గణన పత్రాల డిజిటలైజేషన్‌లో తప్పులు దొర్లకుండా డేటాను నమోదు చేయాలని జిహెచ్ఎంసి జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ ఆర్.వి.కర్ణన్ సంబంధిత సిబ్బందికి సూచించారు. సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పతిగడ్డ మోడల్ మార్కెట్ పరిధిలోని 1626 పోలింగ్ కేంద్రాలలో 'ఎస్ఐఆర్2026' గణన పత్రాల డిజిటలైజేషన్‌ను జిహెచ్ఎంసి జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ ఆర్.వి. కర్ణన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటలైజేషన్ ప్రక్రియను సకాలంలో, కచ్చితంగా తప్పులు లేకుండా పూర్తి చేయాలన్నారు. కచ్చితమైన, సమగ్రమైన, నవీకరించబడిన ఓటర్ల జాబితా తయారీకి వీలుగా డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

## జిహెచ్ఎంసిలో బోనాల పండుగ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐఎన్‌టియుసి అనుబంధమైన మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ (ఎంఎస్ఎంయూ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం బోనాల పండుగను అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంయూ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్, ఎంఎస్ఎంయూ ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ గాంధీ, అదనపు ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, మహిళా విభాగం చైర్‌పర్సన్ ఎల్. మెర్సీతో పాటు పలువురు ప్రముఖులు మాజీ ఎంపి ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవరెడ్డి, మంత్రి వివేక్ వెంకట్ స్వామి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఆర్డీ చంద్రశేఖర్‌తో పాటు బాబర్ సలీం బాషా, విజయ్ కుమార్ యాదవ్‌తో పాటు జిహెచ్ఎంసి కార్మికులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ బోనాల పండగ తెలంగాణ సంస్కృతిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన పండుగల్లో ఒకటని అన్నారు. ఈ పండగ సోదర భావం, ఐక్యత, మతసామరస్యాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.

## 'నాలాలో' గల్లంతైన వృద్ధుడి కోసం గాలింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్/మియాపూర్:** హాఫీజ్‌పేట్, మదీనాగూడ వైశాలినగర్ రైల్వే అండర్ పాస్ వద్ద రోడ్డు దాటుతుండగా వరద కాలువలో పడి గల్లంతైన వృద్ధుని కోసం హైడ్రా చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి సమయంలో 70 ఏళ్ల వృద్ధుడు ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయినట్టు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైడ్రా వెంటనే తన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్), మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లను, పోలీసులు, సీఎంసీ మున్సిపల్ సిబ్బందిని రంగంలోకి దిగి గాలింపు చర్యలు మొదలుపెట్టారు. కాగా ఈ వరద కాలువ మదీనాగూడలోని ఈర్ల చెరువులో కలుస్తుంది. ఆ తర్వాత గంగారం పెద్ద చెరువులో కలుస్తుంది. ఈర్ల చెరువు అభివృద్ధి పనులు జరుగుతుండడంతో కాలువను నేరుగా గంగారం పెద్ద చెరువుకు డైవర్ట్ చేయడంతో అదే క్రమంలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ 3 కిలోమీటర్ల మేర పైపులైన్‌లోకి బాక్స్ డ్రైన్‌లోకి దిగి హైడ్రా డీఆర్ఎఫ్, ఎంఆర్టీ బృందాలు గాలించినా ప్రయోజనం లేకపోయింది. గాలింపు చర్యలను హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణతో పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పర్యవేక్షించారు. బాలయ్య కుటుంబ సభ్యులను ఆరెకపూడి గాంధీ పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

## వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేష్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలలో శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్ నిర్వహణ చేపట్టి, వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్, మాదాపూర్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్, మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లను సందర్శించి అక్కడి మౌలిక సదుపాయాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, ట్రాఫిక్ నిర్వహణ విధానం, పోలీసు సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత సమర్థవంతమైన,పారదర్శకమైన పోలీసింగ్ అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా స్టేషన్‌లలో మౌలిక వసతులను సక్రమంగా నిర్వహిస్తూ, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో వేగం, సిబ్బంది సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిపి పేర్కొన్నారు. అనంతరం ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టిటిఐ)ను కూడా సందర్శించిన సిపి, ట్రాఫిక్ సిబ్బందికి అందిస్తున్న శిక్షణ విధానాన్ని సమీక్షించారు. విధి నిర్వహణలో వృత్తి నైపుణ్యం, మర్యాదపూర్వక ప్రవర్తన, ప్రజా సేవా దృక్పథానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల సందర్భంగా వాహనదారులు, ప్రజలతో మర్యాదగా, సంయమనంతో వ్యవహరించాలని, చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తూనే ప్రజల గౌరవాన్ని కాపాడే విధంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి చర్యలో వృత్తిపరమైన నడవడి, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి పాటించాలని కోరారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, ట్రాఫిక్I డిసిపి రవికుమార్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఎడిసిపి హనుమంతరావు, మాధాపూర్ ట్రాఫిక్ ఎసిపి చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముమ్మరంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పనులు : కలెక్టర్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, ఇఆర్ఒ లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మ్యాపింగ్ అనంతరం అందిన తాజా డేటా ఆధారంగానే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. హేతుబద్ధీకరణలో ప్రధానంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో సాధ్యమైనంత వరకు 1,200 మంది ఓటర్ల పరిమితిని పాటించడంతోపాటు, ఒకే కాలనీ లేదా ఒకే నివాస సముదాయానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కొన్ని కాలనీల్లో ఒకే కుటుంబం లేదా ఒకే నివాస సముదాయంలోని ఓటర్లు రెండు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు విభజించబడిన సందర్భాలు ఉన్నాయని, అలాంటి సమస్యలను ప్రస్తుత హేతుబద్ధీకరణ దశలో పూర్తిగా పరిష్కరించడం సాధ్యం కానప్పటికీ, ముసాయిదా ఓటరు జాబితా(డ్రాఫ్ట్ రోల్ ) ప్రచురించిన తర్వాత ఫారం 8 ద్వారా సవరణలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు దిశగా పని చేస్తున్నామన్నారు. రాజకీయపార్టీలతోనూ నిరంతర సమావేశాలు కొనసాగిస్తున్నామని, అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో సమావేశాలు నిర్వహించి పెండింగ్ అంశాల వివరాలను వారికి అందజేశామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఇన్‌స్పైర్ 2026 కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై మాట్లాడుతూ ఆరుట్ల తెలంగాణ ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఆరుట్ల పబ్లిక్ స్కూల్‌లో డిగ్రీ కళశాల ఏర్పాటు కృషి చేస్తానని హామీఇచ్చారు. అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రహతో విద్యను అభ్యశించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ వెంకటేశ్వర్లు, ఎసిపి కెపివి రాజు, వ్యక్తిత్వ నిపుణులు రాఘవేందర్, అబిషేక్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించొద్దు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు:** తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించొద్దని, మిషన్ భగీరథ అధికారులు తీరు మార్చుకొని పని చేయాలని.. పల్లెల్లో వారాల కొద్ది తాగునీరు సరఫరా చేయకుంటే మీరు ఎందుకు అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కొత్తూరు మండలం ఎంపిడివో ఆఫీస్‌లో మండల స్థాయి అధికారులు, సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ పైపులైన్లు సక్రమంగా వేయలేదని, వారాల కొద్ది తాగునీరు సరఫరా చేయడం లేదని వివిధ గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎక్కడ పడితే అక్కడ పైపులైన్లు లీకేజీలు, మరమ్మత్తులు సక్రమంగా లేవని, గ్రామాల్లో ఉన్న నీటి ట్యాంకుల్లోకి నీరు చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కల్పించుకొని మిషన్ భగీరథ అధికారులు ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండాల్సింది పోయి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నాసిరకం పైపులు, పనులు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇందుకు మిషన్ భగీరథ అధికారులు స్పందిస్తూ నెల రోజుల్లోగా కొత్తూరు మండలంలో ఉన్న మిషన్ భగీరథ పనులు పూర్తి చేసి సక్రమంగా నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, ట్రాన్స్‌కో అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయిందని సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ స్థంబాలు విరిగిపోవడమే కాకుండా లోవోల్టేజీ సమస్య ఉందని సర్పంచ్‌లు తెలిపారు. దాంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కల్పించుకొని పంచాయతీల్లో విద్యుత్ సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, లోవోల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాల్లో మరమ్మత్తులు చేసి నియంత్రించాలని సూచించారు. గూడూరు గ్రామానికి గ్రంథాలయాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ దయానంద్ గుప్తా ఎమ్మెల్యేను కోరారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కాకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపిడిఒ అరుంధతి తెలిపారు. సమావేశంలో డిప్యూటి తహశీల్దార్ జంగయ్యతోపాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను నిష్పక్షపాతంగా పరిరక్షించాలి

### సిపిఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి ఉమామహేష్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రాష్ట్ర ముఖ్యమంత్రి నిష్పక్షపాతంగా వ్యవహరించి గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కబ్జాకు గురైన అన్ని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటన ద్వారా సూచించారు. సిఎం తమ సొంత పార్టీ నాయకుల అభిప్రాయాల మేరకు హైడ్రాను సొంత సంస్థలా ఉపయోగించుకోవటం వల్లే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను పదవి నుండి తొలగించాలని చెప్పటానికి కారణమైందన్నారు. హైడ్రా చేపట్టిన కబ్జాల కూల్చివేతలతో అధిక శాతం బిఆర్ఎస్ పాలనలో నష్టపోయిన కబ్జాదారులు న్యాయస్థానాల్లో దాఖలు చేస్తున్న తప్పుడు పత్రాల సాయంతో తమ కబ్జాలు కాపాడే యత్నాల కారణంగా హైడ్రాపై బురద జల్లటమని ఆయన అభిప్రాయపడ్డారు. హైడ్రాపై సిపిఐకి భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికి చెరువులు, కుంటలను అభివృద్ధి చేయటంలో సత్ఫలితాలు సాధించి ప్రజల మన్ననలు పొందారని, అయినప్పటికి పరికి చెరువు లాంటి కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు తొలగించటంలో విఫలమయ్యారన్నారు.




## ఎలివేటెడ్ కారిడార్‌కు భూ యజమానులకు నష్టపరిహారం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** సికింద్రాబాద్ నుండి శామీర్‌పేట వరకు కొనసాగుతున్న ఎలివేటెడ్ కారిడార్ పనులకు గాను మేడ్చల్ జిల్లాలోని ఆల్వాల్ పరిధిలో భూములిచ్చిన వారికి నష్టపరిహారంగా గజానికి రూ. లక్షా 10 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలివేటెడ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, జిల్లా పరిధిలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకొందన్నారు. ఇప్పటికే పోతాయిపల్లి, లోతుకుంట, తూంకుంట గ్రామాల పరిధిలో భూసేకరణ పూర్తయిందన్నారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా ట్రీ ప్లాంటేషన్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320హెచ్ ఆధ్వర్యంలో గ్లోబల్ కాజెస్ సెక్రెటరీ లయన్ కొత్త రాంబాబు పిఎంజేఎఫ్ నేతృత్వంలో బుధవారం ఇసిఐఎల్‌లోని ఎన్ఎస్ఐసి క్యాంపస్‌లో మెగా ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించి హెచ్ఎండిఎ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం,ఎన్ఎస్ఐసి సంయుక్తంగా 500 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి సలహాదారుగా వ్యవహరించిన లయన్ కొత్త రామారావు అతిథులకు స్వాగతం పలికి కార్ ర్యాలీని సమర్థవంతంగా సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ 320హెచ్ లయన్ అశోక్ కుమార్‌స్వైన్, ఎన్ఎస్ఐసి జిఎం శాంతి, సీనియర్ మేనేజర్ ఆనంద్‌కుమార్, లింగారెడ్డి, మనోహర్‌రెడ్డి, విష్ణుమూర్తి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## రోటర్‌డ్యామ్‌కు అంతర్జాతీయ అవార్డు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లిలోని రోటర్ డ్యామ్ అంతర్జాతీయ పాఠాలకు రికగ్నిషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ డైమెన్షన్స్ స్కూల్స్(రిడ్స్) ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. అంతర్జాతీయ దృక్పథం ప్రపంచస్థాయి సహకారం వినూత్న విద్యా బోధన అభ్యాస విధానాలను ప్రోత్సహిస్తున్నందుకు ఈ అవార్డు లభించింది. పాఠశాల తరపున ప్రధాన ఉపాధ్యాయురాలు కె.రూపారెడ్డి రిడ్స్ కో ఆర్డినేటర్ సుచిత్ర, పద్మావతిలు ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రూపారెడ్డి మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమిష్టి కృషికి నిదర్శనంగా అవార్డు దక్కిందన్నారు. విశిష్ట విజయాన్ని సాధించిన రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్ కుటుంబ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.





## ఫీల్డ్ అసిస్టెంట్స్ వేతనాలు చెల్లించాలి

### ఎంపిడిఒకు వినతిపత్రం అందజేత

**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండలంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు చెల్లించాలని దోమ ఎంపిడిఒ గ్యామాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫిల్డ్ అసిస్టేంట్లు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో ఇందిరమ్మ ఇళ్ల పోటో క్యాప్చర్ అంటెడెన్స్, వనమహోత్సవం తదితర బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ గత మూడు నెలల నుండి జీతాలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమ జీతాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఫీల్డ్ అసిస్టెంట్లు పాలొకగన్నారు.

## యంత్రంలో చిక్కుకుని కార్మికుడు మృతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** యంత్రంలో ఓ కార్మికుడు యంత్రంలో చిక్కుకుని మృతి చెందిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్2లోని సుదర్శన ఇండస్ట్రీస్‌లో విధులు నిర్వహిస్తున్న సిఎన్‌సి లేజర్ యంత్రం ఆపరేటర్ బత్తుల సురేష్‌బాబు(42) యంత్రం మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రంలో చిక్కుకుని తల, మొండెం విడివిడిగా అయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మృతుడి కుటుంబానికి 31 లక్షల నష్ట పరిహారం**

చర్లపల్లి ఓ కంపెనీలో ప్రమాదవశాత్తు మృతి చెందిన సురేష్‌బాబు కుటుంబానికి కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యంతో చర్చలు జరపగా మృతుడి కుటుంబానికి 31లక్షల రూపాయలు నష్ట పరిహారం చెల్లించేందుకు అంగీకరించారు.

## కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దుచేసే వరకు పోరాటం

### ఎఐటియుసి వికారాబాద్ జిల్లా 4వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎస్ విల్లాస్




**ప్రజాపక్షం/తాండూరు:** ఎఐటియుసి వికారాబాద్ జిల్లా 4వ మహాసభలు తాండూరు మండల పరిధి పెన్నా సిమెంట్ మైసమ్మ గండి ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. కామ్రేడ్ విజయలక్ష్మి పండిత్, కామ్రేడ్ బాల శంకర్, కామ్రేడ్ దశరథ్‌గౌడ్ అధ్యక్షతన జిల్లా మహాసభలను కార్మికుల భారీ ర్యాలీతో మంగళవారం ప్రారంభించారు. ముందుగా ఎఐటియుసి జెండాను ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ఎస్ విల్లాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసేది దేశంలోనే ఎఐటియుసి తొలి కార్మిక సంఘమన్నారు. బ్రిటిష్ కాలంలోనే 34 కార్మిక చట్టాలను ఎఐటియుసి సాధించిందని గుర్తు చేశారు. అందులో 8గంటల పనిదినాలు, ఐడి యాక్టు, కార్మికుల నష్టపరిహార చట్టం, ట్రేడ్ యూనియన్ చట్టాల ను సాధించడం జరిగిందన్నారు. కేంద్రంలోని ప్రభుత్వాలు కార్మికుల బలం ఏమిటో తెలుసుకోకుండా 100సంవత్సరాలు పోరాటం చేసి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టాలను తీసుకువచ్చి కార్మికుల కు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దుచేసే వరకు ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పెన్నా కార్మికుల వేతనాలు రూ.17,000కి పెంచాలని డిమాండ్ చేశారు. పెన్నాలో పనిచేస్తున్న ఏ కార్మికుడు కూడా రాజీనామా చేయవద్దని, కొత్త కాంట్రాక్టర్‌ను గతంలో మాదిరి ట్రాన్స్ ఫర్ చేయాలని పిలుపునిచ్చారు. సిసిఐ సివిల్ లేబర్‌కు పెంచిన వేతనం వెంటనే అందించాలని, పెన్నా కార్మికులకు అందరికీ సబ్సిడీపై ఆయిల్, బెల్లం, యూనిఫామ్ ఇతర వస్తువుల ను అందించాలన్నారు. ఎఐటియుసి పోరాటం వల్లే కార్మికులకు న్యాయం జరుగతుందన్నారు. ఐసిఎల్ ఫ్యాక్టరిలో ఎఐటియుసి మళ్లీ చిరుగుస్తుందన్నారు. ఎఐటియుసి నాయకురాలు విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ ఎఐటియుసి కార్మికుల సమస్యలపై నిరంతర రం పోరాటం చేస్తుందన్ని, ఈ పోరాటంలో పాల్గొంటున్న ఇండియా సిమెంట్ కార్మిక నాయకులకు విప్లవాభినందనలు తెలియజేశారు. ఈ మహాసభలో మాజీ ఎంపిపి శరణు బస్సప్ప, కామ్రేడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ రవిందర్, కామ్రేడ్ వంశీకృష్ణ, తహర్ పాష, జగ్గయ్య, అజయ్, రాజేశ్వర్‌రెడ్డి, పాండు, సిసిఐ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



## ఎల్‌నినోపై రైతులు ఆందోళన చెందవద్దు

### పిజెటియు ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య



**ప్రజాపక్షం/నవాబ్‌పేట్:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నప్పటికీ రైతు లు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య సూచించారు. బుధవారం నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వికారాబాద్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక మరియు విత్తన మేళా కార్యక్ర మం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమానికి తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా॥టి.రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించి అతిథులకు స్వాగతం పలికారు. ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, శాస్త్రీయ సాగు విధానాలు, వర్షాభావ పరిస్థితుల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడమే కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జ్యోతి నవాబ్‌పేట్ మండలంలోని వ్యవసాయ పరిస్థితులు, పంటల విస్తీర్ణం, వర్షపాతం పరిస్థితులు, శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి కవిత వికారాబాద్ జిల్లా వ్యవసాయ పరిస్థితులు, విత్తనాల లభ్యత, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించి, విశ్వవిద్యాలయం సూచించిన శాస్త్రీయ సిఫార్సులను రైతులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి సత్తార్ తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే కూరగాయలు, పండ్ల తోటలు, పూల సాగు, సూక్ష్మ సేద్య పద్ధతులను రైతులు అవలంబించాలని సూచించగా, సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటేశం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, నాణ్యమైన విత్తనాల పంపిణీ, రైతులకు అందిస్తున్న సాంకేతిక సేవలను వివరించారు. ఈ సందర్భంగా డా॥ టి.రాజేశ్వర్ రెడ్డి పత్తి, కంది, ఇతర పప్పు ధాన్యాలు, కూరగాయల పంటల్లో ఎల్‌నినో పరిస్థితుల్లో అనుసరించాల్సిన తేమ సంరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర పురుగు వ్యాధి నిర్వహణ, నీటి పొదుపు చర్యలపై రైతులకు సవివరంగా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ, భూగర్భ జలాలు, నేలలో తేమను సంరక్షించుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగం ద్వారా పోషక పదార్థాల వినియోగ సామర్థం పెరిగి, ఎరువుల వృథా తగ్గి దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. కొడంగల్, వికారాబాద్ ప్రాంతా న్ని అగ్రి స్టార్టప్, అగ్రి బిజినెస్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో విశ్వవిద్యాల యం పనిచేస్తోందని వెల్లడించారు. అనంతరం రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేసి, విత్తన మేళా స్టాళ్లను సందర్శించి నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ సాంకేతికతలు, ఉద్యాన పంట ల ప్రదర్శనలను పరిశీలించారు. అనంతరం ప్రగతిశీల రైతు జైపాల్ రెడ్డి సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సందర్శించి శాస్త్రీయ సాగు పద్ధతులను అభినందించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలకు శాస్త్రవేత్తలు, అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గోపాలకృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ఎఫ్‌పిఒలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం : పిఎసిఎస్ చైర్మన్ రాంరెడ్డి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కొనసాగుతోంది. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, భవిష్య త్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు ప్రజలను మొక్కలు నాటేందుకు, వాటిని సంరక్షించేందుకు చైతన్యపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని అర్కాతల గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని పిఎసిఎస్ చైర్మన్ పోలీస్ రాంరెడ్డి, గ్రామ నాయకుడు గంజాయి రాములు ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ రాంరెడ్డి మాట్లాడు తూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి సంరక్షించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. గ్రామ నాయకుడు గంజాయి రాములు మాట్లాడుతూ, హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామ ప్రజలందరూ ముందుకు రావాలని, పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించ వచ్చని పేర్కొన్నారు.

## సాయినాథుని సేవలో ఎమ్మెల్యే వివేకానంద్

**ప్రజాపక్షం/దుండిగల్:** సిఎంసి కొంపల్లి సర్కిల్ దూలపల్లిలోని సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహించిన ప్రత్యే క పూజ ల్లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ పాల్గొని సమర్థ సద్గురు సాయినాథ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బూర్గుబావి హన్మంత్ రావు, బూర్గుబావి సత్యనారాయణ, మాజీ ప్రజాప్రతినిధులు చింతల దేవేందర్ యాదవ్, డప్పు కిరణ్, సీనియర్ నాయకులు వారాల వినోద్, బర్మా రాజు, బర్మా ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



## యూత్ కమిటీ ఏర్పాటు



**ప్రజాపక్షం/నవాబుపేట్:** యువజన సంఘాలు గ్రామాభివృద్ధికి వెన్నెముకలు గా నిలుస్తాయి. యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సేవా కార్యక్రమాలు, సామాజిక చైతన్యం, ఐక్యతను పెంపొందించడంలో యువజన సంఘాల పాత్ర ఎంతో కీలకం, గ్రామ సమస్యల పరిష్కారంతో పాటు యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే దిశగా ఇలాంటి సంఘాలు నిరంతరం కృషి చేస్తుంటాయి. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల పరిధిలోని ఆర్కాతల గ్రామంలో యువత ను సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, గ్రామాభివృద్ధికి యువశక్తిని వినియోగించడం లక్ష్యంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న ఆధ్వర్యంలో యూత్ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ యూత్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కుమ్మరి రమేష్, ఉపాధ్యక్షుడిగా మీనపల్లి రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా గంజాయి రాజు, జాయింట్ సెక్రటరీగా వడ్డే శివ, ట్రెజరర్‌గా ఇందురుపాటి హరీశ్వర్ రెడ్డి ఎన్నికయ్యారు. వీరితో పాటు మొత్తం 11 మంది సభ్యులతో యూత్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత కార్యక్రమాలు, క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత చురుకుగా పాల్గొని గ్రామానికి ఆదర్శంగా నిలవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న సూచించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ పోలీస్ రాం రెడ్డి, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ 78శాతం డిజిటలైజేషన్ పూర్తి

### వికారాబాద్ కలెక్టర్ దీపక్‌తివారి




**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లా వ్యాప్తంగా 78 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మంగళవారం ప్రత్యేక సమగ్ర సవరణపై జిల్లా ఎన్నికల అధికారి జిల్లాలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఎస్ఐఆర్‌ను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎఎస్‌డి కేసులను గుర్తించి గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డులో ప్రదర్శించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. వికారాబాద్, తాండూర్‌లలోవలస ఓటర్లు ఎక్కువ ఉండడం వల్ల అటువంటి వాటిని కూడా ప్రత్యేకంగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నాట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ రెవన్యూ అధికారి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

**అకాల వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి:** జిల్లాలో అకాల వర్షాలు నేపథ్యంలోఅధికారులందరు అప్రమత్తంగా ఉండి జిల్లాలో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖల అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, కాలువల పరిసరప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. భారీ వర్షాలు పడితే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాలలో వాగులు, చెరువులను గుర్తించి గ్రామ పంచాయతీ వారీగా మ్యాపింగ్ చేసి రిపోర్టు అందించాలని ఆదేశించారు. పోలీస్ పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. వికారాబాద్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 70056కు సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, వెంకటచారి, తదితరులు పాల్గొన్నారు.



## పులుల సంరక్షణ పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

### అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/దుండిగల్ :** ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





## చిన్న జాతరలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా అనంతగిరి పద్మనాభ స్వామి దేవాలయంలో జరిగిన చిన్న జాతరలో వికారాబాద్ మున్సిపల్, చైర్‌పర్సన్ అనన్య, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చిన్న జాతర, పెరుగు బసంతంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వికారాబాద్ పట్టణంలోని దత్తాత్రేయయస్వామి దేవాలయాన్ని సందర్శించి, స్వామి వారి పూజలలో పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/దుండిగల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కలిసి దిగిన అరుదైన ఫోటోతో రూపొందించిన ఫ్రేమ్‌ను ఆయనకు జ్ఞాపికగా బహుకరించారు. ఆ ఫోటోను ఆసక్తిగా పరిశీలించిన జగన్ మోహన్ రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ, జ్ఞాపికను అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాయి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ రోడామేస్త్రీ నగర్‌లో రూ.31లక్షల వ్యయంతో అంతర్గత సిమెంటు రోడ్డు పనులకు, సుభాష్ చంద్ర బోస్ నగర్ ఏ లో రూ.62 లక్షల వ్యయంతో మంజూరైన అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్‌లో అభివృద్ధి కుంటుపడిందని, ముఖ్యంగా వర్షాకాలంలో కాలనీల్లో వరద నీరు నిల్వతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. నూతనంగా సిమెంటు రోడ్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుల సహకారంతో కోట్లాది రూపాయలను తీసుకువచ్చి అభివృద్ధి పరుస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, నాయకులు జాకీర్ బలరాం, బుచ్చిరెడ్డి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## పాలను నేలపాలు చేయొద్దు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** పాలాభిషేకం, క్షీరాభిషేకం పేరుతో పాల ను వృధా చేయకుండా పిల్లల పోషకాహారానికి వినియోగించుకోవాలని హైదరాబాద్ చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి జి.రోజారాణి విజ్ఞప్తి చేశారు. తల్లిపాల తర్వాత పిల్లలకు పాలు అత్యంత ముఖ్యమైన పోషకాహారమని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం 1 నుండి 10 ఏళ్ల పిల్లలకు రోజుకు సగటున 400600 మిల్లీలీలర్ల పాలు అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తి, పాడి పరిశ్రమ సవాళ్లను దృష్టిలో ఉంచుకుని విలువైన పాలను వృథా చేయకుండా అవసరమైన పిల్లలకు అందేలా చూడాలని కోరారు. పాలాభిషేకం బదులుగా అదే పాలను అనాథాశ్రమాలు, అంగన్‌వాడిలు, ప్రభుత్వ పాఠశాల కు అందిస్తే సమాజానికి మేలు జరుగుతుందని, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు చిన్నారుల పోషకాహరంపై దృష్టి సారించాలని రోజారాణి అన్నారు.

# అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో ఉండాలని టిజిఎస్‌పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మింట్ కాంపౌండ్ నుంచి విద్యుత్ అధికారులతో సిఇ, ఎస్ఇ, డిఇలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరా, ప్రజలు,సిబ్బంది భద్రత, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అన్ని స్థాయిల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లినా, సరఫరాలో అంతరాయం ఏర్పడినా అధికారులు వెంటనే స్పందించి, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ముఖ్యంగా క్యూర్ రీజియన్ పరిధిలోని అధికారులు, ఆపరేషన్స్, మెయింటెనెన్స్ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యుత్ లైన్లకు అత్యంత సమీపంలో ఉన్న చెట్లు, ప్రమాదకరంగా మారే కొమ్మలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సేఫ్టీ కిట్లు, లైఫ్ జాకెట్లతో సిబ్బంది సిద్ధంగా ఉండాలని, వర్షాల సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ ఎంత ముఖ్యమో, ఆ పనుల్లో పాల్గొనే సిబ్బంది భద్రత కూడా అంతే ముఖ్యమని.. రక్షణ పరికరాలు అందుబాటులో ఉండేలా అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించడం జరిగింది. ముఖ్యంగా వరద నీరు నిలిచిన ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, నాలాలు, చెరువులు, ఇతర జలాశయాల సమీపంలో విధులు నిర్వహించాల్సి వచ్చే క్షేత్రస్థాయి సిబ్బందికి లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భద్రతా ప్రమాణాలను విస్మరించరాదని, సరైన రక్షణ పరికరాలు లేకుండా సిబ్బందిని ప్రమాదకర ప్రాంతాల్లో విధులకు పంపరాదని స్పష్టం చేశారు. అంతేకాకుండా వర్షాల సమయంలో ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజలు కూడా విద్యుత్ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తెగిపడిన విద్యుత్ తీగలు, వంగిన లేదా దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్పార్కింగ్ లేదా ఇతర ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే ప్రజలు స్వయంగా వాటిని సరిచేసేందుకు ప్రయత్నించకుండా వెంటనే ఎస్‌పిడిసిఎల్‌కు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులను 1912 కాల్ సెంటర్ ద్వారా లేదా వాట్సాప్ నెంబర్ 8712441912 ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. విద్యుత్ సేవలకు సంబంధించిన వివరాలను టిజిఎస్‌పిడిసిఎల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు.

## వ్యాపార రంగాలను ప్రోత్సహించాలి

అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** జిల్లాలో వ్యాపార రంగాలను ప్రోత్సహించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి తెలిపారు. జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈకామర్స్ సమ్మిట్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్ జిల్లాను ఎగుమతుల కేంద్రంగా తీర్చి దిద్దాలన్నారు. దీనికోసం ఎగుమతులను ప్రోత్సహించాలని చెప్పారు. జిల్లా ఉత్పత్తులను ఈకామర్స్ ప్లేస్‌తో పాటు ఇతర ఈకామర్స్ వేదికలపై నమోదు చేయించే అంశాలపై ఆయన చర్చించారు. ఎగుమతులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు. వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని పెంపొందించాలని చెప్పారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ గణేష్ రామ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ కార్యాలయం నుంచి ప్రదీప్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారెయిన్ ట్రేడ్, మినిస్ట్రీ ఆఫ్ మీడియం స్మాల్ అండ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్( ఎంఎస్ఎంఇ), ఇండియా పోస్ట్ తదితర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హెల్ప్‌డెస్క్‌లు ఉపయుక్తం

**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** సర్ ప్రక్రియలో భాగంగా వెంగళరావునగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సెంటర్‌ను కాంగ్రెస్ నేత దేవిరెడ్డి నాగార్జునరెడ్డి బుధవారం సందర్శించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ వెంగళరావునగర్ డివిజన్ ప్రెసిడెంట్ పూదోట శౌరి రాజు, వెంగళరావునగర్, సిద్ధార్థ నగర్ బూత్స్ కోఆర్డినేటర్ చిలకల వెంకటేశ్వరావు, బిఎల్‌ఏలు ఆనంద్, రవి, రాఘవేంద్ర, రామచంద్ర, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సంతోషంతో జీవించాలి



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** ప్రజలు సంతోషంతో జీవించాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. ఈ మేరకు గురు పూర్ణిమ సందర్భంగా శిర్డీ సాయి ద్వారకామాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సీ.బాలప్రకాశ్, గోలి మల్లారెడ్డి, బరిగెల జ్ఞానేశ్వర్, రాజమ్మ, రజని, లక్ష్మి , హేమ, రమ్య, పంతులు వికాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## కంటికి రెప్పలా కాపాడాలి



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** ప్రజలందరినీ కంటికి రెప్పలా కాపాడుతూ... అనారోగ్య పాలు కాకుండా అందరూ ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించు తల్లి అని మాజీ కార్పొరేటర్ ఏ.పావని అమ్మవారికి వేడుకున్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్ టిఆర్‌టిలోని వారాల పోచమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నేతలు వినయ్ కుమార్, వి.నవీన్ కుమార్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, శంకర్, రఘుయాదవ్, కనకరాజు యాదవ్ పాల్గొన్నారు.

## వర్షాలకు ప్రజలు అప్రమత్తం



**ప్రజాపక్షం/యాకుత్‌పురా:** వర్షాల నేపథ్యంలో యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్, చార్మినార్ జెడ్‌సి కన్నం సత్యనారాయణతో పాటు వివిధ విభాగాల అధికారులతో కలిసి బుధవారం మధ్యాహ్నం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పర్యటించారు. రెయిన్‌బజార్ ఎస్ఆర్‌టీ కాలనీ నాలా పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెరాజ్ మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## బోనాలు సంస్కృతికి చిహ్నం



**ప్రజాపక్షం/బేగంపేట్:** బోనాల ఉత్సవాలు మన సంస్కృతిని చాటి చెప్పే పండుగ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం రాంగోపాల్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజల అనంతరం బోనం ఊరేగింపును ఆయన ప్రారంభించారు.

## వల్లారపు జన్మదిన వేడుక



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ జన్మదినం బౌద్ధనగర్‌లోని ఆయన నివాసంలో నాయకులు గరిగె ప్రవీణ్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేయించి శాలువాలు కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## నేటి ధృవీకరణ.. రేపటి పరిరక్షణ



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** నేటి ధృవీకరణ..రేపటి ప్రజాస్వామ్య పరిరక్షణ అని బిఆర్ఎస్ నేత, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు, సికింద్రాబాద్ ఎస్సి, ఎస్టి, బిసి మైనారిటి సెల్ ప్రెసిడెంట్ మంద జగన్ తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ఆయన సర్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో చింతకింది మల్లేష్, ఉండేంటి, సచిన్, శీలం సాయియాదవ్, రాజేష్, పాక సాయి, మస్తాన్ బాబా, బేగారి తుకారాం, యదా క్రాంతి తదితరులు పాల్గొన్నారు.


### విద్యుదాఘాతంతో మృతిచెందితే..

# రూ.8 లక్షలు పరిహారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయే సాధారణ ప్రజల కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా కల్పించే దిశగా తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన శాఖేతర వ్యక్తుల కుటుంబాలకు ఇప్పటివరకు అందిస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.8 లక్షలకు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెంపుదల 2026 ఏప్రిల్ 1 నుంచే వర్తించేలా చేశారు. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టిజిఇఆర్‌సి) 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటైల్ సప్లయ్ టారిఫ్ ఉత్తర్వుల్లో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ల బోర్డు 196వ సమావేశంలో దీనికి ఆమోదం తెలిపింది. ఆమోదం అనంతరం సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. 2018లో అప్పటి తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (టిజిఇఆర్‌సి) ఆదేశాల మేరకు విద్యుత్ షాక్‌తో మరణించిన శాఖేతర వ్యక్తుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించే విధానాన్ని అమలు చేశారు. ఇదిలాఉండగా..మృతిచెందిన వ్యక్తి చట్టబద్ధ వారసులకు మొత్తం రూ.8 లక్షల పరిహారం అందజేస్తారు. అయితే మొత్తం నగదు రూపంలో కాకుండా రూ.7.20 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్, మిగిలిన రూ.80 వేలు నగదు రూపంలో చెల్లిస్తారు. ఇలా చేయడం ద్వారా బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

కలెక్టర్ ప్రియాంక ఆల



**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న ఎలక్ట్రిక్ స్కూటర్ల పంపిణీ పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. ఈస్కూటర్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై బుధవారం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమ్ సెలక్షన్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాకు ఈ పథకం ద్వారా 1200 ఎలక్ట్రిక్ స్కూటర్ల పంపిణీ చేయాలని లక్ష్యంగా ఉందన్నారు. దీనికోసం 28,045 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా అందాయని చెప్పారు. ఒక్కో స్కూటర్ ధర రూ.1.50లక్షలు కాగా ప్రభుత్వం 80 శాతం అనగా రూ.1.20లక్షలు ఇస్తోందన్నారు. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రూ. 14.40కోట్లు సబ్సిడీగా అందిస్తోందని చెప్పారు. దరఖాస్తుల పరిశీలన, ధ్రువీకరణ కోసం సంబంధిత మండల తహసీల్దార్లు కన్వీనర్లు, జిహెచ్ఎంసి, మైనార్టీస్ సంక్షేమ శాఖ ప్రతినిధులతో మండల స్థాయి కమిటీ ఏర్పాటుచేసామన్నారు. నిబంధనల ప్రకారం షార్ట్ లిస్ట్ చేసిన జాబితాను జిల్లా స్థాయి కమిటీకి పంపించాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ వీటిని పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేసి వాటికి ఆమోదం తెలుపుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఇలియాస్ అహ్మద్, జిహెచ్ఎంసి జాయింట్ కమిషనర్ దేవేందర్ రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ మహేష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# త్వరగా మై భారత్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ జిల్లాలో మై భారత్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి తెలిపారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన మై భారత్ హైదరాబాద్ కేంద్ర జిల్లా సలహా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై ఒకటో తేది నుంచి ప్రారంభమైన మైభారత్ నమోదు ప్రక్రియ ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని చెప్పారు. నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా చేపట్టాలన్నారు. జిల్లాలోని యువత, ప్రధానంగా విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని చెప్పారు. దీని కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆయన చర్చించారు. అవగాహన, ప్రచార కార్యక్రమాలు వివిధ ప్రభుత్వ శాఖలు విద్యాసంస్థల సమన్వయంతో యువతను నమోదు చేయించేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, కార్యాచరణపై ఆయన చర్చించారు. ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి ఆయా విద్యాసంస్థల ఫిజికల్ డైరెక్టర్లను నోడల్ అధికారులుగా నియమించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి శశాంక్, జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య, జిల్లా సంక్షేమశాఖాధికారి అక్కేశ్వర్‌రావు, ఇంచార్జి డిపిఆర్ఓ హబీబుద్దీన్. జిల్లా పర్యాటక శాఖాధికారి ప్రభాకర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సెల్ సమన్వయ కర్త డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఒల పాత్ర కీలకం

**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** సర్ ప్రక్రియలో బూత్ లెవల్ అధికారుల పాత్ర కీలకమని, అయితే ఈ విషయంలో కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారని ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ డా. పివి రవిశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. షేక్‌పేట్ ఓయూ కాలనీలో ఆయన మూడు రోజుల పాటు సర్ హెల్ప్ డెస్క్‌లను పర్యవేక్షించారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు చెర్క జ్యోతి, రఘునందన్, సత్యనారాయణ యాదవ్, అనంతరెడ్డి, గణేష్, వెంకట కృష్ణారెడ్డి, ఫిరోజ్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# అధికారులు అందుబాటులో ఉండాలి

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** వర్షాల నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి బుధవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కృష్ణానగర్ బీబ్లాక్‌లోని కమ్యూనిటీ హాల్ పరిసర ప్రాంతాన్ని సందర్శించిన ఎండీ, గత రెండేళ్లుగా వర్షాకాలంలో ఎదురవుతున్న నీటి నిల్వ సమస్య పరిష్కారానికి చేపట్టిన ప్రత్యేక డ్రైనేజీ లైన్, వర్షపు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి, మురుగునీటి ప్రవాహ మార్గాల మెరుగుదల పనులను సమీక్షించారు. అయితే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే నాలాలు, మ్యాన్‌హోళ్లలో పూడికతీత పనులను నిరంతరాయంగా కొనసాగించాలని ఆదేశించారు. అన్ని స్థాయిల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, హాట్‌స్పాట్లు, మ్యాన్‌హోళ్లు, నాలాలు, డ్రైనేజీ వ్యవస్థలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. పర్యటనలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ప్రభు, జీఎం ప్రభాకర్‌రావు, డిజిఎం, మేనేజర్లు హైడ్రా బృందం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలి

డాక్టర్ టిఎస్ ప్రవీణ్ డిమాండ్

**ప్రజాపక్షం/కవాడీగూడ:** గవర్నమెంట్ డిగ్రీ లెక్చరర్ల సీనియారిటీ జాబితాలో అవకతవకలు జరిగాయని.. ఇష్టానుసారంగా ప్రమోషన్లు ఇచ్చారని.. వాటిని వెంటనే రద్దుచేసి విచారణ చేపట్టాలని క్వాలిఫైడ్ గవర్నమెంట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్ డిమాండ్ చేశారు. ధర్నాచౌక్ వద్ద బుధవారం అసోసియేషన్ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ గవర్నమెంటు లెక్చరర్ సీనియార్టీ ప్రకారంగా కాకుండా జూనియర్లకు సమానంగా పదోన్నతి కల్పించడం రూల్స్‌కి విరుద్ధమన్నారు. అర్హత లేని జూనియర్లకు పదోన్నతులు కల్పించడంలో సంబంధిత అధికారులు, రాజకీయ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. జూనియర్ లెక్చరర్ ముందు వరుసలో ఉంచి సీనియర్లను జూనియర్లకు అక్రమంగా ప్రమోషన్లు ఇచ్చారని మండిపడ్డారు. వెంటనే సీనియారిటీ లిస్ట్ సరిదిద్ది అర్హత, సీనియార్టీ ప్రకారం 1998 బ్యాచ్ ముందు వరసలో ప్రమోషన్ లిస్టులో ఉంచాలని. సినీనటి ప్రకారమే ప్రమోషన్లు ఇవ్వాలని నొక్కి చెప్పారు. గతంలో ఇచ్చిన ప్రమోషన్లు వెంటనే రద్దు చేసి, అక్రమ ప్రమోషన్లకు హస్తమున్న అధికారులపై చట్టపరంగా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ బి. బాలయ్య, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ రాజు, అసోసియేషన్ నాయకులు రత్నమాల, సుజాత పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియ పరిశీలన



**ప్రజాపక్షం/నల్లకుంట:** సర్ ప్రక్రియను బుధవారం బల్దియా జోనల్ కమిషనర్ మంగతాయారు పరిశీలించారు. బూత్ నెంబర్లు 6, 7, 8, 9, 10, 11లను ఆమె సందర్శించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈనెల 31వ తేదీ లోపు ఓటర్లు ఎన్యుమరేషన్ ఫామ్‌లో వివరాలు రాసి బిఎల్ఓలకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బిజెపి నాయకులు రామ్ జగదీష్, శ్రవణ్ యాదవ్, రాఘవేందర్ గౌడ్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సూదిమందు కొరత

ఉస్మానియా ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** పేదోడికి రోగం వస్తే గుర్తుకువచ్చేది ఉస్మానియా ఆసుపత్రి. అందుకే అక్కడికి వైద్యో నారాయణో హరి అనుకుంటూ రోగులు, రోగి సహాయకులు పరుగులుపెడుతుంటారు. దేశంలోనే తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో ఇటీవలే అరుదైన వైద్య చికిత్సలు నిర్వహించి మరోమారు చరిత్ర సృష్టించిన విషయం విధితమే. అయితే ఓ వ్యాధికి సంబంధించిన మందులు ఉస్మానియాలో అందుబాటులో లేకుండాపోయాయి. దీంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. వివరాలలోకి వెళితే... ఏమో ఫీలియా చికిత్స కోసం ఫ్యాక్టర్, ఎమ్మిట్రా ఇంజక్షన్‌లు ప్రతి నెల ఇవ్వాల్సి ఉంటుంది. గడచిన ఐదు నెలల నుంచి ఉస్మానియా ఆసుపత్రిలో సంబంధిత సూది మందు కొరత ఏర్పడింది. దీంతో వ్యాధిగ్రస్తులు సూదిమందు లేక అల్లాడిపోతున్నారు. ఈ విషయంపై ఆరాతీస్తే బయట కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇంజక్షన్లు ఇవ్వడం నిలిపివేస్తే మెదడులో రక్త ప్రసరణకు అంతరాయం ఏర్పడి ఒక్కో సమయంలో రోగి మృతి చెందే అవకాశం ఉంటుంది. ఆర్థిక సోమత లేని పేద రోగులు ఉస్మానియాను నమ్ముకుని వస్తుంటే అక్కడ నెలకొన్న సూది మందు కొరత తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఇకనైనా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ పేద రోగుల పెన్నిదిగా పేరొందిన ఉస్మానియా ఆసుపత్రిని పట్టించుకోవాలని రోగులు, రోగి సహాయకులు కోరుతున్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీ అమలు పరచాలి

టియుఎఫ్ ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** తెలంగాణ ఉద్యమం 1996 నుంచి మొదలైన మలిదశ ఉద్యమానికి కొనసాగింపే తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ఉద్యమమని ఆత్మీయ సమ్మేళనం ముక్తకంఠంతో స్పష్టం చేసింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం టియుఎఫ్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. టీయూఎఫ్ ఉపాధ్యక్షుడు మన్నారం నాగరాజు ఆహ్వానంతో టి.హనుమండ్లు, విమలక్క, కపిలవాయి దిలీప్ కుమార్, సోహరా బేగం తదితరులు పాల్గొని ప్రసంగించారు. ముందుగా అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి సమావేశం ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే కమిటీకి చట్టబద్ధత కల్పించాలని, ఉద్యమ సంస్థల నుంచి వచ్చే రిపోర్టును కూడా గుర్తింపుకు ప్రాతిపాదిక చేర్చుకోవాలని సమ్మేళనం అభిప్రాయపడింది. ఈ మేరకు సమ్మేళనానికి 20 అంశాలతో కూడిన ప్రతిపాదనల్లో కొన్ని సవరణలతో సమ్మేళనం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ ప్రపోజల్స్ జులై 30, 2026న కేకే కమిటీకి అందించాలని సమ్మేళనం తీర్మానించింది. కార్యక్రమంలో టఫ్ మాజీ స్పోక్స్ పర్సన్ గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు రియాజ్, చింతమల్ల గురుజీ, ఎనిశెట్టి పాల్గొన్నారు.

## మాలలకు అన్యాయంపై 10న 'చలో ఢిల్లీ'



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** ఎస్‌సి వర్గీకరణ చట్టం, రోస్టర్ విధానంతో మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఆగస్టు 10న 'హలో మాల– చలో ఢిల్లీ' కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఏసి చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జెఏసి చైర్మన్ బేర బాలకిషన్, గౌరవాధ్యక్షులు చెరుకు రామచందర్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు తిరస్కరించి సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎస్‌సి వర్గీకరణ చేపట్టిందని, దీంతో మాలలకు ఉద్యోగాలు రావడం లేదన్నారు. ఈ విషయమై ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత లు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గేలకు కలిసి తమ గోడును వినిపిస్తామన్నారు. రాష్ట్ర మాల మంత్రులు, ప్రజాప్రతినిధులు సిఎం రేవంత్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చి మాలలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. లేనిపక్షంలో తమ ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జెఏసి వర్కింగ్ చైర్మన్ మంత్రి నర్సింహ్మ, మాదాసు రాహుల్, రమేష్ పండుగ, భానుతేజ, దాసరి రవి, శేపూరి ప్రణయ్ పాల్గొన్నారు.

# విద్యార్థుల విడుదల, పోలీసులకు శిక్షలు

## జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్



**న్యూఢిల్లీ :** విద్యార్థులపై పోలీసులు జరిపిన అణచివేతకు నిరసనగా, పలు వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు బుధవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టారు. ఇటీవల జరిగిన ప్రదర్శనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని, విద్యార్థి నిరసనలను నేరంగా చిత్రీకరించడాన్ని మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. మాజీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ముగిసిన రోజుల ఆందోళన కొద్ది రోజులకే, 'విద్యార్థి యువత ఐక్యత; వర్ధిల్లాలి' అనే నినాదంతో నిరసనకారులు జంతర్‌మంతర్ వద్ద గుమిగూడారు. బిహార్, బెంగాల్, ఇతర రాష్ట్రాల విద్యార్థులు, యువతపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం (జెఎన్‌యుఎస్‌యు)తో సహా వామపక్ష సంస్థలు ఇచ్చిన ఉమ్మడి పిలుపు మేరకు ఈ నిరసన జరిగింది. ఈ ప్రదర్శనలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్‌ఎ), ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఎఐఎస్‌ఎఫ్), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ), క్రాంతికారి యువ సంఘటన్ (కెవైఎస్), ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎఐడిఎస్‌ఒ), డిఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, పిఎస్‌ఎ, పిఎస్‌వైఎ, ఎసిఎన్‌ఎస్, కలెక్టివ్, దిశ, పచ్చాస్ తదితర సంస్థల సభ్యులు పాల్గొన్నారు. నిరసనకారులు 'ఛత్రోం కీ గిరఫ్తారీ బంద్ కరో' (విద్యార్థుల అరెస్టులను ఆపండి), 'ఛత్రోం కా క్రిమినలైజేషన్ నహీ చలేగా' (విద్యార్థులపై నేరారోపణలను ఆపండి) వంటి నినాదాలు చేశారు. 20న జరిగిన నిరసన ప్రదర్శన సందర్భంగా బల ప్రయోగం చేసిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలువురు ప్రదర్శనకారులు ప్లకార్డులు ప్రదర్శించారు. వాటిలో ఒకదానిపై, 'జులై 20న జరిగిన క్రూరత్వానికి బాధ్యులైన పోలీసులను శిక్షించండి' అని రాసి ఉంది. సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ఇటీవలి నిరసనలలో పాల్గొన్న వారిని అధికారులు లక్ష్యంగా చేసుకుంటున్నారని విద్యార్థి నాయకులు ఆరోపించారు. ఈ ఉద్యమానికి సంబంధించిన అనేక సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేశారని కూడా వారు పేర్కొన్నారు. నిరసనలు చేస్తున్నందుకు దేశవ్యాప్తంగా అధికారులు విద్యార్థులను ఎలా లక్ష్యంగా చేసుకుంటున్నారో అందరూ గమనిస్తున్నారని, వారు ఒంటరి వారు కారని, వారికి తాము అండగా ఉంటామన్నారు. లాఠీఛార్జికి విద్యార్థులు భయపడుతున్నారని అనుకుంటే, అది పొరపాటని క్రాంతికారి యువ సంఘటన్ (కెవైఎస్) సభ్యుడు ఒకరు అన్నారు. ఇటీవలి నిరసనలకు సంబంధించి అదుపులోకి తీసుకున్న విద్యార్థులందరినీ తక్షణమే విడుదల చేయాలని, విద్యార్థి కార్యకర్తలపై పోలీసుల చర్యలను నిలిపివేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

# అమిత్‌షాను పదవి నుండి తొలగించండి

ప్రధానమంత్రికి రాహుల్‌గాంధీ డిమాండ్
సభలో మాట్లాడనివ్వకుండా
నా గొంతు నొక్కుతున్నారు
బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులకు
క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు



**న్యూఢిల్లీ:** అమిత్‌ను కేంద్ర హోంమంత్రి పదవి నుండి తొలగించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీని లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థులపై జరిగిన క్రూరమైన లాఠీఛార్జి అణచివేత చర్యకు ఆయనే బాధ్యుడని అన్నారు.విద్యార్థులను అణచివేయాలని అమిత్ ఉత్తర్వులు జారీ చేసి ఉంటారని లేకపోతే ఆయన ఆ పరిస్థితులను నిర్వహించడం ఎలాగో చేతకాని అసమర్థుడైనా అయి ఉంటాడని మండిపడ్డారు. "లాఠీలకు మేకులు గుచ్చాలనే ఆలోచన పోలీసులకు ఎలా వచ్చింది? ఈ ఆలోచన ఎవరిచ్చారు?" అని ప్రశ్నించారు.విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించిన ప్రతిఒక్కరినీ జవాబుదారీగా నిలబెడతాం,విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తాం, ఇదే మేం ఇచ్చే హామీ అని చెప్పారు. న్యూఢిల్లీలోని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యాలయంలో పత్రికాగోష్ఠిలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, లోక్‌సభలో అమిత్ షాపై తాను చేసిన విమర్శలకు,డిమాండ్లకు కట్టుబడి ఉన్నానని, ఆయనను పదవి నుండి తొలగించాలని పునరుద్ఘాటించారు. జులై 20వ తేదీన జంతర్ మంతర్ నుండి పార్లమెంటు వరకూ కాక్రోచ్ జనతాపార్టీ నాయకత్వంలో తలపెట్టిన విద్యార్థుల శాంతియుత ప్రదర్శనపై జరిగిన లాఠీఛార్జీ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు.విద్యార్థులను అణచివేయాలని ఆయనే పోలీసులకు ఆదేశాలు జారీ చేశారని విమర్శించారు.
"విద్యార్థులను మేకులున్న లాఠీలతో కొట్టమని, పెల్లెట్ గన్స్‌తో కాల్చమని ఆయనే ఆదేశించి ఉండాలి లేదా ఆ విషయం ఆయనకు తెలియక పోయి ఉండాలి, ఆయన ఆదేశిస్తే ఆయనే బాధ్యుడు, ఆదేశించకపోతే, ఆయనకు తెలియకపోతే ఆయన అసమర్థుడు, తెలిసినా, తెలియకపోయినా బాధ్యత వహించాలి" అని డిమాండ్ చేశారు. లోక్‌సభలో తనను మాట్లాడనివ్వడంలేదని, మాట్లాడాలనుకున్న ప్రతిసారీ, ఆ ప్రయత్నం చేయకుండా తన గొంతు నొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
"ఈరోజు మీరు చూశారు, నన్ను లోక్‌సభలో మాట్లాడనివ్వలేదు, ఒక ప్రతిపక్ష నాయకుణ్ణి మాట్లాడనివ్వకుండా అడ్డుకున్నారు. రాజ్‌నాథ్ సింగ్ జీ లాంటి వారు మాట్లాడేందుకు పదే పదే అవకాశాలు ఇచ్చారు, సభలో మాట్లాడే వాతావరణం ఏర్పాటు చేయడానికి తగిన క్రమశిక్షణ నెలకొల్పాలని నేను పలుసార్లు స్పీకర్‌కు విజ్ఞప్తి చేశాను, కానీ పట్టించుకోలేదు, వారి మంత్రులకు ఎక్కువ మాట్లాడే అవకాశాలు ఇచ్చారు,అమిత్ షాను నేను ఏదో అన్నానని అడ్డుకున్నారు, విద్యార్థులపై క్రూరమైన లాఠీఛార్జికి ఆయనే బాధ్యుడని నేను చెప్పాను, క్షమాపణ చెబితే మాట్లాడేందుకు అనుమతిస్తామన్నారు, కానీ నా వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు.
"క్షమాపణ చెబితే సభలో మాట్లాడటం కొనసాగించవచ్చునని, అందుకు అనుమతిస్తామని నాకు వారు భరోసా ఇచ్చారు, చూడండి, మొదటి విషయం ఏమిటంటే, బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ లేదా వారితో సంబంధం ఉన్న ఏ వ్యక్తికీ నేను క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు, ఈ విషయాన్ని అందరూ బాగా అర్థం చేసుకోవాలి. ఇక రెండో విషయం ఏమిటంటే, దేశంలో ఉన్న ప్రధానమైన,ముఖ్యమైన సమస్యలన్నింటినీ లోక్‌సభ దృష్టికి తీసుకురావడం ఒక ప్రతిపక్ష నాయకుడుగా నాకున్న హక్కు" అని స్పష్టం చేశారు. "నాకు సంబంధించి ఈనాడు అతిముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ దేశంలో విశాల దృక్పథంతో ప్రశ్నలు అడిగిన మన విద్యార్థులు,ప్రజలను ఢిల్లీ వీధుల్లో అతిక్రూరంగా అణచివేయడం,విద్యార్థుల శాంతియుత ప్రదర్శనను క్రూరంగా మార్చారు, అలా చేసినవారు చివరకు వెళ్ళి అమిత్ షాకు జరిగిన విషయం చెబుతారు కదా" అన్నారు.
"వారిని(నిరసన ప్రదర్శనచేసే విద్యార్థులు) పెల్లెట్ గన్స్‌తో కాల్చారు, ఈ గన్ కాల్పుల దెబ్బకు గురైన ఒక విద్యార్థి చాలావరకూ కంటి చూపును కోల్పోయే అవకాశం ఉంది, ఆ విద్యార్థి కంటితో చూసేఅవకాశం ఉండకపోవచ్చు, ఎయిమ్స్‌లో దానికి సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్ చూశాను, అతడిని పెల్లెట్ గన్‌తో కాల్చారని అందులో రాసి ఉంది, షాక్ బటన్స్ కూడా విద్యార్థులపై ఉపయోగించారు, అవి సాధారణమైన లాఠీలు కాదు, విద్యుత్ లాఠీలు,మేకులున్న లాఠీలను విద్యార్థులపై ఉపయోగించారు,ఈ ఆలోచన పోలీసులకు ఎక్కడి నుండి వచ్చింది?" అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. "హోమ్ మంత్రి అధీనంలో పనిచేసే అధికారులు ఆయనకు జరిగిన విషయాల గురించి చెబుతారు, అందువల్ల ఏం జరిగిందనే విషయాలకు ఆయనే పూర్తి బాధ్యుడు" అన్నారు. విద్యార్థుల శాంతియుత ప్రదర్శనను క్రూరంగా మార్చడం ప్రాథమిక సమస్య అని చెబుతూ పత్రికాగోష్ఠిలో ఏర్పాటు చేసిన తెరమీద దానికి సంబంధించిన చిత్రంపై ఆయన వేలుపెట్టి చూపించి వివరించారు. ఈ వ్యక్తే విద్యార్థులను కొట్టాడు, అవమానించాడు, పెల్లెట్ గన్స్‌తో కాల్చాడు" అని వివరించారు. అమిత్‌షాను పదవి నుండి తొలగించాలి, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఈ ఘటనపై విచారణ జరపాలి, క్రమశిక్షణ,నైతిక బాధ్యత పాటించాలి అని కోరారు.

# పేపర్ లీక్ నియంత్రణ చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ :** పేపర్ లీక్ నియంత్రణ చట్ట సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. 'వుయ్ వాంట్ జస్టిస్' అనే విపక్షాల నినాదాల మధ్య మూజువాణి ఓటుతో బిల్లుకు ఆమోదం తెలిపింది. బిల్లును జెపిసికి పంపాలని కొందరు ఎంపిలు డిమాండ్ చేసినా, వారు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. అంతకు ముందు పిఎంఒ సహాయమంత్రి జితేంద్రసింగ్ యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానం ఇచ్చారు. ఇప్పటివరకు 152 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయన్న కాంగ్రెస్ ఎంపి ప్రియాంకాగాంధీ ఆరోపణలకు ఆధారమే లేదని అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని జితేంద్రసింగ్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలు చూస్తే సభా సంప్రదాయాలపై ఆయనకు అవగాహన లేదని రుజువవుతోందన్నారు. రాహుల్‌గాంధీ అప్రజాస్వామిక భాష వాడారని దుయ్యబట్టారు.

**గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష**

పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లు–2026ను ఇంతకుముందు కేంద్రం ప్రతిపాదించింది. పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్టంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించింది. జరిమానాను 10 లక్షల నుంచి 50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేసింది. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను కోటి నుంచి 5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చింది. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదన చేసింది. నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, 5 కోట్ల వరకు జరిమానా విధించనున్నారు. వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాలకు సంబంధించి శిక్ష, జరిమానాల్లో కూడా కేంద్రం మార్పులు ప్రతిపాదించింది. కనీస శిక్షను 5 ఏళ్ల నుంచి 7 ఏళ్లకు, కనీస జరిమానాను కోటి నుంచి 10 కోట్లకు పెంచింది. పరీక్షా కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా టాస్క్ ఫోర్స్ మొత్తం దర్యాప్తును 2 నెలల్లోపు పూర్తి చేసేలా మార్పులు ప్రతిపాదించింది.

# 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ :** జాతీయ గేయం 'వందేమాతరం' గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24వ తేదీన ఎగువసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. బుధవారం సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదముద్ర వేసింది. ఇకపై వందేమాతరాన్ని అవమానించినా, లేదా ఎవరైనా ఆలపిస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా దాన్ని చట్టప్రకారం తీవ్ర నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా చరిత్రాత్మక 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్‌సల్ట్ టు నేషనల్ ఆనర్ యాక్ట్ 1971' (దేశ గౌరవానికి భంగం కలిగించే నిరోధక చట్టం)లో కీలక సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ఎలాంటి చట్టపరమైన రక్షణలు అమల్లో ఉన్నాయో.. అవే అత్యున్నత రక్షణలను జాతీయ గేయమైన వందేమాతరానికి కూడా వర్తింపజేయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.



# హోర్ముజ్‌లో నావికులపై దాడులకు భారత్ ఖండన

కోటిమంది భారతీయుల భద్రతే ముఖ్యం
స్వేచ్ఛా రవాణ ఉండాలని భద్రతామండలికి హరీశ్ విజ్ఞప్తి

**న్యూయార్క్:** హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇటీవల జరుగుతున్న దాడులు, నావికులకు ఏర్పడిన అభద్రలపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశంలో భారతదేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో పరిస్థితులపై మంగళవారం భద్రతా మండలిలో జరిగిన బహిరంగ చర్చలో భారత రాయబారి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధిలో భారత్‌కు చెందిన అనేక నౌకలు సహా అనేక దేశాల నౌకలపై విచక్షణారహితంగా దాడులు జరిగాయని, అనేకమంది నావికులు మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. జలసంధిలో నౌకలు నిరాటంకంగా రాకపోకలు చేయడానికి, స్వేచ్ఛావాణిజ్య పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని పిలుపు ఇచ్చారు. గల్ఫ్ ప్రాంతంలో కోటిమంది భారతీయులు పనిచేస్తున్నారని, వారి భద్రత,శ్రేయస్సు భారత ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని తెలియజేశారు.
భారతదేశానికి పశ్చిమాసియా ప్రాంతం ఎంతో ముఖ్యమైనదని, నాలుగు రోజులు విరామం తర్వాత ఈ ప్రాంతంలో మళ్ళీ యుద్ధ దాడులు ప్రారంభమయ్యాయని, ఇది చాలా ఆందోళకరమైన విషయమని,తక్షణం ఉద్రిక్తలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని హరీశ్ కోరారు. ఇటీవలికాలంలో జిఎఫ్‌ఎస్ గెలాక్సీ,ఎంటి అల్–బహియా,ఎంటి మొసాంబాలతో సహా పలు భారత నావికులు ప్రయాణించే చమురు,రవాణా నౌకలపై దాడులు జరిగాయని, అనేకమంది భారత నావికులు మరణించారని చర్చ సందర్భంగా ఆ వివరాలన్నీ భద్రతామండలి దృష్టికి తీసుకువచ్చారు.ఈ జలమార్గంలో నౌకాయానానికి ఎలాంటి ఆటంకం ఉండకూడదని, అంతర్జాతీయ చట్టాలను పాటించాలని, అమాయక నౌకలపై దాడులు చేయకుండా నిబంధనలు పాటించాలని, చర్చల పరిష్కారం ద్వారా యుద్ధం నిలిపివేయాలని పదే పదే భారత్ కోరుతూ వస్తున్న విషయాన్ని ఆయన సమావేశంలో పునరుద్ఘాటించారు.భారతదేశ ప్రయోజనాలన్నీ పశ్చిమాసియా స్థిరత్వం, భారత్ చమురు సరఫరాలు,ఇతర సరుకుల రవాణా వ్యవస్థ అంతా ఈ ప్రాంతంతోనే ముడి పడి ఉందని భద్రతా మండలికి చెప్పారు.

## 'నెప్' కాదు నాగపూర్ విద్యావిధానం: కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** 'జాతీయ విద్యా విధానం–2020 (ఎన్‌ఇపి)'ని 'నాగ్‌పూర్ విద్యా విధానం' గా కాంగ్రెస్ అభివర్ణించింది. ఇప్పుడు దీని పునాదులు కదిలిపోయాయని, ఎన్‌టిఎ విశ్వసనీయత దెబ్బతిన్నదని, ఎన్‌ఇపిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను బలవంతం చేసిన విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొంది. జులై 29, 2020న జాతీయ విద్యా విధానం ఆమోదం పొందిన ఆరవ వార్షికోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ఈ విమర్శలు చేసింది. ఈ విధానంపై పార్లమెంటులో ఎప్పుడూ చర్చ జరగలేదని లేదా 'సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్' దీనికి ఆమోదం తెలపలేదని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'మోదీ ప్రభుత్వం 2020 జులై 29న ఎన్‌ఇపిని (నాగ్‌పూర్ విద్యా విధానం) ఆమోదించి నేటికి ఆరు ఏళ్లు పూర్తయ్యాయి. దీనిపై పార్లమెంటులో ఎప్పుడూ చర్చ జరగలేదు. 'సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్' దీనిని ఆమోదించలేదు' అని రమేశ్ బుధవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల మేరకు విద్యా వ్యవస్థను కాషాయీకరణ చేయడమే ఈ విధానం లక్ష్యమని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' గురించి ప్రస్తావిస్తూ, అది పార్లమెంటు సంయుక్త కమిటీ వద్ద నిలిచిపోయిందని (స్తంభించిపోయిందని) ఆయన పేర్కొన్నారు. ఎన్‌టిఎ మిత్రపక్షాల వ్యతిరేకత కారణంగా గత మూడు వారాల్లో కనీసం రెండుసార్లు ఆ కమిటీ సమావేశాలను రద్దు చేయాల్సి వచ్చింది. 'నాగ్‌పూర్ విద్యా విధానానికి భిన్నంగా, రాజీవ్ గాంధీ ప్రభుత్వ హయాంలోని 1986 నాటి విద్యా విధానాన్ని ఆమోదించే ముందు పార్లమెంటులో విస్తృతంగా చర్చించారు. 'దాని విశిష్ట విజయాలలో ఒకటి జవహర్ నవోదయ విద్యాలయాల స్థాపన; ఇవి ప్రారంభమైనప్పటి నుండి సామాజికఆర్థిక పురోగతికి చోదక శక్తులుగా నిలిచాయి' అని రమేష్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# మావోయిస్టు మిసిర్ బెస్రా అరెస్టు



**బిజాపూర్ / రాంచీ :** నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాల్లో భాగంగా జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో నిషేధిత సిపిఐ (మావోయిస్ట్) పొలిట్‌బ్యూరో సభ్యుడు, 175 కేసుల్లో నిందితుడిగా మిసిర్ బెస్రాను పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై రూ. 2.2 కోట్లకు పైగా రివార్డు ఉంది. ఈ విషయాన్ని డిజిపి తదాషా మిశ్రా బుధవారం వెల్లడించారు. దేశంలోనే అత్యధికంగా వాంటెడ్ జాబితాలో ఉన్న ఈ నక్సల్ నాయకుడి అరెస్టుతో రాష్ట్రం నుండి మావోయిస్టుల ముప్పు దాదాపుగా తుడిచిపెట్టుకుపోయిందని డిజిపి పేర్కొన్నారు. 'ఆపరేషన్ దౌరా పహాడ్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం బర్వాడ్డా పోలీస్ స్టేషన్ పరిధిలోని మనియాడ్హి ప్రాంతంలో 65 ఏళ్ల బెస్రాను అదుపులోకి తీసుకున్నట్లు ఆమె తెలిపారు. గిరిడ్హి జిల్లాలోని మద్నాడ్హి గ్రామానికి చెందిన బెస్రా, సిపిఐ (మావోయిస్ట్)లో క్రియాశీలకంగా ఉన్న ఏకైక అత్యున్నత స్థాయి పొలిట్‌బ్యూరో సభ్యుడు అని డిజిపి చెప్పారు. 'ఈ అగ్రశ్రేణి మావోయిస్ట్ నాయకుడిపై జార్ఖండ్, ఒడిశా ప్రభుత్వాలు కలిపి రూ. 2.20 కోట్ల రివార్డును ప్రకటించాయి. ఈ ఆపరేషన్‌లో మరో ఇద్దరు మావోయిస్టులు రూ. 15 లక్షల రివార్డు ఉన్న మెహనత్ అలియాస్ మోచు, గౌరవ్ కూడా అరెస్టు అయ్యారని ఆమె చెప్పారు. ఈ ముగ్గురిపై మొత్తం 320 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. మిసిర్ బెస్రా అరెస్టుపై స్పందిస్తూ, మంగళవారం రాత్రి 10 నుండి 11 గంటల మధ్య ధన్‌బాద్ మరియు గిరిడ్హి సరిహద్దు ప్రాంతంలో అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తమకు తెలిసిందని అతని సోదరుడు దేవ్‌లాల్ బెస్రా తెలిపారు.

**ఆయుధాలు వీడిన 8 మంది నక్సల్స్**

జార్ఖండ్‌లో మంగళవారం 16 మంది మావోయిస్టులు లొంగిపోగా, బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోను మరికొంత మంది ఆయుధాలు వీడారు. జార్ఖండ్‌లో క్రియాశీలకంగా ఉంటూ రూ. 49 లక్షల రివార్డు కలిగిన ఎనిమిది మంది నక్సలైట్లు ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. మార్చి 31న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని వామపక్ష తీవ్రవాద రహిత ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించిన తర్వాత, మావోయిస్టులు పెద్ద సంఖ్యలో ఇలా సామూహికంగా లొంగిపోవడం ఇదే మొదటిసారి. లొంగిపోయిన వారిలో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. వీరంతా బిజాపూర్ పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) ఉన్నతాధికారుల సమక్షంలో లొంగిపోయారని ఎస్‌పి ఉమేష్ ప్రసాద్ గుప్తా తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'నక్సలైట్ల లొంగుబాటు, పునరావాస విధానం' అలాగే బిజాపూర్‌లో చేపట్టిన పునరావాస కార్యక్రమాల పట్ల ఆకర్షితులై లొంగిపోయారని గుప్తా పేర్కొన్నారు. వీరు గత కొంతకాలంగా నిషేధిత సిపిఐ (మావోయిస్ట్) సంస్థతో సంబంధం కలిగి ఉండి, పొరుగున ఉన్న జార్ఖండ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో క్రియాశీలకంగా పనిచేశారని ఆ అధికారి తెలిపారు. లొంగిపోయిన వారిలో అశ్విన్ అలియాస్ లచ్చు (30), రంగా అలియాస్ సోహన్ (30), డోబా మాద్వి అలియాస్ రహత్ (25) డివిజనల్ కమిటీ సభ్యులుగా పనిచేశారు. వీరిలో ఒక్కొక్కరిపై రూ. 8 లక్షల రివార్డు ఉంది. ఫగ్నీ పోయం అలియాస్ రజని (28), సూరజ్ మున్నీ చంపియా (25), హిద్మే కడ్తి అలియాస్ రీటా (27), బుధ్రి కుంజమ్ అలియాస్ అనుష (25) ఏరియా కమిటీ సభ్యులుగా ఉంటూ ఒక్కొక్కరిపై రూ. 5 లక్షల రివార్డును కలిగి ఉన్నారు. అలాగే పార్టీ సభ్యురాలైన సల్మి చంపియా అలియాస్ జిలాని (20) పై కూడా రూ. 5 లక్షల రివార్డు ఉందని గుప్తా తెలిపారు. లొంగిపోయిన వీరంతా బిజాపూర్, నారాయణ్‌పూర్ మరియు సుక్మా జిల్లాలకు చెందినవారని ఆయన పేర్కొన్నారు.




# బొగ్గు బ్లాక్‌ల కేటాయింపుల్లో మాజీ ప్రధాని మన్మోహన్‌పై కేసు మూసివేత

సమన్ల ఉత్తర్వులు కొట్టివేసిన 'సుప్రీం'



**న్యూఢిల్లీ :** బొగ్గు బ్లాక్‌ల కేటాయింపుల కేసులో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు వ్యతిరేకంగా జారీచేసిన సమన్ల ఉత్తర్వులను బుధవారం సుప్రీంకోర్టు కొట్టివేస్తూ, ఆయనపై ఉన్న క్రిమినల్ కేసును మూసివేసింది. 2024 డిసెంబర్ 27న మరణించిన మన్మోహన్ సింగ్ ఇప్పుడు ఆ సంచలనాత్మక క్రిమినల్ కేసులో నిర్దోషిగా మిగిలారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం మాజీ ప్రధాని, ఇతరులకు అనుకూలంగా ఇచ్చిన క్లీన్‌చిట్ నివేదికను ఆమోదించింది. సిబిఐకి సమర్పించిన ముగింపు నివేదికలను తిరస్కరించి, కేసును పరిగణనలోనికి తీసుకోవడానికి ట్రయల్ కోర్టు న్యాయమూర్తికి ఎలాంటి కారణం లేదని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. అప్పీల్‌దారు దురదృష్టవశాత్తు మరణించినందున ఈ అప్పీల్ నిష్ఫలమైనదిగా భావిస్తూ కొట్టివేయబడింది. కానీ, ప్రత్యేక న్యాయమూర్తి కేసును విచారణకు స్వీకరించి, అప్పీల్‌దారునికి సమన్లు జారీచేసిన విషయాన్ని పరిగణనలోనికి తీసుకునే ఉద్దేశంతో, మేం సిబిఐ దాఖలు చేసిన రెండు ముగింపు నివేదికలనను పరిశీలించాం.'దర్యాప్తు సంస్థల నివేదికలను అంగీకరించడానికి ఈ కోర్టు స్థిరంగా నిర్దేశించిన సంబంధిత పారామీటర్లను తీసుకున్న తర్వాత, సిబిఐ కేసును మూసివేయడాన్ని తిరస్కరించి, కేసు విచారణను స్వీకరించడానికి గౌరవ న్యాయమూర్తికి ఎటువంటి కారణం లేదని మేం సంతృప్తి చెందాం.మేం అప్పీల్‌ను అనమతించి, సవాల్ చేయబడిన తీర్పును రద్దు చేస్తున్నాం. అందువల్ల మేం సిబిఐ కేసు మూసివేత నివేదికలను అంగీకరించి, ఈ విషయాన్ని ముగిస్తున్నాం' అని ధర్మాసనం తెలిపింది. 2025లో ఒడిశాలోని తలబీరా–2 బొగ్గు బ్లాక్ కేటాయింపునకు సంబంధించిన ఒక ప్రత్యేక బొగ్గు కుంభకోణం కేసులో పారిశ్రామికవేత్త సింగ్, కుమార్ మంగళం బిర్లా, మాజీ బొగ్గు కార్యదర్శి సి.పరాఖ్ , మరో ముగ్గురిని నిందితులుగా సమన్లు జారీచేశారు. అయితే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని, ఆ ఆదేశంపై స్టే ఇచ్చింది. బొగ్గు కేటాయింపునకకు తీసుకున్న తన నిర్ణయంలో ఎలాంటి నేరపూరిత చర్యలు లేవని ఆయన ఖండించారు.ఐపిసిలోని సెక్షన్ 120 బి (నేరపూరిత కుట్ర, 409 (ప్రభుత్వ ఉద్యోగి, బ్యాంకర్, వ్యాపారి లేదా ఏజెంట్ ద్వారా నేరపూరిత విశ్వాస భంగం, అవినీతి నిరోధక చట్టం (పిసిఏ) నిబంధనల కింద శిక్షార్హమైన ఆరోపణలపై ఆరుగురు నిందితులకు ప్రత్యేక సిబిఐ న్యాయమూర్తి భరత్ పరాశర్ సమన్లు జారీచేశారు. ఈ ముగ్గురితో పాటు మెస్సర్స్ హిండాల్కో. దాని అధికారులు సుభేందు అమితాబ్, డి.భట్టాచార్య ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. ఈ కేసు, 2005లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ బొగ్గు శాఖను నిర్వహిస్తున్నప్పుడు ఒడిశాలోని తలబీరా–2 బొగ్గు బ్లాక్‌ను మెస్సర్స్ హిండాల్కోకు కేటాయించడానికి సంబంధించినది. సిబిఐ తన ఎఫ్‌ఐఆర్‌లో ఐపిసిలోని సెక్షన్ 120–బి (నేరపూరిత కుట్ర) పిసిఏ నిబంధనల కింద ఆరోపించబడిన నేరాలకు గాను పరాఖ్, బిర్లా, మెస్సర్స్ హిండాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఇతర గుర్తు తెలియని వ్యక్తుల పేర్లను చేర్చింది. అయితే, ఏజెన్సీ ఆ తర్వాత కోర్టులో మూసివేత నివేదికను దాఖలు చేయగా, కోర్టు దానిని స్వీకరించడానికి నిరాకరించింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను, ఆయన అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ టికె.నాయర్, ప్రైవేట్ సెక్రటరీ బివిఆర్.సుబ్రమణ్యం సహా ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఒ)లోని కొందరు ఉన్నతాధికారులను విచారించాలని కోర్టు సిబిఐని ఆదేశించిన విషయం తెలిసిందే.

## ఒకేదేశం - ఒకే ఎన్నిక బిల్లుపై పార్లమెంటు కమిటీ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ:** లోక్‌సభ–రాష్ట్రాలలో అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన బిల్లు ఆమోదానికిగల సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్న పార్లమెంటరీ సంయుక్త కమిటీ గడువు కాలాన్ని లోక్‌సభ పొడిగించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగిసేవరకూ ఈ కమిటీ పదవీకాలాన్ని పొడిస్తూ లోక్‌సభ బుధవారం ఆమోదం తెలియజేసింది. ఈ కమిటీ ఛైర్మన్ పి.పి.చౌధరి ఒక తీర్మానం సభలో ప్రవేశపెట్టారు. కమిటీ తన నివేదికను పార్లమెంటుకు సమర్పించేందుకు గడువు కాలాన్ని పొడిగించాలని తీర్మానం ద్వారా ఆయన సభకు విజ్ఞప్తి చేశారు. మూజువాణీ ఓటుతో బిల్లును సభ ఆమోదించింది. సాధారణంగా పార్లమెంటు శీతాకాల సమావేశాలు నవంబరు చివరివారంలో ప్రారంభమవుతాయి. క్రిస్మస్ పర్వదినం రావడానికి ముందుగా ముగుస్తాయి. ఈ సంయుక్త పార్లమెంటరీ కమిటీలో 41 మంది సభ్యులున్నారు. రాజ్యాంగానికి 129వ సవరణ చేయడానికి ఉద్దేశించిన బిల్లును ఈ కమిటీ పరిశీలిస్తోంది. దేశవ్యాప్తంగా ఈ కమిటీ అందరితోనూ సంప్రదింపులు చేస్తోంది. లోక్‌సభ,రాష్ట్రాలలో అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలా?వద్దా? అది సాధ్యమేనా? అనే అంశాలపై అభిప్రాయాలను సేకరిస్తోంది. ఈ కమిటీ నివేదికను సమర్పిస్తుంది. 2029లో లోక్‌సభ,రాష్ట్రాలలో అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈ కసరత్తు చేస్తోంది.

# జోర్డాన్‌లో అమెరికా స్థావరాలపై ఇరాన్ ఆకస్మికదాడి

- అమెరికా-సౌదీ దాడిలో 20 మంది పిఎంఎఫ్ సైన్యం మృతి
- ఐదు ఇరాన్ క్షిపణులు కూల్చేసిన జోర్డాన్ ●హోర్ముజ్‌లో మూడు చమురు ట్యాంకర్ల ధ్వంసం ●సౌదీ నౌకలు లక్ష్యంగా దాడులు: హౌతీల ప్రకటన

**అమ్మాన్:** ఎవ్వరూ ఊహించని విధంగా జోర్డాన్‌లో అమెరికా స్థావరాలపై ఇరాన్ దిగ్భ్రాంతికర ఆకస్మిక దాడులు చేసింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఆ ఆకస్మిక దాడులతో అమెరికా సెంట్‌కామ్ ఉలిక్కిపడింది. ఈ దాడుల తర్వాత తూర్పు ఇరాక్‌లో ఉన్న ఇరాన్ అనుకూల పిఎంఎఫ్ (పాపులర్ మొబిలైజేషన్ ఫోర్స్) పారామిలిటరీ స్థావరాలపై అమెరికా సెంట్‌కామ్-సౌదీ అరేబియా కూటమి దళాలు సమన్వయంతో విస్తారంగా దాడులు చేశాయి. నినెవెహ్‌లో చేసిన ఈ దాడుల్లో 20 మంది పిఎంఎఫ్ సభ్యులు హతులయ్యారు. ఇలా మొదటిసారి అమెరికాతో కలిసి సౌదీ అరేబియా యుద్ధ దాడుల్లో పాల్గొంది. అమెరికా బలగాలపైన, సౌదీ అరేబియా చమురు కేంద్రాలపైనా దాడులు చేయాల్సిందిగా ఇరాన్ ఆదేశాల మేరకు ఈ పిఎంఎఫ్ బలగాలు మంగళవారం 30 డ్రోన్లతో సౌదీ అరేబియా కేంద్రాలపై దాడులు చేశాయి. దీనికి ప్రతీకారంగా ఉత్తర ఇరాక్‌లో ఉన్న పిఎంఎఫ్ ఆయుధ కేంద్రాలు, రవాణా వ్యవస్థలపై దాడు లు చేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించగా, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాన్ని,కమాండ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. కాగా హోర్ముజ్ జలసంధిలో మూడు చమురు నౌకలపై దాడులు చేసి వాటిని నిలిపివేశామని ఇరాన్ బుధవారం ప్రకటించింది. తమ హెచ్చరికలను ఉల్లంఘించి అక్రమ మార్గంలో ప్రయాణం చేసేందుకు ఈ నౌకలు ప్రయత్నం చేశాయని, అందువల్ల వాటిపై దాడి చేయాల్సివచ్చిందని ఐఆర్‌జిసి ప్రకటించింది. సౌదీఅరేబియా రక్షణమంత్రిత్వశాఖ ప్రతినిధి తుర్కీ అల్-మాలికీ మాట్లాడుతూ, ఆత్మరక్షణకోసమే తాము ఇరాక్‌లో పిఎంఎఫ్ ఉగ్రవాదులపై దాడిచేశామన్నారు. ఉద్రిక్తతలను కోరుకోవడంలేదని, దురాక్రమణ చర్యలను ప్రతిఘటిస్తామని చెప్పారు. సౌదీ అరేబియాపై పిఎంఎఫ్ దాడి ద్రోహపూరితం, సార్వభౌమాధికార ఉల్లంఘన చర్య అని మండిపడ్డారు. వరుసగా 13 రోజులపాటు ఇరాన్-అమెరికా మధ్య దాడులు జరిగిన తర్వాత శనివారం తెల్లవారుజామున అమెరికా దాడులు నిలిపివేయడంతో అందుకు తగ్గట్టుగానే ఇరాన్ కూడా ప్రతిఘటన దాడులు నిలిపివేసింది. నాలుగు రోజుల విరామం తర్వాత ఊహించని రీతిలో జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. తాము ఎప్పుడూ ప్రతిఘటన వ్యూహాన్నే అమలు చేస్తామని ప్రకటించిన ఇరాన్ ఆకస్మిక దాడులే చేసింది. ఐతే స్థావరాలకు క్షిపణులు చేరకముందుగానే ఐదు ఇరాన్ క్షిపణులను మార్గమధ్యలోనే కూల్చివేసినట్లు జోర్డాన్ సైన్యం ప్రకటించింది. ఇరాన్ ఐఆర్‌జిసి సైన్యాలు భారీ సంఖ్యలో క్షిపణులుప్రయోగించిందని, వాటిని విజయవంతంగా అడ్డుకున్నామని సెంట్‌కామ్ ప్రకటించింది. గడచిన వారాంతంలో దాడులు నిలిపివేసిన తర్వాత చర్చలకు ఒక అవకాశం వచ్చిందని ట్రంప్ ప్రకటించిన తర్వాత చమురు ధరలు అమాంతంగా తగ్గిపోయాయి. కానీ తిరిగి పరిస్థితి తలక్రిందులైంది. మరోవైపు సౌదీఅరేబియా నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు హౌతీ తిరుగుబాటు సైన్యాలు ప్రకటించాయి.



పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాలతో బ్రెంట్ క్రూడాయిల్ ధర మళ్ళీ నాలుగుశాతం మేరకు పెరిగింది. స్టాక్‌మార్కెట్లు దెబ్బతిన్నాయి. ఇరాక్ కేంద్రంగా పనిచేసే పిఎంఎఫ్ పారామిలిటరీ దళాలు ఇరాన్ సర్వాధినేత చెప్పుచేతల్లో ఉండి వారి ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ఉంటాయి. 67 షియా తెగలకు చెందిన గ్రూపులతో ఈ పారామిలిటరీ ఏర్పడింది. ఇది ఇరాకీ సైన్యంలో విలీనమై ఉంది. ఈ గ్రూపులన్నీ ఇరాన్ చెప్పినట్లు వింటూ అనేక లక్ష్యాలను పూర్తిచేస్తాయి. తాము ఇరాన్ సర్వాధినేత అలీ ఖమేనీతోపాటు ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ ఆదేశాలమేరకు తాము ప్రవర్తిస్తామని పిఎంఎఫ్ ప్రధానాధిపతి ఫడక్ అల్-మహ్మదావీ 2024లోనే ఒక బహిరంగ ప్రకటన చేశారు.

**ఇరాన్ ఉగ్రవాదం ప్రపంచానికి కేన్సర్: ట్రంప్**
వివిధ దేశాల్లో ఇరాన్‌కు అనుకూలంగా ఉన్న ఉగ్రవాద గ్రూపులను ప్రపంచానికి పట్టిన కేన్సర్‌గా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శించారు. ఇరాక్‌లో పిఎంఎఫ్ ఛత్రం కింద పనిచేస్తున్న అనేక షియా తెగల ఉగ్రవాద గ్రూపులు ఇరాన్ ఆదేశంతో మంగళవారం సౌదీ అరేబియాపై దాడి చేశాయని, ఈ దాడులకు ప్రతిగా ఇరాక్ సహాయంతో ఎదురుదాడులు చేశామని, వారిని చితకబాదుతున్నామని ట్రంప్ చెప్పారు. యెమెన్, లెబనాన్, ఇరాక్, గాజాలలో ఇరాన్ అనుకూల ఉగ్రవాద గ్రూపులు ఉన్నాయని, ఇవన్నీ ప్రపంచానికి పట్టిన కేన్సర్ అనీ అన్నారు. జోర్డాన్‌లో ఇరాన్ బుధవారం చేసిన దాడులను ఆకస్మిక దాడులుగా ట్రంప్ చెప్పారు. ఇరాన్‌తో ఉద్రిక్తతలు స్పష్టంగా పెరుగుతున్నప్పటికీ తమ ప్రతినిధులను చర్చలకు పంపుతున్నానన్నారు.

## హోర్ముజ్‌లో ఒమన్‌కు సమానాధికారం ఇవ్వం

50-50 భాగస్వామ్య ప్రణాళికకు ఇరాన్ తిరస్కృతి

**మస్కట్:** హోర్ముజ్ జలసంధి నిర్వహణలో ఒమన్ దేశానికి సమానాధికారాలు ఇచ్చేందుకు ఇరాన్ తిరస్కరించింది. హోర్ముజ్ జలసంధిపై సంపూర్ణ అధికారాలన్నీ ఇరాన్‌కే ఉంటాయని స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధిలో ప్రాదేశిక జలాలను పంచుకుంటున్న ఈ రెండు దేశాలు ఒక సంయుక్త యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు ఒమన్ తాజా ప్రతిపాదనలు సమర్పించింది. ఈ ప్రతిపాదనల ప్రకారం ఇరాన్-ఒమన్‌లకు ఫిఫ్టీ-ఫిఫ్టీ వంతున సమానమైన నియంత్రణాధికారాలు ఉండాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్లు ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు బుధవారం చెప్పారు. ఒమన్‌ను ఒక విలువైన పొరుగు దేశంగా, చర్చల్లో మధ్యవర్తి దేశంగా ఇరాన్ గౌరవిస్తుందని, కానీ హోర్ముజ్ నియంత్రణలో సమాన భాగస్వామ్యంవల్ల ఇరాన్ ప్రయోజనాలు దెబ్బతింటాయని, దీనిని అంగీకరించలేమని చెప్పారు. అదే విధంగా ఒమన్ నియంత్రణలో ఉన్న జలసంధి భాగాన్ని పర్యవేక్షించాలని, ఒమన్ ప్రాదేశిక జలాల నుండి వెళ్ళే దక్షిణప్రాంత మార్గాలు కూడా ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని అన్నారు. హోర్ముజ్‌లోని ప్రధాన స్రవంతి రవాణా మార్గాలపై పూర్తిస్థాయి హక్కులు, అధికారాలన్నీ ఇరాన్‌కే ఉండాలని స్పష్టం చేసినట్లు చెప్పారు.ఈ ప్రణాళిక విజయవంతమయ్యే అవకాశం లేదని ఆయన అన్నారు. దీంతో త్వరతగతిన యుద్ధంలో పురోగతి వస్తుందన్న ఆశలకు గండిపడింది. అమెరికా దురాక్రమణ నుండి హోర్ముజ్ జలసంధిని కాపాడేందుకు ఇరాన్ ముమ్మరంగా దౌత్య ప్రయత్నాలు చేసింది. ఈ చర్యల్లో భాగంగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ మంగళవారం ఒమన్, సౌదీ అరేబియా విదేశాంగమంత్రులతో టెలిఫోన్ సంభాషణలు చేశారు. హోర్ముజ్ జలసంధి భద్రత, పశ్చిమాసియాలో స్థిరత్వం సాధించేందుకు, అమెరికా దురాక్రమణను తొలగించి, ఆ ప్రాంతంలో హోర్ముజ్‌పై సెంట్‌కామ్ ఆధిపత్యం లేకుండా చేసేందుకు అబ్బాస్ అరాఘ్చీ తన దౌత్య చర్యలు వేగవంతం చేశారు. నౌకలు స్వచ్ఛందంగా రుసుము లు చెల్లించడం ద్వారా హోర్ముజ్ జలసంధి నిర్వహణకు ఒక ఉమ్మడి ప్రాంతీయ యంత్రాంగం ఏర్పాటు చేసేందుకు ఒమన్-ఇరాన్ మధ్య దశలవారీగా మరోవైపు చర్చలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సమానభాగస్వామ్యంకోసం ఒమన్ మంగళవారం ఒక ప్రతిపాదన చేసింది. దీని ప్రకారం హోర్ముజ్ జలసంధిపై కేవలం ఇరాన్ పెత్తనం మాత్రమే ఏకపక్షంగా కొనసాగే అవకాశం ఉండదు. ఈ జలసంధిని ఉపయోగించుకునేవారంతా జలసంధి నిర్వహణ,పర్యావరణ పరిరక్షణ, భద్రత, పరిశోధన,రక్షణ కార్యకలాపాల నిమిత్తం విరాళాలను స్వచ్ఛందంగా సమకూరుస్తారు. హిందూమహాసముద్రాన్ని పసిఫిక్‌తో కలిపే మలక్కా జలసంధి నిబంధనల తరహాలో ఈ ప్రతిపాదనను ఒమన్ చేసింది. మలక్కాలో ఇండోనేసియా, మలేసియా, సింగపూర్ కలిసి నౌకల నుండి స్వచ్ఛంధ విరాళాలు సేకరిస్తున్నాయి. ఒమన్ చేసిన స్వచ్ఛంధ విరాళాల ప్రణాళికను గల్ఫ్ దేశాలు కూడా అంగీకరించాయి. కానీ ఇరాన్ తిరస్కరించింది.

## పెరూ తొలి మహిళా అధ్యక్షురాలుగా ఫుజిమోరి

**లిమా:** పెరూ దేశ అధ్యరాలుగా కీకో ఫుజిమోరి (51) బాధ్యతలు చేపట్టారు. కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. పెరూదేశ చరిత్రలో మొట్టమొదటి అధ్యక్షురాలు ఫుజిమోరి. జూన్‌లో అధ్యక్ష పదవికి జరిగిన రన్ ఆఫ్ ఎన్నికల్లో అతిస్వల్ప తేడాతో ఆమె విజయం సాధించారు. గతంలో ఆమె నాలుగుసార్లు దేశాధ్యక్ష పదవికి పోటీ చేసి విఫలమయ్యారు. గడచిన పది సంవత్సరాలలో దేశానికి ఆమె తొమ్మిదవ అధ్యక్షురాలు.పెరూదేశం అసిర్థత్వంలో ఉంది. నేరాలు విపరీతంగా జరుగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉం ది. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తారని ప్రజలు అమెపై ఆశలు పెట్టుకున్నారు. గడచిన దశాబ్దకాలంలో కేవలం ముగ్గురు మాత్రమే దేశాధ్యక్షులుగా ప్రజల ద్వారా ఎన్నికయ్యారు. మిగిలినవారంతా పూర్వ అధ్యక్షుల రాజీనామాల స్థానంలో తాత్కాలిక బాధ్యతలు నిర్వహించారు.ఫుజిమోరీకి చెందిన పాపులర్ ఫోర్స్‌పార్టీ, దాని మిత్రపక్షం పాపులర్ రెనోవేషన్‌కు పార్లమెంటులో చాలా బలం ఉన్నందువల్ల అధ్యక్షురాలిని అంత త్వరగా పదవీచ్యురాల్ని చేసే అవకాశం లేదు.

## రష్యా చమురు కొనుగోళ్ళపై ఆంక్షల బిల్లు

సెనేట్‌లో భారీ ఆమోదం

**వాషింగ్టన్:** రష్యా, ఇరాన్ దేశాల నుండి చమురు కొనుగోలు చేసే దేశాలపై ఆంక్షలు విధించేందుకు ఉద్దేశించిన ఒక బిల్లును సత్వరం అమలు చేసేందుకు వీలుగా అమెరికా సెనేట్ 86-12 ఓట్ల తేడాతో ఆమోదించింది. దీనివల్ల భారత్, చైనా సహా నాలుగు దేశాలపై 100 శాతం సుంకాలు విధించేందుకు ట్రంప్‌కు అధికారాలు వస్తాయి. సభలో ఉభయ పక్షాల సమన్వయంతో ఆమోదం పొందిన ఈ బిల్లు ట్రంప్‌కు అధికారాలు కల్పించే నిర్ణయంపై తుది చర్చకు అవకాశం ఇస్తుంది. రష్యా, ఇరాన్‌ల నుండి చమురు కొనుగోలు చేసే దేశాలపై అధ్యక్షుడు ట్రంప్ నూటికి నూరుశాతం సుంకాలు విధించేందుకు అధికారాలను కట్టబెడుతుంది. ఇది భారత్ చమురు కొనుగోళ్ళపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.అత్యధిక మెజారిటీతో ఈ బిల్లుకు సెనేట్ ఆమోదం లభించింది. ఈనెల 11న మరణించిన సీనియర్ రిపబ్లికన్ సభ్యుడు లిండ్సే గ్రాహంకు తుది వీడ్కోలు పలికిన తర్వాత కొద్ది గంటలకు సెనేట్ సమావేశమై ఈ బిల్లును ఆమోదించింది. దీనిపై సుదీర్ఘంగా కొనసాగుతున్న చర్చకు ముగింపు పలికేందుకు ఈ తీర్మానం చేశారు. ఈ ఆంక్షలు విధించేందుకు లిండ్సే గ్రాహం ఈ బిల్లును ప్రవేశపెట్టారు. దీనిపై సుదీర్ఘంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ సుదీర్ఘ చర్చలకు ముగింపు పలికేందుకు క్లోచర్ తీర్మానం చేశారు. ట్రంప్‌కు అధికారాలు ఇచ్చేందుకు చేసే బిల్లుపై ఈ క్లోచర్ తీర్మానం ద్వారా తుది చర్చలకు వీలు కలుగుతుంది. పుతిన్ యుద్ధానికి నిధులు సమకూరకుండా అడ్డుకునేందుకు ఈ బిల్లు ద్వారా ట్రంప్‌కు అధికారాలు వస్తాయి. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ట్రంప్‌తో సమావేశం తర్వాత ఈ బిల్లుకు ఆమోదం లభించింది.

## ఇరాన్‌కు త్వరలో చైనా క్షిపణి లాంఛర్లు

- 70 మిలియన్ డాలర్ల ఖర్చుతో కీలక ఆయుధాల సేకరణ

**టెహ్రాన్:** ఇరాన్‌కు త్వరలో చైనా క్షిపణి లాంఛర్లు అందనున్నాయి. ఇరాన్ వాయు రక్షణకు వీలుగా భుజంపై సులభంగా మోసుకుపోగలిగే 400 క్షిపణి లాంఛర్లను రాబోయే వారాల్లో చైనా ప్రభుత్వం సరఫరా చేయనున్నది. ఇంకా కీలకమైన అనేక ఆయుధాలను రాబోయే వారాల్లో ఇరాన్‌కు చేరుకుంటాయి. ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని,ఆయుధ సంపత్తిని గణనీయంగా పెంచుకోవడానికి సన్నాహాలు ప్రారంభించింది.ఈ ఏడాది ఫిబ్రవరి నుండి అమెరికా చేసన దాడుల్లో ఇరాన్ రక్షణ వ్యవస్థ దాదాపు చతికిలబడింది. శత్రువును నిలువరించగల కీలకమైన ఆయుధాల నిల్వలు తగ్గిపోయాయి.రక్షణ పాటవాన్ని పునర్నిర్మించుకుంటున్న దశలో మొదటి విడతగా వాయు రక్షణ నిమిత్తం 400 క్షిపణి లాంఛర్లు కొద్ది



వారాల్లో ఇరాన్‌కు చేరుకుంటాయని సంబంధిత ముగ్గురు వ్యక్తులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ బుధవారం ప్రకటించింది. ఈ క్షిపణి కొనుగోలు నిమిత్తం ఇరాన్ దాదాపు 70 మిలియన్ డాలర్లు ఖర్చుపెడుతోంది. ఇజ్రాయెల్‌తో యుద్ధం మొదలైనప్పటినుండీ చైనా వీటి సేకరణకోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేపట్టింది. యుద్ధ సైనిక స్థావరాలను, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలను కాపాడుకోవడంతో ఇరాన్‌కు ఉన్న బలహీనతలు ఈ యుద్ధం ద్వారా బయటపడ్డాయి. చైనాలో తయారైన క్యూడబ్ల్యు-12, ఎఫ్.ఎన్-16 క్షిపణులు సహా, సైనికులు సులభంగా భుజంమీద పెట్టుకుని మోసుకుపోగల 400 గగనతల రక్షణ వ్యవస్థలు ఇరాన్‌కు రాబోతున్నాయి.హాంగ్‌కాంగ్‌కు చెందిన జోంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్టిమెంట్ అనే సంస్థతో ఈ ఒప్పందంపై ఇరాన్ సంతకాలు చేసింది. చైనా ఆయుధ సరఫరాదారులకు, ఇరాన్ ప్రభుత్వానికి మధ్య ఈ హాంగ్‌కాంగ్ సంస్థ ఒక మధ్యవర్తి పాత్ర నిర్వహిస్తుంది. ఐతే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న ఇరాన్ ఈ వార్తలపై స్పందిస్తూ ఇవన్నీ కట్టుకథలని పేర్కొంది. చైనా ఎప్పుడూ శాంతిని,చర్చలను ప్రోత్సహిస్తుందని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఇరాన్‌కు ఈ పోర్టబుల్ క్షిపణి వ్యవస్థ ఎంతో సులభంగా ఉపయోగపడుతుందని నిపుణులు చెప్పారు. ఇరాన్ రక్షణకు ఇదెంతో ముఖ్యమైన వ్యవస్థ అన్నారు. వీటివల్ల సైనికులకు హాని తక్కువగా ఉంటుందని చెప్పారు.

## ప్రకటన చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

సమయాన్ని నిర్వహించాలని స్పీకర్ ఓం బిర్లా కోరారు. కానీ విపక్ష సభ్యులు అమిత్ షా ప్రకటన చేయాలని పట్టుపట్టారు. విప క్ష సభ్యులు ఎంతకీ తగ్గకపోవడంతో.. స్పీకర్ బిర్లా సభను 12 గంటలకు వాయిదా వేశారు. అయితే యాంటీ పేపర్ లీకేజీ బిల్లుపై మంగళవారం చర్చ ప్రారంభమైన విషయం తెలిసిందే. మరో వైపు రాజ్యసభలో కూడా విపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. మల్లిఖార్జున్ ఖర్గే మాట్లాడుతూ విద్యార్థులను కొట్టిన వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు. ప్రజలు సురక్షితంగా లేరని, ప్రజాస్వామ్యం కూడా సురక్షితంగా లేదని ఖర్గే అన్నారు. బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శాంతి, భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు సహజంగా చర్యలు తీసుకున్నారని జెపి నడ్డా అన్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభను కూడా 12 గంటల వరకు వాయిదా వేశారు. అయినా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సమావేశమైన కొద్ది నిమిషాలకే మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. బుధవారం పార్లమెంటు ఎగువ సభ వాయిదా పడటం ఇది రెండోసారి. జీరో అవర్ ప్రారంభమైన సుమారు 20 నిమిషాలకే మొదటిసారి వాయిదా పడింది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రశ్నోత్తరాల కోసం రాజ్యసభ సమావేశమైనప్పుడు, కాంగ్రెస్ ఎంపి రేణుకా చౌదరి హోం మంత్రి గురించి ప్రశ్నించగా, ఆయన సభకు హాజరు కావాలని డిమాండ్ చేయడంలో ఇతర ప్రతిపక్ష నాయకులు కూడా ఆమెతో కలిశారు. 'హోం మంత్రి ఎక్కడ ఉన్నారు? ఆయన్ని ఇక్కడికి పిలవండి' అని చౌదరి అన్నారు. దీంతో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

## ఇకపై చెల్లవు

(మొదటి పేజీ తరువాయి)

వ్యర్థ జలశుద్ధి ప్లాంట్లు ఉన్నాయి. అయితే పర్యావరణ (రక్షణ) చట్టం-1986లోని సెక్షన్ 3 కింద జారీచేయబడిన చట్టబద్ధమైన నోటిఫికేషన్ల ద్వారా పోస్ట్ ఫాక్టో (పని పూర్తయ్యాక) పర్యావరణ అనుమతులను మంజూరు చేసే అధికారం కేంద్రానికి ఉందని పేర్కొంది. అయితే, కేవలం ఒక ఆఫీస్ మెమోరాండం (అధికార పత్రం) ద్వారా అలాంటి అనుమతులు ఇవ్వలేమని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. '2021 ఆఫీస్ మెమోరాండం అనేది ఒక పరిపాలనా ఉత్తర్వు. ఇది ముందస్తు అనుమతి లేకుండా చేపట్టే ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరుకు నిరంతరం అనుమతినిస్తోంది. ఇది 2006 నోటిఫికేషన్ కింద విచారణ స్వభావాన్ని, అలాగే పర్యావరణ అనుమతుల మంజూరుకు సంబంధించిన ప్రమాణాలను గణనీయంగా మార్చేస్తోంది. తద్వారా గతంలో తీసుకువచ్చిన ప్రత్యేక చట్టాన్ని 2021 ఆఫీస్ మెమోరాండం ఒక పరిపాలనా ఆదేశం ద్వారా పక్కకు నెట్టేసింది. ఇది చట్టరీత్యా అనుమతించబడదు' అని ధర్మాసనం పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వం హక్కు), 21 జీవించే హక్కులను ఉల్లంఘిస్తోందని, ఈ కారణంగా 2021 ఆఫీస్ మోమెరాండం భవిష్యత్తు కాలానికి వర్తించే విధంగా రద్దు చేయబడిందని ధర్మాసనం తెలిపింది.

## అమిత్‌షాదే బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

తెలుసని భావిస్తూ దేవుళ్లమని నటించేవారు, రెండో వర్గాన్నే దేవుడిగా నమ్మే అంధభక్తులు అనే మూడు వర్గాలను ప్రస్తావిస్తూ బిజెపిని, దాని ప్రధాన మద్దతుదారులను పరోక్షంగా విమర్శించారు. హోం మంత్రి భయంతో లోక్‌సభకు హాజరు కాలేదని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై అధికార పక్షం అభ్యంతరాలు వ్యక్తం చేసింది. నీట్ పేపర్ లీక్ అంశంపై సిజెపి నేతృత్వంలో ఈనెల 20న పార్లమెంటుకు జరిగిన మార్చ్ సందర్భంగా భద్రతా దళాలు జరిపిన అణచివేతను ప్రస్తావిస్తూ, విద్యార్థులపై హింసాత్మక చర్యలకు హోం మంత్రి అధికారం ఇచ్చారని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. స్పీకర్ ఓం బిర్లా వెంటనే జోక్యం చేసుకుంటూ, ఇది హోం మంత్రిపై చర్చ కాదని అన్నారు. ఆరోపణలను నిరూపించడానికి ఆధారాలు చూపించాలని అన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వ్యతిరేకించి, ప్రతిపక్ష నేత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై చెలరేగిన గందరగోళం కారణంగా సభ రెండుసార్లు వాయిదా పడింది. తరువాత పార్లమెంట్ భవన సముదాయంలో రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడుతూ భారతదేశపు ధైర్యవంతుడైన హోంమంత్రి అని చెప్పుకునే వ్యక్తి సభలో ఎందుకు లేరు? ఆయన ఏమీ చేయకపోతే, ఎందుకు రావడం లేదు అని ప్రశ్నించారు. పార్లమెంటులో మాట్లాడటం తన హక్కు, ఆ హక్కు తనకు ఉండాలని రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. అలాగే, విద్యా వ్యవస్థను ప్రభావితం చేస్తూ, విద్యార్థులకు ఏమి బోధించాలో నిర్దేశిస్తోందని ఆరోపిస్తూ ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ' విద్యా వ్యవస్థ'ను ఆర్‌ఎస్‌ఎస్ చేజిక్కించుకుంది. ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పుడూ విద్యా మంత్రిత్వ శాఖను నడపలేదు. ఆ మంత్రిత్వ శాఖను నడిపే వ్యక్తి, సంస్థ పేరే ఆర్‌ఎస్‌ఎస్. అది కల్పించే ఈ అర్థంలేని చరిత్రను విద్యార్థులు నమ్మాల్సివస్తోంది. ప్రధాన్ కేవలం ఒక చిహ్నం మాత్రమే. మీ అసలైన శత్రువు ఆర్‌ఎస్‌ఎస్. మీరు అంధభక్తులుగా ఉండాలని కోరుకునేది వాళ్లే' అని గాంధీ అన్నారు. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు ఆర్‌ఎస్‌ఎస్ వైస్ ఛాన్సలర్ ఉన్నారని ఆయన ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థులు చేస్తున్న నిరసనల పట్ల తాను చాలా ఉత్సాహంగా, ఎంతో భరోసాతో ఉన్నానని పేర్కొన్నారు. 'మన వీధుల్లో ఈ దేశ భవిష్యత్తు చేసిన పని చూసి నేను చాలా ఉత్సాహంగా, భరోసాతో ఉన్నాను. ఇది కోపం కాదు, హింస కాదు, ద్వేషం కాదు; ఇది ఈ దేశ యువత, ఈ దేశ భవిష్యత్ తరాల భావప్రకటన, ప్రగాఢమైన భావప్రకటన. బిజెపిలోని నా మిత్రులతో సహా అన్ని పార్టీలు ఈ భావప్రకటనను గౌరవించాలి' అని అన్నారు. కొంతమంది విద్యార్థులతో జరిపిన సంభాషణ, యువత విద్యను, జ్ఞానాన్ని ఎలా చూస్తుందనే దానిపై తనకు ఒక అవగాహన కల్పించిందని గాంధీ అన్నారు. ఆ సంభాషణను గుర్తుచేసుకుంటూ, 'విద్యార్థిగా ఉండటం అంటే ఏమిటి?' అని తాను ఒక విద్యార్థినిని అడిగానని గాంధీ చెప్పారు. 'విద్యార్థి అంటే తనకు అన్నీ తెలియవని అంగీకరించేవాడు. అతనికి తెలిసినదంతా కొత్త జ్ఞానంతో అధిగమించబడుతుంది. విశ్వం గతిశీలమైనదని అతనికి తెలుసు. జ్ఞానం నిరంతరం మారుతూ ఉంటుందని కూడా అతను అర్థం చేసుకుంటాడు. విద్యార్థికి ఉండాల్సిన అత్యంత ముఖ్యమైన గుణం వినయం' అని ఆమె చెప్పిందని ఆయన అన్నారు. 'తమకు అన్నీ తెలుసని వారు దృఢంగా నమ్ముతారు. విశ్వం స్థిరంగా ఉంటుందని, జ్ఞానం తమలోపలి నుంచే ఉద్భవిస్తుందని వారు విశ్వసిస్తారు. వారు అహంకారులు. వారు వినరు, ఇతరుల సత్యాన్ని గౌరవించరు' అని ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ఆయన ఉపయోగించిన ఒక పదాన్ని సభాపతి అసభ్యకరమైనది అని అభ్యంతరం తెలిపారు. సత్యమే తమ ఆభరణంగా భావించడం విద్యార్థి లక్షణమని, మరో వర్గం వారికి మాత్రం ఒక కృత్రిమ ఇమేజ్‌ను (ప్రతిష్టను) సృష్టించుకోవాల్సిన అవసరం ఉంటుందని ఆ విద్యార్థి తనతో చెప్పారని గాంధీ పేర్కొన్నారు.

## పైరుకు జీవం...

(మొదటి పేజీ తరువాయి)





నమోదుకాగా, శ్రీరాంసాగర్‌కు 4,000 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో 29 శాతం, నిర్మల్ జిల్లాలో 13.7 శాతం, మంచిర్యాల జిల్లాలో 10 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాల్లోని ఓపెన్‌కాస్ట్ గనుల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. మందమర్రి ఏరియాలో సాధారణంగా రోజుకు 5 నుంచి 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండగా, భారీ వర్షాలతో గత రెండు రోజులుగా 4 నుంచి 5 వేల టన్నుల ఉత్పత్తి నిలిచిపోయింది. టన్ను బొగ్గు విలువ సుమారు 6 వేల ఉండటంతో సంస్థకు కోట్ల రూపాయల మేర ఉత్పత్తి నష్టం వాటిల్లింది. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలోనూ ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. బెల్లంపల్లిలో రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం కురవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పద్మశాలి భవన్ రోడ్డులో భారీ చెట్టు నేల కూలడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలో భారీ వర్షానికి ఎర్రకుంట చెరువుకు గండి పడింది. రైల్వే స్టేషన్ ఏరియాలోని హనుమాన్ గుట్ట కింద ఉన్న భవనాలు నీట మునిగి పోయాయి. ఇటీవలే ఈ చెరువును రూ.23 లక్షలతో మరమ్మతులు చేయించండం గమనార్హం. నిర్మల్ జిల్లాలో కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. లక్ష్మణచాందా మండలం కనకాపూర్ వాగు ఉప్పొంగడంతో పీచార నుంచి సోన్ మధ్య రాకపోకలు నిలిచాయి. కడెం మండలం కుర్రగూడెం, పాత రేవోజీపేటలో తాత్కాలిక వంతెన తెగిపోయింది. దీంతో ఆ ప్రాంతం మధ్య రవాణా నిలిచిపోయింది. ఎగువ నుంచి వరద ప్రవాహం వస్తుండడంతో కడెం, స్వర్ణ జాలాశయాల్లోకి వరద నీరు చేరుతోంది. కడెం ప్రాజెక్టు ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 11,890 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం 684.100 అడుగులకు చేరింది. ఎగువన ప్రవాహం ఉధృతంగా ఉండటంతోప్రాజెక్టు గేటు ఎత్తి నీటిని దిగువకు గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) జలాశయంలోకి కూడా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు నిలకడగా వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 4,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదవుతోంది. భైంసా సమీపంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి కూడా వరద నీటి చేరిక ప్రారంభమైంది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రస్తుతం ప్రాజెక్టులోకి 156 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, నీటిమట్టం 355.70 మీటర్లకు చేరింది.

### జగిత్యాల-ధర్మపురి మధ్య నిలిచిపోయిన రాకపోకలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా రామడుగు మండలంలో 85.8 మి.మీ వర్షం కురవగా వీణవంక మండలంలో అత్యల్పంగా14.8 మి.మీల వర్షాపాతం నమోదైంది. లోయర్ మానేరు డ్యాం లోకి మంగళవారం రాత్రి నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 1387 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. గన్నేరువరం మండలంలోని పారువేల్ల పెద్ద చెరువులోకి వరద నీరు పెద్ద ఎత్తున వచ్చి చేరుతుంది, గంగాధర మండలం చెర్లపల్లి (ఆర్)లోపంట పొలాలు నీట మునిగాయి. గతేడాది 2.79 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఈ యేడాది ఇప్పటివరకు 1.70 వేలు మాత్రమే సాగు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్‌తో పాటు అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలు వర్షం నీటిలో కలకలలాడాయి. జగిత్యాల పట్టణంలోని వెంకటాద్రి నగర్, మహాలక్ష్మి, తులసీనగర్ తదితర లోతట్టు ప్రాంతాలు జలమయంకావడంతో పాటు ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో ప్రజలకు ఇబ్బందులు పడ్డారు. జగిత్యాలలోని మార్కెట్ యార్డు, వాణినగర్ ప్రాంతాల్లో రహదారులపై చెట్టు కూలింది. జగిత్యాల-ధర్మపురి ప్రధాన రహదారి జగిత్యాల రూరల్ మండలం అనంతారం బ్రిడ్జి, ధర్మపురి మండలం నెరెల్ల గ్రామ శివారులోని ఆకుసాయి పల్లి బ్రిడ్జిపై నుండి వర్షం నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో సారంగాపూర్ మండలంలో 176.3 , బుగ్గారం మండలంలో 169.8, ఎండపల్లి మండలంలో 144.5, వెల్గటూర్ మండలంలో 142.3 మిల్లిమీటర్లు చొప్పున వర్షపాతం నమోదు అయ్యింది. పెద్దపల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు తడిసి ముద్దయింది. దీంతో కోల్ బెల్టు ప్రాంతం జలమయమయం కావడంతో.. బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. గోదావరిఖని సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద నాలా ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దపల్లి జిల్లా మంథని, కమాన్పూర్ ,రామగిరి, ముత్తారం మండలాల్లో రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తోంది. పలుచోట్ల నాలాలు పొంగిపొర్లుతున్నాయి.

### పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వర్షం దంచికొట్టింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన జోరువానకు వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షానికి పలుచోట్ల రోడ్లు తెగిపోవడంతో పాత ఇళ్లు కూలిపోయాయి. డిచ్‌పల్లి, మాక్లూరు రూరల్, ధర్పల్లి, జుక్కల్ మండలాల్లో అత్యధికంగా 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బోధన్‌లోని ఆటోనగర్, ప్రెస్ కాలనీలతోపాటు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ధర్పల్లి, సిరికొండ మండలాల్లో కురిసిన వర్షాలకు గడ్కోల్, వాడీ, హొన్నాజీపేట్ వాగులతో పాటు కప్పలవాగు ఉధృతంగా ప్రవహించటంతో సిరికొండ మండలం కొండూర్ వద్ద ఉన్న బ్రిడ్జి పక్కన మట్టి కొట్టుకుపోవటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

### పొంగుతున్న వనదుర్గ ఆనకట్ట

ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హవేలీఘనపూర్ మండలంలో ధూప్ సింగ్ తండా వాగు ఉప్పొంగుతుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ భవాని మాత సమీపంలో ఉన్న వనదుర్గ ఆనకట్ట పొంగిపొర్లుతోంది. ఆనకట్ట అలుగు పారుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక మండలాల్లో భారీ వర్షం కురిసింది. కుండపోత వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కూడవెల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

### భూపాలపల్లిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. భూపాలపల్లి జిల్లాలో ముఖ్యంగా కాళేశ్వరం, గోదావరి, మేడిగడ్డ ప్రాజెక్టు, మూరంచ పల్లె వాగు, చలివాగులు నిండి ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం మేడిగడ్డ 100 మీటర్ల సామర్థం ఉండగా 89.90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది. 67,800 క్యూసెక్కుల నీళ్లతో నిండి ఉంది. 85 గేట్ల ద్వారా నీటిని దిగువకు గేట్ల ద్వారా పంపిస్తున్నారు. అట్లాగే కాలేశ్వరం వద్ద గోదావరి 5.550 మిల్లి మీటర్ల ఎత్తులు నీటిమట్టం ప్రవహిస్తుంది. భూపాలపల్లి సింగరేణి ఏరియాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కెటికె ఓసి 2,3లలో బొగ్గు ఉత్పత్తి అంతరాయం కలిగింది. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హాస్పటల్ ఆవరణంలోకి భారీగా వరద నీరు చేరడంతో ఆసుపత్రి నీటితో జలదిరిగ్బంధంలో చిక్కుకుంది. ములుగు జిల్లాలో మంగళవారం సాయంత్రం వీచిన సుడిగా బీభత్సం సృష్టించింది. మంగపేట మండలం కోమటిపల్లి అటవీ ప్రాంతంలో వందలాది భారీ వృక్షాలు నేలకూలగా, పలు గ్రామాల్లో ఇళ్లు, విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. మంగపేట, వెంకటాపూర్, కన్నాయిగూడెం, ఏటూరునాగారం తదితర మండలాల్లో సుడిగాలి ప్రభావం అధికంగా కనిపించింది. వాజేడు మండలాన్ని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ ప్రభావంతో బొగత జలపాతం ఉగ్రరూపం దాల్చి భారీ జలధారలతో గర్జిస్తోంది. పర్యాటకుల భద్రత దృష్ట్యా అటవీ శాఖ అధికారులు బొగత జలపాతానికి తాత్కాలికంగా పర్యాటక అనుమతులను నిలిపివేశారు. మరోవైపు 163వ జాతీయ రహదారి హైదరాబాద్-భూపాలపట్నం, చీకుపల్లిపెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ప్రవహించే ఇసుక వాగు వరద ఉధృతి ప్రమాదకర స్థాయికి చేరుకుంది. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పాత వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం కొనసాగుతుండగా, రాకపోకల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక డైవర్షన్ అప్రోచ్ రోడ్డు వరద ప్రవాహానికి వారం వ్యవధిలోనే రెండోసారి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో తెలంగాణఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. వాజేడు మండలంలో గత రెండు రోజులుగా సుమారు 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు పతకాలు

పోలియో రాకసి రూపంలో వచ్చిన వైకల్యాన్ని.. పెండ్లి రూపంలో ఎదురైన కష్టాలను అధిగమించి క్రీడలకు రిటైర్మెంట్ ఇచ్చే 34 ఏండ్ల లేటు వయసులో కెరీర్ ఆరంభించిన ధీర వనిత షర్మిల ధన్ఖడ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్త చరిత్ర సృష్టించింది. మెగా గేమ్స్ చరిత్రలో పారా అథ్లెటిక్స్‌లో భారత్‌కు తొలి బంగారు పతకం అందించిన క్రీడాకారిణిగా రికార్డులకెక్కింది. పారా షాట్‌పుట్‌లో షర్మిల స్వర్ణం గెలవగా.. ఇదే పోటీలో శిల్పా శైలా కాంస్యంతో మురిసింది. ఇంకోవైపు తండ్రి బాటలో పయనించిన తెలుగు వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు, హై జంపర్ సర్వేశ్ కుశారే రజతాలతో మెరడంతో కామన్వెల్త్‌లో భారత పతకాల సంఖ్య పదికి చేరింది. ఎఫ్57 కేటగిరీ మహిళల షాట్‌పుట్‌లో షర్మిల గుండును 9.81 మీటర్ల దూరం విసిరి గోల్ సొంతం చేసుకుంది. 20 ఏండ్ల కామన్వెల్త్ పారా అథ్లెటిక్స్ చరిత్రలో భారత్‌కు ఇదే తొలి పసిడి కావడం విశేషం. శిల్ప 7.26 మీటర్ల త్రో చేసి కాంస్యం అందుకుంది. తొలుత నైజీరియాకు చెందిన యుకారియా ఇయాజీ మూడో స్థానంలో నిలిచినట్టు అధికారులు ప్రకటించారు. అయితే, భారత్ నిరసనతో







నిర్వహించిన రివ్యూలో నైజీరియా అథ్లెట్ ఫౌల్ చేసినట్టు తేలడంతో శిల్పకే కాంస్యం దక్కింది. ఇక, పురుషుల హైజంప్‌లో కొద్దిలో స్వర్ణం చేజార్చుకున్న సర్వేశ్ కుశారే రజతం అందుకున్నాడు. హోరాహోరీగా సాగిన పోటీలో సర్వేశ్, జమైకా జంపర్ రొమైన్ బెక్ఫోర్డ్ ఇద్దరూ 2.25 మీటర్లు ఎత్తు దూకారు. కానీ, 2.28 మార్కును అధిగమించలేకపోయారు. విజేతను తేల్చేందుకు అంతకుముందు చేసిన ప్రయత్నాల్లో ఇద్దరు అథ్లెట్ల వైఫల్యాలను లెక్కించారు. ఒకే సారి విఫలమైన



బెక్ఫోర్డ్ స్వర్ణం అందుకోగా.. రెండు ప్రయత్నాల్లో ఫెయిలైన సర్వేశ్ రజతంతో సంతృప్తి చెందాడు. అయినా కామన్వెల్త్ గేమ్స్ హైజంప్లో సిల్వర్ నెగ్గిన భారత అథ్లెట్గా రికార్డు సృష్టించాడు.

**ఒక్క కేజీ తేడాతో అజయ్‌కు గోల్డ్ మిస్..** ఆంధ్రప్రదేశ్ వెయిట్లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబు పురుషుల 79కేజీ కేటగిరీలో సిల్వర్ నెగ్గాడు. 21 ఏండ్ల అజయ్ ఫైనల్లో మొత్తం 330 కిలోల బరువెత్తి రెండో స్థానం సాధించాడు. 145 కిలోలతో స్నాచ్ను ఆరంభించిన అజయ్ రెండో ప్రయత్నంలో విఫలమైనా చివరగా 149కిలోల బరువు మోసి గేమ్స్ రికార్డు సృష్టించాడు. క్లీన్ అండ్ జర్క్లో గోల్ ఫెవరేట్గా బరిలోకి దిగాడు. 181 కేజీలను క్లియర్ చేసినా ఒక్క కిలో తేడాతో కొద్దిలో స్వర్ణం కోల్పోయాడు. మలేసియాకు చెందిన ఎరీ హిదాయత్ మొత్తం 331 (147+184) కేజీలతో పసిడి సొంతం చేసుకోగా.. ఇంగ్లండ్ లిఫ్టర్ క్రిస్ మర్రే (325 కేజీ) కాంస్యం అందుకున్నాడు.



**ప్రీతి, ప్రియ, జాదుమణి పతక పంచ్...** భారత బాక్సర్లు పతక పంచ్ విసిరారు. ప్రీతి పవార్, ప్రియా ఘంఘాస్ సెమీస్ చేరి కనీసం కాంస్యాలు ఖాయం చేసుకున్నారు. 54 కిలోల క్వార్టర్స్‌లో ప్రీతి50తో నికోల్ క్లైడ్ (ఐర్లాండ్)ను చిత్తుచేసి సెమీస్కు చేరుకుంది. 60 కేజీ క్వార్టర్స్లో ప్రియ 41 లియా మిచెల్ ఓడించి ముందంజ వేసింది.

## 10వేల మీటర్ల పరుగులో గుల్వీర్‌సింగ్‌కు సిల్వర్

భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ చరిత్ర సృష్టించాడు. కామన్వెల్త్ క్రీడల్లో పురుషుల 10వేల మీటర్ల ఈవెంట్లో పతకం సాధించిన తొలి భారతీయుడి గా నిలిచాడు. ఈవెంట్లో గుల్వీర్ .. రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ రికార్డు హోల్డర్ అయిన గుల్వీర్.. కామెన్వెల్త్ గేమ్స్‌లో ఇండియాకు అథ్లెటిక్స్‌లో రెండో సిల్వర్ మెడల్ అందించాడు. ఇదే మెగా ఈవెంట్లో మెన్స్ హై జంప్ కేటగిరీలో సర్వేశ్ కుషేర్ కూడా సిల్వర్ మెడల్ గెలుచుకున్నాడు. గుల్వీర్‌సింగ్ 27:49.78 సెకన్లలో పదివేల మీటర్ల పరుగును ఫినిష్ చేశాడు. మొదటి స్థానంలో ఆస్ట్రేలియా అథ్లెట్ కై రాబిన్సన్ ఉన్నాడు. 27:48.93 సెకండ్స్ టైంతో రాబిన్సన్ స్వర్ణ పతకాన్ని ఎగురేసుకుపోయాడు. గ్లాస్గోలోని స్కాట్స్టన్ స్టేడియంలో భారీ వర్షం మధ్య పదివేల మీటర్ల ఈవెంట్‌ను నిర్వహించారు.



ప్రతికూల వాతావరణంలోనూ భారత అథ్లెట్ గుల్వీర్ అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. ఉత్తరప్రదేశ్లోని అత్రౌలీకి చెందిన అతను ప్రస్తుతం ఆర్మీలో చేస్తున్నాడు. తన ఈవెంట్ గురించి ఫ్యామిలీకి చెప్పలేదన్నాడు. ఇప్పుడు తాను 5కే ర్ప ఫోకస్ పెట్టినట్లు చెప్పారు. అమెరికాలోని స్కాట్ సిమ్మన్స్ సమక్షంలో గుల్వీర్ శిక్షణ పొందుతున్నాడు. అయితే ఆఫ్రికన్ రన్నర్స్ ఉన్న ఈ ఈవెంట్లో చాకచక్యంగా గుల్వీర్ తన రేస్ను కొనసాగించాడు.



## సోనమ్ జోడీకి కాంస్యం

ఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ల పతక జోరు కొనసాగుతున్నది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో భారత జోడీ సోనమ్‌హిమాన్షు కాంస్యం గెలిచింది. ఫైనల్లో భారత జంట 441.2 పాయింట్లు సాధించగా చైనాకు స్వర్ణం, రజతం దక్కాయి. ఈ టోర్నీలో ఇప్పటిదాకా భారత్ ఒక స్వర్ణం, ఒక రజతంతో పాటు రెండు కాంస్యాలతో నాలుగు పతకాలు సాధించి పట్టికలో మూడో స్థానంలో ఉంది.





మెక్సికోలోని హిడాల్గో రాష్ట్రంలోని టులా పురావస్తు ప్రదేశం వద్ద ఉన్న అట్లాంటియన్ విగ్రహాలు ప్రాచీన మెసోఅమెరికన్ కళా వారసత్వంలో అత్యంత ప్రసిద్ధ శిల్పాల్లో ఒకటి. ఇవి టోల్టెక్ నాగరికతకు చెందిన భారీ రాతి శిల్పాలు. క్రీ.శ. 900 నుంచి 1150 మధ్య కాలంలో టోల్టెక్‌ల రాజధాని అయిన టోలాన్ నగరంలో వీటిని నిర్మించినట్లు చరిత్రకారులు భావిస్తున్నారు. ముఖ్యంగా 10వ–11వ శతాబ్దాల మధ్య ఇవి రూపుదిద్దుకున్నట్లు పురావస్తు ఆధారాలు సూచిస్తున్నాయి. టోల్టెక్‌లు క్రీ.శ. 10వ నుంచి 12వ శతాబ్దాల మధ్య మధ్య మెక్సికో ప్రాంతంలో ప్రభావవంతమైన నాగరికతగా ఎదిగారు. వారు శిల్పకళ, వాస్తుశిల్పం, యుద్ధ వ్యూహాలు, మతపరమైన ఆచారాల్లో ప్రత్యేకత సాధించారు. టులా నగరం వారి రాజకీయ, సాంస్కృతిక కేంద్రంగా నిలిచింది. యోధ సంప్రదాయానికి ప్రాధాన్యం ఇచ్చిన టోల్టెక్ సమాజంలో యుద్ధం, రక్షణ, ఆధ్యాత్మిక విశ్వాసాలు పరస్పరం ముడి పడి ఉండేవి. టులాలోని అట్లాంటియన్ విగ్రహాలు నాలుగు భారీ మానవాకార శిల్పాల సమాహారం. ఒక్కో విగ్రహం సుమారు 4.5 మీటర్లు (15 అడుగులు) ఎత్తు ఉంటుంది. వీటిని ప్రధానంగా బసాల్ట్ రాయితో చెక్కారు. ఈ శిల్పాల్లో యోధుల రూపాన్ని చూపించారు. తలపై ప్రత్యేకమైన అలంకరణలు, శరీరంపై సైనిక దుస్తులు, చేతుల్లో ఆయుధాలు, రక్షణ కవచాలు కనిపిస్తాయి. వీరి చేతుల్లో ఈటెలు, కవచాలు ఉన్నట్లు చెక్కారు. శిల్పాలపై కనిపించే సూర్య చిహ్నాలు, యుద్ధ సంకేతాలు టోల్టెక్‌ల సైనిక శక్తిని ప్రతిబింబిస్తాయి. ఈ విగ్రహాలు టులాలోని క్వెట్జల్‌కోఆటల్ దేవాలయం పైభాగంలో నిలబడి ఉండేవి. క్వెట్జల్‌కోఆటల్ అనేది 'ఈకలతో కూడిన పాము దేవుడు'గా ప్రసిద్ధి చెందిన మెసోఅమెరికన్ దేవత. అట్లాంటియన్ విగ్రహాలు కేవలం ఆలయ నిర్మాణానికి ఆధారాలుగా మాత్రమే కాకుండా, దేవాలయాన్ని రక్షించే దివ్య యోధులుగా కూడా భావించబడ్డాయి. అందువల్ల వీటిలో మతపరమైన భావనలు, రాజశక్తి, సైనిక గౌరవం కలిసి కనిపిస్తాయి. టులా నగరం ఒకప్పుడు గొప్ప పట్టణ నాగరికతకు కేంద్రంగా ఉండేది. అక్కడ భారీ పిరమిడ్లు, వేడుకల ప్రాంగణాలు, బంతి ఆటల మైదానాలు, విస్తృతమైన శిల్ప సంపద ఉండేవి. అయితే 12వ శతాబ్దం నాటికి అంతర్గత సంఘర్షణలు, రాజకీయమార్పులు, వనరుల సమస్యల కారణంగా టులా క్రమంగా క్షీణించింది. అయినప్పటికీ టోల్టెక్‌ల ప్రభావం తరువాతి అజ్టెక్ నాగరికతపై గణనీయంగా పడింది. అజ్టెక్‌లు టోల్టెక్‌లను గొప్ప

## టోల్టెక్ నాగరికతకు ప్రతీకలు ఈ శిల్పాలు



సాంస్కృతిక పూర్వీకులుగా భావించారు. వారి కళ, మత విశ్వాసాలు, నిర్మాణ శైలులను అజ్టెక్‌లు స్వీకరించారు. టులాలోని అట్లాంటియన్ విగ్రహాలు కేవలం రాతి శిల్పాలు మాత్రమే కావు. అవి ఒక ప్రాచీన సమాజం యొక్క యుద్ధ శక్తి, మత విశ్వాసాలు, కళా నైపుణ్యం, సామాజిక వ్యవస్థలకు ప్రతీకలు. వేల సంవత్సరాల తరువాత కూడా ఈ విగ్రహాలు టోల్టెక్ నాగరికత వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్న అరుదైన పురావస్తు వారసత్వంగా నిలిచాయి.

## మాయా నాగరికతకు కొత్త భాష్యం!







మెక్సికోలోని ప్రాచీన మాయా నగరం ఎల్ పామర్ వద్ద శాస్త్రవేత్తలు అత్యాధునిక 3డి స్కానింగ్ సాంకేతికతతో 'స్టీలా 46' అనే శిలాశాసనాన్ని తిరిగి అధ్యయనం చేసి, మాయా నాగరికత చరిత్రను కొత్తగా అర్థం చేసుకునే కీలక ఆధారాన్ని కనుగొన్నారు. ఈ పరిశోధనలో శిలాశాసనంపై చెక్కబడిన 'లాంగ్ కౌంట్' తేదీ క్రీ.శ. 180 సంవత్సరానికి చెందినదని వారు నిర్ధారించారు. దీంతో మాయా లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటివరకు తెలిసిన లిఖిత చరిత్ర కాలక్రమం మరింత వెనక్కి వెళ్లింది. మాయా నాగరికత ప్రపంచంలోని అత్యంత అభివృద్ధి చెందిన ప్రాచీన నాగరికతల్లో ఒకటి. ఖగోళ శాస్త్రం, గణితం, క్యాలెండర్ వ్యవస్థ, లిపి రచనలో వారు విశేష ప్రగతి సాధించారు. అయితే మాయా లోతట్టు ప్రాంతాల్లో లభించిన తొలి శాసనాల కాలం గురించి ఇప్పటివరకు శాస్త్రవేత్తల మధ్య చర్చ కొనసాగుతోంది. ఎల్ పామర్‌లోని స్టీలా 46పై ఉన్న శాసనాలు కాలక్రమేణా చెరిగిపోవడంతో వాటిని పూర్తిగా చదవడం కష్టమైంది. ఇక్కడే 3డి స్కానింగ్ కీలక పాత్ర పోషించింది. సాధారణంగా కనిపించని సూక్ష్మ అక్షరాలు, ఉపరితల మార్పులను డిజిటల్ పద్ధతిలో గుర్తించి పరిశోధకులు శాసనాన్ని పునర్నిర్మించారు. దాంతో క్రీ.శ. 180 తేదీని గుర్తించగలిగారు. ఈ ఆవిష్కరణ మాయా నాగరికతలో లిపి వినియోగం, రాజకీయ వ్యవస్థలు, రాజవంశాల చరిత్ర మనం ఊహించిన దానికంటే మరింత పురాతనమని సూచిస్తోంది. అంటే మాయా ప్రజలు రెండువేల సంవత్సరాల కిందటే సంక్లిష్టమైన చారిత్రక నమోదులను నిర్వహించే స్థాయికి చేరుకున్నారని ఈ శిలాశాసనం వెల్లడిస్తోంది.

# నిరంకుశ వైఖరితో పాలన తగదు

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





**ప్రజాపక్షం/భువనగిరి :** ఢిల్లీ విద్యార్థులపై లాఠీ చార్జి ప్రజాస్వామ్యంపై దాడి అని, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని, ఇలాంటి నిరంకుశ, కక్ష సాధింపు చర్యలతో పాలన తగదని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కన్వెన్షన్ హాల్లో సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యవర్గసభ్యుడు ఎండి.ఇమ్రాన్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశ విద్యావ్యవస్థలో పారదర్శకతను కాపాడాల్సిన కేంద్రప్రభుత్వం అందులో విఫలమైందని ఆరోపించారు. నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీ ఆరోపణలపై బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేవాలయాల పేరుతో రాజకీయాలు చేసే వారు ఇలాంటి ఘటనలపై ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మికులు, రైతులు, విద్యార్థుల సమస్యలను కేంద్రప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు జరుగనున్నాయని, రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది యువత ప్రతినిధులు హాజరుకానున్న ఈ మహాసభలను జిల్లాప్రజలు, పార్టీశ్రేణులు, యువత స్వాగతించి విజయవంతం చేయాలని కోరారు. మహాసభల్లో యువత ఎదుర్కొంటున్ననిరుద్యోగం, విద్య, ఉపాధి, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఈ మహాసభల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు నెల్లికంటి సత్యం తెలిపారు. సమావేశంలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, చెక్క వెంకటేష్, పల్లె శేఖర్ రెడ్డి, చిగుళ్ల లింగం, కుసుమని హరిచంద్ర, యేశాల అశోక్, పెరబోయిన మహేందర్, జిల్లా సమితి సభ్యులు గాదెగాని మాణిక్యం, కళ్లేపల్లి మహేందర్, అన్నెపు వెంకట్, అన్నేమైన వెంకటేష్, దుబ్బాక భాస్కర్, మరుపాక వెంకటేష్, చౌడబోయిన కనకయ్య, దాసరి లక్ష్మయ్య, ఎల్లంకి మహేష్, బబ్బురి శ్రీధర్, కలకొండ సంజీవ, చిలివేరు అంజయ్య, ఆలేటి బాలరాజు, జెల్ది రాములు, ఇంజ హేమలత, వడ్లకొండ భారతమ్మ, అరే పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలు, నిరసనలు ప్రజల హక్కు

నిర్బంధాలతో అణిచివేస్తే పతనం తప్పదు

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజాస్వామ్య దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు తెలపడం, పోరాటాలు నిర్వహించడం ప్రజల హక్కు అని దానికి భంగం కలిగించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై హింసాత్మక చర్యలకు పాల్పడటం, అక్రమంగా కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. బుధవారం సిపిఐ ఖమ్మం నియోజకవర్గస్థాయి శిక్షణా తరగతులు స్థానిక జిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగాయి. శిక్షణా తరగతులకు ముందు సిపిఐ పతాకాన్ని నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె జానిమియా ఆవిష్కరించారు. పగడాల మల్లేష్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన శిక్షణా తరగతుల్లో ప్రస్తుత రాజకీయాలు కమ్యూనిస్టుల పాత్రపై హేమంతరావు మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి జరిగిన ఆందోళనలపై మోదీ సర్కార్ ఉక్కు పాదం మోపిందని పాశవికంగా అణిచివేసే ప్రయత్నం చేసిందన్నారు. ఢిల్లీలో జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి న్యాయ విచారణ జరిపించాలని, అక్రమంగా నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో మరో ఉద్యమం పురుడుపోసుకోక తప్పదన్నారు. బిజెపి ప్రజాప్రతినిధులు విశ్వ హిందూ పరిషత్, ఆర్‌ఎస్ఎస్ నేతలు ఉన్మాద చర్యలను ప్రేరేపిస్తున్నాయన్నారు. మారిన పరిస్థితుల్లో దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని, సంపద కొంత మంది చేతుల్లో పోగుపడుతూ పేదలు మరింత పేదలు అవుతున్నారన్నారు. మోదీ కార్పొరేట్ల కోసమే పాలన సాగిస్తున్నారని, కార్పొరేట్ల కోసమే చట్టాలు చేస్తున్నారని, కార్పొరేట్ల కోసమే మోడీ, షాలు జీవిస్తున్నారని ఆయన తెలిపారు. పెరిగిననిరుద్యోగం, ఆర్థిక అంతరాలు, వ్యవసాయరంగ సంక్షోభం, లేబర్ కోడ్స్, ఉపాధి లేమి భవిష్యత్తు ఉద్యమాలకు దారి తీస్తుందని దీనిని ఎదుర్కొనేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని, అణిచివేత కొనసాగితే పతనం తప్పదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని రాను రాను ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోతుందని హేమంతరావు తెలిపారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, రుణ మాఫీ, రైతుబంధు, రైతు బీమాతో పాటు మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. దేశంలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పోరాట కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కారానికి పోరాటాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత దగ్గర కావాలని బాగం ఆకాంక్షించారు. ఈ శిక్షణా తరగతుల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు మాట్లాడారు. ఈ శిక్షణా తరగతుల్లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, సిపిఐ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరుతో కార్మికుల హక్కులు కాలరాస్తున్న పాలకులు : మేకల దాసు





**ప్రజాపక్షం/మందమర్రి :** అభివృద్ధి పేరుతో కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యం కల్పిస్తూ, పాలకులు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, జిల్లా అధ్యక్షుడు ఎండి అక్బర్ అలీ విమర్శించారు. మందమర్రిలోని ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన పట్టణ, మండల మహాసభల్లో వారు మాట్లాడారు. దేశంలోని సహజ సంపదలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం, కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను బలహీనపరచడం అభివృద్ధి కాదని, నిజమైన అభివృద్ధి అంటే కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత జీవన ప్రమాణాలు మెరుగుపడటమే నన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా అసంఘటిత కార్మికులను విస్మరిస్తోందని ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలో జిల్లా కార్మిక కమిషనర్ కార్యాలయం లేకపోవడంతో కార్మికులు ఆదిలాబాద్‌కు వెళ్లాలి వస్తుందని, తక్షణమే జిల్లాలో డిఎల్‌సి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు శైలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్‌తో పాటు ఎఐటియుసి ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ

## ఆగస్టు 6 నుంచి 14 వరకు పాదయాత్రలు

సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు





**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజాసమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆగస్టు 6 నుంచి 14 వరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర, జిల్లా, మండల కేంద్రాలలో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సిపిఐ హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయం లో బుధవారం జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి మద్దెల ఎల్లేష్‌తో కలిసి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పాదయాత్ర పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలతో నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. అవినీతి రోజు రోజుకు పెరుగుతుందని, భక్తులు అయోధ్య రామ మందిరానికి చెల్లించిన కానుకలను సైతం అక్రమార్కులు మింగేసారని, అక్రమార్కులను రక్షించడానికి బిజెపి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్రలు, సెప్టెంబరు 1న ఛలో ఢిల్లీ, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాల్లో పాదయాత్రలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. ఆగస్టు 6 నుండి 14 వరకు ప్రత్యేకంగా పలు నియోజక వర్గాల్లో పాదయాత్రలు జరుగుతాయని, సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు వెల్లడించారు. శ్రేణులన్నీ సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేసి, బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని ఈ సందర్భంగా తక్కళ్లపల్లి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు అశోక్ స్టాలిన్, భాషబోయిన సంతోష్, బత్తిని సదానందం, ఎదునూరి వెంకటరాజం, వేల్పుల సారంగపాణి, దుప్పటి సాంబయ్య, కండె నర్సయ్య, రాసమల్ల దీనా, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించకుంటే ఉద్యమాలు

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించకుంటే ప్రజాఉద్యమాలు తప్పవని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తెలిపారు. జిల్లాలోని తాడూర్ మండలం బలాన్ పల్లి గ్రామంలో ఆనాటి ప్రభుత్వం 1990 లో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కానీ హద్దులు జాగాలు చూపించలేదు, నేటికీ ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో ఇండ్ల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ 1999లో 54 మందికి పట్టాలు ఇచ్చారని,. 2000లో 54 మందికి పట్టాలిచ్చారన్నారు. ప్రభుత్వం స్పందించి పట్టాలు ఇచ్చిన వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, సూర్యశంకర్ గౌడ్, విద్యా శ్రీనివాసులు, మారేడు శివశంకర్, సిపిఐ తాడూరు మండల సహాయ కార్యదర్శి దాంగడ్ల వెంకటస్వామి, నాయకులు ఈర్ల నారాయణ, కొండన్న గౌడ్, అగ్నివేష్, గిరి, బాలస్వామి, భాస్కర్, ప్రభాకర్, ముసలయ్య, గిరిచారి, వెంకటేశ్వరమ్మ, శోభ, శివలీల పాల్గొన్నారు.






## సాంబార్ జింకను వేటాడి మాంసం పంచుకున్న 17 మంది అరెస్ట్

### 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** సాంబార్ జింకను వేటాడి మాంసం పంచుకున్న 17 మంది వ్యక్తులను అరెస్టు చేసి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు అచ్చంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.ఎ.సుబూర్, లింగాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఈశ్వర్‌లు తెలిపారు. బుధవారం అచ్చంపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని పీర్ల దేవుని చెలక అటవీ ప్రాంతంలో పద్మారం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సాంబార్ జింక మాంసాన్ని ముక్కలుగా చేసి పరస్పరం పంచుకొని భుజించిన ఘటన వెలుగులోకి రావడంతో అటవీశాఖ అధికారులు అత్యంత వేగంగా స్పందించి సంఘటన స్థలాన్ని పరిశీలించి, ఆధారాలను సేకరించి సమగ్ర విచారణ చేపట్టారు. విచారణలో ఘటనకు సంబంధించి 17 మంది నిందితులను గుర్తించి అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయస్థానం వారిని 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించి వారిని కల్వకుర్తి సబ్ జైలుకు తరలించాలని ఆదేశించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడడం, చంపడం, మాంసాన్ని కలిగి ఉండటం, వినియోగించడం చట్టరీత్యా నేరమని, వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అక్రమ వేటను అరికట్టి వన్యప్రాణుల సంరక్షణకు నిరంతరం కృషి చేస్తామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

## కంగనా రనౌత్ క్షమాపణ చెప్పాలి

### రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జంతర్ మంతర్ వద్ద తమ హక్కులకై పోరాటం చేసిన జెన్ జి ఉద్యమ మహిళలను ఉద్దేశించి బిజెపి ఎంపి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధ్యతారాహిత్యంగా, మహిళలను కించపరిచేలా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పేర్కొన్నారు. వెంటనే జెన్ జి మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో నైతిక బాధ్యత వహించి ఎంపి పదవికి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నిరసనలో పాల్గొన్న మహిళలను 'చదువుకోలేదు, అన్‌పడ్, గవార్, మంచి హౌస్ వైఫ్ కూడా కాలేరు, గటార్ చాప్' అంటూ వ్యాఖ్యానించడం ఒక ప్రజాప్రతినిధికి తగదని ఆమె విమర్శించారు. జెన్ జి మహిళలతో వివాదానికి దిగడం ద్వారా కంగనా రనౌత్ తన స్థాయిని తానే దిగజార్చుకున్నారని వ్యాఖ్యానించారు. రైతు ఉద్యమం సందర్భంగా మహిళలను 'రూ.500లకు అద్దెకు వచ్చినవారు' అంటూ చేసిన వ్యాఖ్యల తర్వాత ఎయిర్‌పోర్టులో జరిగిన ఘటనను కంగనా రనౌత్ మరచిపోయినట్టున్నారని స్వర్ణ ఎద్దేవా చేశారు.

## అక్టోబర్‌లో 'ఎ.యు' స్నాతకోత్సవం

### దరఖాస్తులకు సెప్టెంబర్ 9వరకే గడువు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని 'డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ 27వ స్నాతకోత్సవ' కార్యక్రమం అక్టోబర్ నెలలో నిర్వహించనున్నట్టు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎల్. విజయా కృష్ణారెడ్డి తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో జూన్ 2024 నుండి జూన్ 2025 వరకు ఉత్తీర్ణులైన డిగ్రీ, పీజీ, ఎంఫిల్, పిహెచ్‌డి, డిప్లొమాలు, పలు సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రత్యక్షంగా హాజరు కావాలంటే ఆన్‌లైన్ ద్వారా రూ.500లను చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్నాతకోత్సవానికి హాజరు కాలేని అభ్యర్థులు డిగ్రీ ఇన్ అబ్సెంటియా కోసం రూ.600లను చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అబ్సెంటియా ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు స్నాతకోత్సవం తర్వాత నేరుగా వారి సర్టిఫికెట్లను పోస్ట్ ద్వారా వారి చిరునామాలకు పంపిస్తామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 9వ తేదీలోపు www.braou.ac.in లేదా www.braouonline.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.braou.ac.in ను చూడాలని, లేదా హెల్ప్ డెస్క్ 040 23680333/555 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. చివరి తేదీ సెప్టెంబరు 9వ తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులను,అలాగే అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులను తిరస్కరిస్తామని స్పష్టం చేశారు.

# 'ఫిర్యాదు కోసం వచ్చిన మహిళలే లక్ష్యం..!

### అధికారం అడ్డం పెట్టుకుని వల విసురుతున్న కొంత మంది పోలీసులు
### నివారణ చర్యలపై దృష్టి సారించిన డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో న్యాయం కోసం పోలీసు స్టేషన్లకు వచ్చిన మహిళలకు రక్షణ లేకుండా పోతున్నదని విమర్శలు వెల్లువెత్తున్నాయి. బాధితులకు భరోసా కల్పించాల్సిన పోలీస్ స్టేషన్లలోనే కొంత మంది అధికారులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతున్నది. పోలీస్ స్టేషన్ కొంతమంది మహిళలకు భయాన్ని కలిగించే ప్రదేశంగా మారిన ఘటనలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవలి కాలంలో తెలంగాణలో బయటపడిన కొన్ని కేసులు చూస్తే, కుటుంబ కలహాలు, గృహ హింస, ఆస్తి వివాదాలు, వేధింపులు వంటి సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల మానసిక బలహీనతను కొందరు అధికారులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా జూబ్లీహిల్స్ సిఐ ఒక బాధిత మహిళను లైంగికంగా వేధించి గర్భవతిని చేసినట్లు, ఆర్థికంగా కొల్లగొట్టి దోచుకున్నట్లు ఆరోపణలు రావడం, అతనిని విధుల నుంచి సస్పెండ్ చేయడం రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అధికారుల పనితీరుపై చర్చకు దారితీసింది. అలాంటి కొంత మంది పోలీసు అధికారుల ప్రవర్తన వల్ల నిజాయితీగా పనిచేసే పోలీసులు, పోలీసు వ్యవస్థ అప్రతిష్ట పాలవుతున్నదని ప్రజలతో పాటు పోలీసు అధికారులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కేసు పేరుతో బాధిత మహిళలతో అక్రమ సంబంధాలు :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల్లో చాలామంది ఇప్పటికే తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉంటారు. భర్త వేధింపులు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర వివాదాలతో న్యాయం కోసం వస్తారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు పోలీసులు 'మీ సమస్య నేను పరిష్కరిస్తాను' అని వ్యక్తిగత పరిచయం పెంచుకోవడం, దర్యాప్తు అవసరం పేరుతో మొబైల్ నంబర్లు తీసుకోవడం, కొన్ని కేసుల్లో, విధులకు సంబంధం లేని సమయంలో పదే పదే ఫోన్ చేయడం, వ్యక్తిగత సందేశాలు పంపడం, పోలీస్ స్టేషన్ వెలుపల కలవాలని ఒత్తిడి తేవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒంటరిగా ఉన్న మహిళలు లేదా కుటుంబ సహకారం లేని బాధితులను లక్ష్యంగా చేసుకుని, మాటలతో నమ్మకం కల్పించి వ్యక్తిగత సంబంధాలు ఏర్పరచుకోవడానికి ప్రయత్నించారనే ఆరోపణలు కొన్ని కేసుల్లో ఉన్నాయి. కొన్ని సందర్భాలలో బాధిత మహిళలకు పెళ్లి చేస్తానని నమ్మించి మోసం చేశారనే ఫిర్యాదులు కూడా నమోదయ్యాయి. కొన్ని ఘటనల్లో, మహిళలు అభ్యంతరం చెబితే కేసు విచారణలో నష్టం చూస్తామని బెదిరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

**పోలీసు వ్యవస్థకు మచ్చ:** రాష్ట్రంలో పోలీసు శాఖలో వేలాది మంది అధికారులు, సిబ్బంది మహిళలకు అండగా నిలుస్తూ విధులు నిర్వహిస్తున్నారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్, మహిళా హెల్ప్‌డెస్క్‌లు, ప్రత్యేక స్పందన వ్యవస్థలు పనిచేస్తున్నాయి. అయితే గతంలో ఖమ్మం, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాలలో, తాజాగా జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో బాధిత మహిళల పట్ల పోలీసు అధికారుల ప్రవర్తనపై ఆరోపణలు రాష్ట్రంలో చర్చకు దారితీశాయి. కొన్ని సందర్భాల్లో సంబంధిత అధికారులపై శాఖాపరమైన విచారణలు, క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కొన్ని కేసుల్లోనూ ఆరోపణలు ఇంకా కోర్టు లేదా దర్యాప్తు దశలోనే ఉన్నాయి. అందువల్ల కొంత మంది వ్యక్తుల ప్రవర్తనను మొత్తం పోలీసు వ్యవస్థకు ఆపాదించడం సరైంది కాదు.

**ఎస్‌పిలు, కమిషనర్లకు సూచనలు జారీ చేసిన డిజిపి**

జూబ్లీహిల్స్ ఎస్‌హెచ్‌ఓ లైంగిక దాడి లాంటి కేసులు పునరావృత్తం కాకుండా ఉండేందుకు డిజిపి సి.వి.ఆనంద్ రాష్ట్రంలోని ఎస్‌పిలు, కమిషనర్లకు సూచనలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్ అంటే ప్రజలకు భరోసా కలిగించే స్థలం అనే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. న్యాయం కోసం వచ్చిన మహిళలు మరొక అన్యాయానికి గురవుతున్నారనే భావన కూడా రాకుండా పోలీసు శాఖ కఠిన పర్యవేక్షణ, పారదర్శక విచారణలు, వేగవంతమైన చర్యలు చేపట్టడం అత్యంత అవసరమన్నారు. ప్రజల విశ్వాసమే పోలీసు వ్యవస్థకు అతిపెద్ద బలమని, ఆ విశ్వాసాన్ని కాపాడుకోవడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని డిజిపి తన ఆదేశాలలో పేర్కొన్నారు.

## గణనీయంగా పెరగనున్న ప్రొఫెసర్ల సంఖ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రొఫెసర్ పదోన్నతులకు 2023, 2024 బ్యాచ్ కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లను, రెగ్యులర్ ప్యానెల్‌లో ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్లను పరిగణనలోకి తీసుకున్నందుకు టిటిజిడిఎ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ల సంఖ్య గణనీయంగా పెరిగి, తెలంగాణలో అండర్ గ్రాడ్యుయేట్,పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య మరింత బలోపేతమవుతుందని పేర్కొంది. ఇందుకు వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ,ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా లాజరస్, డీఎంఈ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్‌నరేందర్ కుమార్,డీఎంఈ (అకాడమిక్) డాక్టర్ రామాదేవి, డాక్టర్ వాణి, డాక్టర్ విమల థామస్‌లకు టిటిజిడిఎ కృతజ్ఞతలు తెలిపింది.

## రైల్వే భద్రతలో భారీ మెరుగుదల..

### ఈ ఏడాది 2 ప్రధాన ప్రమాదాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతీయ రైల్వేలో భద్రతా చర్యలు ఫలితాలు ఇస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 202627 ఆర్థిక సంవత్సరంలో (జూన్ వరకు) దేశవ్యాప్తంగా కేవలం 2 ప్రధాన రైలు ప్రమాదాలు మాత్రమే నమోదైనట్లు తెలిపింది. 201415లో నమోదైన 135 ప్రమాదాలతో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదల అని పేర్కొంది. లోక్‌సభలో కేంద్ర రైల్వే మంత్రి ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో, రైల్వే భద్రత కోసం 2026 27లో రూ.1.20 లక్షల కోట్లకు పైగా కేటాయించామని తెలిపారు. అలాగే దేశీయంగా అభివృద్ధి చేసిన కవచ్ 4.0 వ్యవస్థను ఢిల్లీ–ముంబై, ఢిల్లీ–హౌరా మార్గాల్లో 2,569 రూట్ కిలోమీటర్ల మేర అమలు చేసినట్లు వెల్లడించారు.

# అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు

### రైతుల సంక్షేమం, మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
### విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
### ఖమ్మంరూరల్, మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధిని సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం రూ.12.06 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్లు, ఆశ్రమ పాఠశాల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. తొలుత స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి రూ.7.21 కోట్లతో చేపట్టనున్న రెండు బిటి రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. డాక్యాతండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెం, డాక్యాతండా రోడ్డు, పల్లెగూడెంలో మున్సిపాలిటీలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం వరకు బిటిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.4.85కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అదనపు వసతి గృహం, డైనింగ్‌హాల్, ఆధునిక వంటగది, అదనపు తరగతిగదులు, టాయిలెట్ బ్లాక్‌లు, సోలార్ ఫెన్సింగ్, ఓవర్‌హెడ్ ట్యాంక్ తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్టానికి అసలైన పెట్టుబడని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య, సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని విద్యార్థుల ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను సొంత పిల్లలా భావించి నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఐటిడిఏ రూపొందించిన ఉద్దీపకం–3 పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మాధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, పాలేరు నియోజకవర్గ సిపిఐ నాయకులు లింగ వెంకటనారాయణ, సిపిఐ పల్లెగూడెం సర్పంచ్ చుండూరి సృజన, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం ఆర్డీఓ ఎన్ శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, ఖమ్మం రూరల్ తహశీల్దార్ వినయేందర్‌రెడ్డి, స్థానిక ప్రజా ప్రజాప్రతనిధులు, కౌన్సిలర్లు, ఖమ్మంరూరల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్‌నాయక్, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## 'ఎస్‌బిఐ' ఐదు పులుల దత్తత

### జూపార్కుకు రూ.15 లక్షల చెక్కు అందజేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు తన నిబద్ధతను మరోసారి చాటుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) హైదరాబాద్ సర్కిల్ అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కులో ఐదు పులులను ఒక సంవత్సరం పాటు దత్తత తీసుకుంది. ఈ కార్యక్రమం కోసం ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ రూ.15 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది.ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది నెహ్రూ జూలాజికల్ పార్కు క్యూరేటర్ ఐఎఫ్‌ఎస్ అధికారి జె. వసంతకు రూ.15 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నీలేష్ ద్వివేది మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. దేశ జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో, అంతరించిపోతున్న జాతుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంలో ఎస్‌బీఐ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఐదు పులులను దత్తత తీసుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు, ప్రకృతి సంరక్షణకు బ్యాంకు తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తోందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధి, ఆర్థిక సమగ్రత వంటి రంగాల్లో ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతోందని అధికారులు తెలిపారు. నెహ్రూ జూలాజికల్ పార్కుతో భాగస్వామ్యం ద్వారా దేశంలోని అత్యంత విలువైన, అంతరించిపోతున్న వన్యప్రాణి జాతుల సంరక్షణకు చేయూత అందించడంతో పాటు సమాజంలో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.

### ఇరిగేషన్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులపై
## సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం
### మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఇరిగేషన్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్వాగతించారు. ఈ తీర్పుతో ఖమ్మం జిల్లాలోని సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు మార్గం సుగమమైందని తెలిపారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు ద్వారా 36.37 టిఎంసిల నీటిని నిల్వ చేసి, 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు 282.80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ఇరిగేషన్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సాధించేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులకు మంత్రి తుమ్మల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### వేధింపులు తట్టుకోలేకనే
## అనారోగ్యానికి గురైన సుదర్శన్ రెడ్డి
### ప్రవీణ్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వాసవి కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన విజయ్ కుమార్, ఫయీం ఖురేషి వేధింపులను తట్టుకోలేకనే బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అనారోగ్యానికి గురయ్యారని బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు.నక్సలైట్ల నుండి ప్రమాదం ఉండడంతోనే 20 ఏళ్ల నుండి పెద్ది సుదర్శన్ రెడ్డికి సెక్యూరిటీ కల్పించారని, ఆయనకు గత 25 ఏళ్ల నుండి ఆయుధ లైసెన్స్ ఉన్నదని వివరించారు. సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే టార్గెట్ చేసిందన్నారు. పౌరసరఫరాల సంస్థలో రూ. 11వందల కోట్ల స్కామ్ బయటకు తీశారని, దీనిపై డిజిపికి లేఖ రాశారని, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారని, హైకోర్టులో పిల్ కూడా వేశారని వివరించారు. ఆ భయం తోనే . కాంగ్రెస్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డిని మానసికంగా వేధించారన్నారు. కొండా మురళీ ఎమ్మెల్సీ కాదని, కనీసం కార్పొరేషన్ చైర్మన్ కూడా కాదని,కేవలం మంత్రి భర్త. ఆయనకు ఏం ప్రమాదం ఉన్నదని సెక్యూరిటీ కల్పించారని ప్రవీణ్‌కుమార్‌ప్రశ్నించారు. అనుముల తిరుపతి ,కొండల్ రెడ్డి ఏం కూంబింగ్ చేశారని, ఏ ఉగ్రవాద సంస్థలు వారిని అటాక్ చేస్తాయని, దిగుమతి చేయబడ్డ సెమీ ఆటోమేటిక్ ఆయుధాలు ఇచ్చి భద్రత కల్పించారని అన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

### మౌలిక వసతుల కల్పనే ధ్యేయం : ఎమ్మెల్యే కూనంనేని
### సిసి రోడ్లు, కార్మిక సంక్షేమ భవన్ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో బుధవారం రూ.59 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి నిర్మాణ పనులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా ఎస్‌సిబి నగర్ 14వ డివిజన్, పాతకొత్తగూడెం 12వ డివిజన్, బూడిదగడ్డ 10వ డివిజన్, హనుమాన్ బస్తీ 58వ డివిజన్, 49వ డివిజన్‌లో చేపట్టే సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 24వ డివిజన్ బర్మా క్యాంపు ఏరియాలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న కార్మిక సంక్షేమ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీరు పారుదల, సిసి రోడ్ల సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు సంక్షేమ భవనాల నిర్మాణంతో ప్రజల రవాణా సౌకర్యాలు వసతులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పర్యవేక్షణాధికారులు ఎక్కడా రాజీపడొద్దని చెప్పారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, కార్పొరేటర్లు సుధాకర్, పొలమారి ధనలక్ష్మి , బోయిన విజయ్ కుమార్, సుప్రియ, నాయకులు ఎస్‌కే ఫహీమ్, భూక్యా శ్రీనివాస్, యూసుఫ్, గోపికృష్ణ, గుత్తుల శ్రీను, ఖయూమ్, మండల రాజు, రాజేందర్, వాడే రాములు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రైనీ ఐపిఎస్ లైంగిక వేధింపుల కేసులో ప్రతివాదులకు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** లైంగిక వేధింపుల ఆరోపణలతో నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ ట్రైనీ ఐపీఎస్ అధికారి ఎం. ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన క్రిమినల్ పిటిషన్‌పై హైకోర్టు ప్రభుత్వం, ఫిర్యాదుదారైన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారికి నోటీసులు జారీ చేసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్‌లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 26కు వాయిదా వేసింది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన లైంగిక వేధింపుల కేసును రద్దు చేయాలని కోరుతూ ఉదయ్‌కృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ జె. శ్రీనివాసరావు బుధవారం విచారించారు. పిటిషనర్ తరఫు వాదనలు ప్రాథమికంగా విన్న అనంతరం ప్రభుత్వం తరఫున స్పందన కోరుతూ నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం, ప్రైవేటు ప్రతివాదిగా ఉన్న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారికి కూడా వ్యక్తిగత నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్‌లు దాఖలు చేయాలని ఆదేశించిన ధర్మాసనం, తదుపరి విచారణను ఆగస్టు 26కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఉక్రేన్‌లోనే ఇక పేట్రియాటిక్ క్షిపణుల తయారీ

### ట్రంప్ లైసెన్స్ ఇచ్చారని జెలెన్స్కీ ప్రకటన



**వాషింగ్టన్:** ఇకమీదట ఉక్రేన్‌లోనే దేశీయంగా అమెరికా పేట్రియాటిక్ క్షిపణులు తయారు చేసుకోవడానికి డోనాల్డ్ ట్రంప్ అనుమతి ఇచ్చారు. మంగళవారం ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ–ట్రంప్ మధ్య వైట్‌హౌస్‌లో సంభాషణల సందర్భంగా జెలెన్స్కీకి ఈ పూర్తి భరోసా లభించింది. రష్యా యుద్ధం, అమెరికా–ఉక్రేన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై నాయకులు ఇద్దరూ చర్చలు జరిపారు. జులైనెలలో రెండుసార్లు జెలెన్స్కీ అమెరికా వెళ్ళి ట్రంప్‌తో సంభాషణలు చేశారు. ఈ రెండో విడత సమావేశంలో గతంకంటే భిన్నంగా హామీలను రాబట్టారు. రష్యాపై దాడుల ఉద్ధృతి పెంచడం ద్వారా విజయాలు సాధించి ట్రంప్ దగ్గర జెలెన్స్కీ మంచి మార్కులు సంపాదించారు. దీంతో ఆయనకు పేట్రియాటిక్ క్షిపణులను దేశీయంగా తయారు చేసుకునేందుకు లైసెన్సు లభించింది.''ఆయన లైసెన్సులు ఇస్తామని ప్రకటించారు. నేను శక్తిమంతమైన అమెరికా సైనిక కంపెనీల అధిపతులతో సమావేశం జరిపాను,మేం ఇద్దరం కలిసి ఉత్పత్తి చేస్తాం'' అని ఫాక్స్ న్యూస్ ''హానిటీ'' కార్యక్రమంలో జెలెన్స్కీ చెప్పారు. ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జూన్ 15 నుండి 17వ తేదీ వరకూ జరిగిన జి–7 దేశాల శిఖరాగ్ర సమావేశంలో రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం గురించి ప్రధాన చర్చ జరిగింది. ఉక్రేన్‌కు పూర్తి మద్దతు ఇవ్వాలని యూరప్ దేశాలు గట్టి నిర్ణయం తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ కూడా జెలెన్స్కీ చాలా ధైర్యసాహసాలు ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు. ఈ పూర్వరంగంలో పేట్రియాటిక్ క్షిపణుల తయారీకి అనుమతి లభించింది. ఈ విషయంపై జెలెన్స్కీ ''హానిటీ'' కార్యక్రమంలో మాట్లాడుతూ, యుద్ధం ఇప్పుడు రష్యా చేతుల్లో లేదని అన్నారు. భవిష్యత్తు యుద్ధాన్ని దాని గమనాన్ని తమ పాశ్చాత్యదేశాల మిత్రులే నిర్దేశిస్తారని ప్రకటించారు. ఇటీవలికాలంలో తాము చేసిన దాడుల్లో రష్యా చాలా తీవ్రనష్టాలను చవిచూసిందని, ఆర్థికంగా దెబ్బతిందని చెప్పారు. ఇదిలా ఉండగా రష్యాపై ఉక్రేన్ బుధవారం తెల్లవారకముందుగానే 400 డ్రోన్లు,క్షిపణులతో దాడులు చేసింది.

**డబ్బు సంపాదనే జెలెన్స్కీ లక్ష్యం**

యూరప్‌నుండి వీలైనంత డబ్బు సంపాదించడంకోసమే జెలెన్స్కీ ప్రయత్నాలు చేస్తున్నారని రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ రాయబారి రోడియన్ మిరోష్నిక్ విమర్శించారు. ఉక్రేన్‌కు ఇరాన్ వల్ల ప్రమాదం పొంచి ఉందని చెప్పడం కూడా ఈ సంపాదన మార్గాలలో ఒకటని విమర్శించారు. ఆయన ప్రతిచర్యలోనూ డబ్బు సంపాదనే ఉందన్నారు. ఆయన విదేశీ సంబంధాలలో చివరి మాటలన్నీ ''మరింత సాయం చేద్దాం,మరిన్ని ఆయుధాలు ఇద్దాం'' అనే మాటలతోనే ముగుస్తున్నాయని విమర్శించారు. ఇరాన్ నౌకపై కాస్పియన్ సముద్రంలో ఉక్రేన్ దాడిచేసి ఒక నావికుణ్ణి చంపిందని, ఇప్పుడు దాన్ని కూడా డబ్బు సంపాదనకోసం వాడుకుంటున్నారన్నారు.

# భోపాల్‌లో ఉద్రిక్తంగా రైతుల ఆందోళన..

### సిఎం ఇంటి ఎదుట నిరసన..

**భోపాల్ :** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో బుధవారం రైతులు భారీ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని అడ్డుకునేందుకు చూసిన పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. భోపాల్, ఒబ్బుల్లాగంజ్ ప్రాంతంలోని సిఎం మోహన్ యాదవ్ నివాసం వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు. పప్పు ధాన్యాలకు సంబంధించిన పంటనలు 100 శాతం కొనుగోలు చేయాలని, కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. క్రాంతికారి కిసాన్ మజ్దూర్ సంఘటన్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో రైతులు ఆందోళన బాటపట్టారు. సిఎం ఇంటివరకు రైతులు మార్చ్ నిర్వహించారు. తమ డిమాండ్లు నెరవేరేవరకు ఆందోళన కొనసాగుతుందని ఈ సంఘం అధ్యక్షుడు అరుణ్ పటేల్ తెలిపారు. పప్పు ధాన్యాల్ని కనీస మద్దతు ధరతో వంద శాతం కొనుగోలు చేయాలనేది తమ ప్రధాన డిమాండ్ అని తెలిపారు. అలాగే, ఈ టోకెన్ల విధానాన్ని రద్దు చేయాలని, ల్యాండ రికార్డుల ఆధారంగా ఫెర్టిలైజర్లను సబ్సిడిపై అందజేయాలని కోరారు. సిఎం ఇంటి ఎదుట ఆందోళన చేసేందుకు వందల మంది రైతులు అక్కడికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో భారీ ఎత్తున పోలీసులను, భద్రతా బలగాలను మోహరించారు. జైజవాన్.. జై కిసాన్ అంటూ రైతులు నినాదాలు చేశారు. ఐదు రోజులకు సరిపడా ఆహార పదార్థాల్ని తీసుకుని రైతులు ట్రాక్టర్ ట్రాలీలతో ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయగా.. రైతులు వాటిని తొలగించి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులకు, రైతులకు మధ్య ఘర్షణ జరిగింది. అయితే, ఈ అంశంపై సిఎం మోహన్ యాదవ్ స్పందించారు. రైతుల డిమాండ్లు పరిష్కరించేందుకు, వారితో చర్చించేందుకు మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతు సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని సీఎం చెప్పారు. మంత్రులు కన్నానా, క్రిష్ణ గౌర్, విశ్వాస్ సారంగ్, రాకేష్ సింగ్‌తోపాటు అధికారులు చర్చలు జరుపుతున్నారు. ఇప్పటికే రైతులతో మొదటి దశ చర్చలు పూర్తయ్యాయి. అయితే, సమస్య పరిష్కారంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.



## ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజల ప్రయాణ సౌకర్యం, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం మా లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టరేట్ వైపు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, కాలనీల ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 60 ఫీట్ల రోడ్డులోని నాలా బ్రిడ్జి కింద భాగం నుంచి ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేసే అవకాశాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, రోడ్డు ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక అంశాలు, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు నాగుల వాసు, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, షేక్ జహీర్, గున గంటి హేమ సతీష్, శ్రీ దండుమైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రజా ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఎమ్మెల్యే సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను, కోడూరు గ్రామంలో రూ.12ల క్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు స్కూల్ యూనిఫాంలను పంపిణీ చేశారు. మార్గమధ్యలో కుంచమర్తి గ్రామంలో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు. వారి శ్రమను అభినందిస్తూ రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుడిపెల్లి మధుకర్ రెడ్డి, సర్పంచులు పాశం కరుణ భాస్కర్ రెడ్డి, వల్లపు అవిలమ్మ సోమయ్య, చిల్లంచర్ల విద్యాసాగర్, లూనావత్ కృష్ణా నాయక్, ఉపసర్పంచ్ కోటమర్తి మేనకా వెంకన్న పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీలు సహకరించాలి

అదనపు కలెక్టర్ బి. హరిసింగ్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పులేకుండా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ అధికారులను కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ వేగంగా సాగుతోందని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూలై 24తో ముగియాల్సిన బిఎల్ఓల ఇంటింటి సర్వే గడువును, క్షేత్రస్థాయిలో మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఆగష్టు 3 వరకు పొడిగించినట్లు ప్రకటించారు. జిల్లాలోని ఓటర్లు తమ ఓటు హక్కును సరిచూసుకోవాలని, బిఎల్ఓలు ప్రతి రాజకీయ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకుని, ఓటర్ల జాబితా ప్రక్షాళనలో అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, వివిధ పార్టీల నాయకులు సిహెచ్ రాజేశ్వరరావు, చల్లమల్ల నరసింహ, ఎండి హబీద్, స్టాలిన్, సత్యనారాయణ, కరుణాకర్ రెడ్డి, కోట గోపి, బి. రమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు అందరూ కృషి

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలతో పాటు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రాథమిక పాఠశాల ఎన్ఎస్పి క్యాంప్‌లో రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ కస్తూరి ప్రభాకర్ తల్లి కస్తూరి రాములమ్మ స్మృత్యర్థం ఏర్పాటు చేసిన స్మృతి భోజన కార్యక్రమాన్ని విద్యార్థులకు వడ్డించి ప్రారంభించారు. మిర్యాలగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు బాక్సుల్లో చిన్న చిన్న ప్లేట్లలో అన్నం తింటున్నారని, వారిని దృష్టిలో పెట్టుకుని అందరికీ ప్లేట్లు అందే విధంగా 150 ప్లేట్లను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్, ప్రముఖ వైద్యులు జాడి రాజు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కందుకూరి సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాష్య, ఉపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ధ్వంసం కేసులో ఐదుగురు బైండోవర్

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల పరిధిలోని చింతిర్యాల గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహం, సిమెంట్ బెంచీల ధ్వంసం చేసిన కేసులో ఐదుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు. ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చింతిర్యాల గ్రామంలో ఎన్‌టిఆర్ విగ్రహం చేతి బొటనవేలు, మాజీ సర్పంచ్ మొర్రిమేకల తిరుపతమ్మ, ఆంజనేయులు ఏర్పాటు చేసిన నాలుగు సిమెంట్ బెంచీలను ధ్వంసం చేశారని మొర్రిమేఖల ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు పరిశీలనలో ఐదుగురు వ్యక్తులను గుర్తించి భవిష్యత్తులో శాంతిభద్రతలకు భంగం కలగకుండా, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చింతలపాలెం తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

# బాధితులకు ప్రభుత్వ సాయం

శివన్నగూడెం రిజర్వాయర్ ముంపు బాధితులకు అన్ని విధాలా సహాయం

భూముల చెల్లింపులు, ప్లాట్ల కేటాయింపుపై కలెక్టర్ హామీ



**ప్రజాపక్షం/మర్రిగూడ :** శివన్నగూడెం రిజర్వాయర్ లో ముంపుకు గురైన నర్సిరెడ్డిగూడెం బాధితులకు ప్రభుత్వం తరపున సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని శివన్నగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురై రిజర్వాయర్ సమీపంలో ముంపు బాధితులు స్వంతంగా నిర్మించుకున్న గృహాలను పరిశీలించారు.రిజర్వాయర్ ముంపుకు గురైన కుటుంబాలకు ప్రభుత్వం చింతపల్లి వద్ద ఇళ్ల స్థలాలు కేటాయించిన విషయం తెలిసిందే.అయితే 54 మంది ముంపు బాధితులు మాత్రం శివన్నగూడెం వద్ద ఒక ప్రైవేట్ వెంచర్‌లో వారి సొంత నిధులతో ఇండ్లు నిర్మించుకున్నారు. రిజర్వాయర్ ముంపుకు 287 కుటుంబాలు గురికాగా, అందులో 54 మంది స్వంత గృహాలు నిర్మించుకున్నారని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. చింతపల్లి వద్ద ఇంకా 32 మందికి ప్రభుత్వ ప్లాట్లు రావాల్సి ఉందన్నారు. అయితే చింతపల్లి వద్ద కేటాయించిన ప్లాట్లకు నంబర్ల కేటాయింపు, స్థలాలను భౌతికంగా అప్పగించడంలో ఆలస్యం వల్ల ప్రైవేట్ వెంచర్‌లో గృహాలు నిర్మించుకున్నామని బాధితులు తెలిపారు. అందువల్ల తమకు ఇందిరమ్మ గృహాలకు ఇచ్చే రూ.5 లక్షల మొత్తాన్ని ఇవ్వాలని, అలాగే ఆర్ అండ్ ఆర్ సమస్యలు తీర్చాలని,ప్లాట్లకు సంబంధించి కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూమి వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. ఇటీవల వచ్చిన కోర్టు ఉత్తర్వుల ప్రకారం వివాదానికి సంబంధించిన భూమి విషయంలో 10,15 రోజుల్లో అవార్డు పూర్తి చేసి తక్కిన వారికి ప్లాట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామస్తుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో దేవరకొండ ఆర్‌డిఓ శ్రీదేవి,శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,గ్రామ సర్పంచ్ యాదగిరి కలెక్టర్ వెంట ఉన్నారు.

# ప్రతీ విద్యార్థి రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రతీ విద్యార్థి చదువులో రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత జరిగినట్లని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను విద్యారంగంలో మరింత అగ్రపథాన నిలిపేందుకు ఉపాధ్యాయులు నడుం బిగించాలన్నారు. 2025/26 విద్యా సంవత్సరానికి గాను పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో సూర్యాపేట జిల్లా ప్రచేష్టలో మొదటి స్థానాన్ని సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను గుర్తించి తరగతి గది బోధన సాగాలని స్పష్టం చేశారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా కృత్యాధార బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను ఉపాధ్యాయులు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. చదువుతోపాటు విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా పర్యవేక్షించడానికి ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఒక తోటలోని కొన్ని మొక్కలు మాత్రమే పూలిస్తే ఆ తోటకు అందం రాదన్నారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాలు సాధించేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, సూర్యాపేట జిల్లాను విద్యారంగంలో మరింత మెరుగైన స్థానంలో నింపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ అశోక్, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, రేణుక, సెంటర్ ఇంచార్జి నాగరాణి, జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రీహరి శ్రవణ్, సత్యనారాయణ రెడ్డి, యోగానంద్ పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న కేంద్రం




ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. 106 సంవత్సరాల చరిత్ర కలిగి భారతదేశంలోని ఏకైక పెద్ద కార్మిక సంఘంగా అవతరించిన ఏఐటియుసి జిల్లా 3వ మహాసభలను జిల్లా కేంద్రంలో ఆగష్టు 1వ తేదిన నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందించడం జరుగుతుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీతో సహా ఇతర రాష్ట్రాలలో పోలీసులు చేసిన దాడిని ఆయన ఖండించారు. స్వతంత్ర భారతదేశంలో నిరసన తెలిపే హక్కు, మాట్లాడే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. ఉద్యమాలను నిర్బంధించాలని ప్రయత్నిస్తే ఢిల్లీలో జరిగిన సంఘటన గుర్తు చేసుకోవాల్సిన పరిస్థితి పాలకవర్గానికి ఉందన్నారు. రాబోయే రోజుల్లో బిజెపి మొత్తం తూడ్చుకుపోవడం ఖాయమని అది ఎంతో దూరంలో లేదని జోస్యం చెప్పారు. జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా గౌరవ సలహాదారులు శ్యామల అశోక్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు షేక్ లతీఫ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం, సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి, కోశాధికారి సారెడ్డి రాఘవరెడ్డి, సాయి బాబా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర కీలకం




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** సెప్టెంబర్ 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర 3వ మహా సభలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ యాదగిరిగుట్టలో జరిగే రాష్ట్ర 3వ మహా సభల పోస్టర్‌ను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనది యువతరంలో ప్రగతిశీల అభ్యుదయ భావాలను దేశభక్తి లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను నైతిక విలువలను మానవత్వాన్ని పాదుకోల్పడానికి అఖిలభారత యువజన సమైక్య నిరంతరం కృషి చేస్తుందన్నారు. యువత అనుకుంటే ఏదైనా సాధించవచ్చు అని ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర విద్యార్థి యువకుల పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు జులై 20న డిల్లిలో విద్యార్థులు, యువకులపై జరిగిన దాడి పైన సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా, వైద్యం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 8వ తేదీన యాదగిరిగుట్టలో అఖిలభారత యువజన సమైక్య రాష్ట్ర 3వ మహా సభ సందర్భంగా జరిగే యువజన ప్రదర్శన, బహిరంగ సభకు యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బొలగని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోదా శ్రీరాములు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పేరబోయిన మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరీ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.నహీం, సీఈఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి.ఇమ్రాన్, కళ్లెం కృష్ణ, ఏశాల అశోక్, గాలయ్య, శేఖర్ రెడ్డి, హరిచంద్ర, జంగమ్మ, చెక్క వెంకటేష్, చిగుళ్ళ లింగం పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్‌లో ముగ్గురు బాల కార్మికులకు విముక్తి

బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పోలీసులు,కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ,అశ్రిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బుధవారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో ముగ్గురు బాల కార్మికులను గుర్తించి రెస్క్యూ చేయడంతో పాటు,వారిని పనిలో పెట్టుకున్న యజమానులు,మేస్త్రీపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.నల్లగొండ పట్టణంలోని ఓ స్క్రాప్ షాపులో కట్టంగూర్‌కు చెందిన అన్నేపూరి సాయి చరణ్ (15) రోజుకు రూ.300 కూలీకి పనిచేస్తున్నట్లు గుర్తించి బాలుడిని రెస్క్యూ చేశారు.ఈ ఘటనకు సంబంధించి షాప్ సూపర్‌వైజర్ యాట భాను ప్రకాష్,యజమాని అంతం కార్తీక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు.అలాగే అమ్మనబోలు క్రాస్‌రోడ్స్ వద్ద నిర్మాణంలో ఉన్న భవనంలో బీహార్ రాష్ట్రానికి చెందిన నితీష్ కుమార్ (17),నవజీత్ కుమార్ (15) రోజుకు రూ.350 చొప్పున కూలీకి పనిచేస్తున్నట్లు గుర్తించారు.వారిని కూడా రెస్క్యూ చేసి,బాలలను పనిలో పెట్టుకున్న మేస్త్రీ షకల్దేవ్ (35)పై కేసు నమోదు చేశారు.బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 100కు లేదా సమీప పోలీస్‌స్టేషన్, కార్మిక శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.



## విద్యాభివృద్ధికి మరో ముందడుగు

పబ్లిక్ స్కూల్ స్థలాన్ని పరిశీలించిన వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్:** నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ సమీపంలో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రతిపాదిత స్థలాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం పరిశీలించారు.పాఠశాల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.నకిరేకల్ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన,ఆధునిక విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తోందని ఆయన తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించే దిశగా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఆ తెలిపారు.ఈకార్యక్రమంలో నకిరేకల్ తహశీల్దార్ యశ్వంత్ రాజ్, పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ పట్టణ,మండల అధ్యక్షులు లింగాల వెంకన్న, గాదగోని కొండయ్య,నాయకులు గాజుల సుకన్య, యాసారపువెంకన్న,వీరా అర్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బలమైన పునాది ప్రీ ప్రైమరీ విద్యే

జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి



**ప్రజాపక్షం/మోటకొండూర్ :**చిన్నారుల భవిష్యత్తుకు పునాది ప్రీ ప్రైమరీ విద్యేనని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. ఆయన మంగళవారం మోటకొండూరు మండలంలోని కాటేపల్లి ప్రాథమిక పాఠశాలలో గురు పూర్ణిమ సందర్భంగా ప్రీ ప్రైమరీ సెక్షన్ ను ప్రారంభించి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. విద్య,ఆటలు, పాటలు, కథలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా పిల్లలలో నేర్చుకునే ఆసక్తి, ఆత్మవిశ్వాసం, సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ విద్యను ప్రవేశపెట్టిందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి అభివృద్ధిలో భాగస్వా మ్యులు కావాలని కోరారు. ఉపాధ్యాయులు ప్రేమతో ఓర్పుతో చిన్నారులను తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోమండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురామ్ రెడ్డి, సర్పంచ్ పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం బాల గంగాధర్ రెడ్డి, కాటెపల్లి హెచ్ ఎం.మంజుల, ఉపాధ్యాయులు శంకర్, ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ సిఆర్‌పిలు నరేందర్, సత్తిరెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సైబర్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు త్వరగా నగదు రిఫండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సైబర్ వారియర్ సిబ్బంది, పోలీసు అధికారులను జిల్లా ఎస్పి కె. నరసింహ ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ మోసాల కేసుల దర్యాప్తు వేగవంతం చేయడం, బాధితులకు త్వరగా నగదు రిఫండ్ చేయడం, ప్రజలను చైతన్యపరచడం వంటి ప్రధాన అంశాలపై జిల్లాలోని పోలీసు అధికారులు, సైబర్ వారియర్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన, అప్రమత్తత పెరిగినప్పుడే మోసాల నుండి రక్షణ పొందుతారన్నారు. సైబర్ మోసాలపై వచ్చే ఫిర్యాదులను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని తెలిపారు.

## ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో డిప్యూటి తహశీల్దార్ కంఠమయ్యకు వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఐదు మండలాలకు తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతనకల్ ప్రాంతాలకు సౌకర్యార్థంగా ఉంటుందని కోరారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్, జిల్లా కలెక్టర్ స్పందించి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అఖిలపక్ష నాయకులు తడకమళ్ల రవికుమార్, ఉప్పుల రాంబాబు, కొండ రాజు, సంతోష్, మల్లేష్, బొజ్జ సాయికిరణ్ పాల్గొన్నారు.

# విద్యుత్ వైర్ల చోరీ ముఠా గుట్టురట్టు

ఏడుగురి నిందితుల అరెస్టు

డిఎస్‌పి శ్రీనివాసరావు వెల్లడి

**ప్రజాపక్షం/చింతపల్లి :** తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో ఖాళీగా ఉన్న వెంచర్లలో విద్యుత్ స్తంబాలకు ఉన్న విద్యుత్ వైర్లను చోరీ చేస్తున్న ముఠాను పట్టుకున్నట్టు దేవరకొండ డిఎస్‌పి శ్రీనివాస్‌రావ్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి శ్రీనివాస్‌రావ్ వెల్లడించిన వివరాల ప్రకారం చింతపల్లి, మర్రిగూడ మండలాల్లోని వెంచర్లలో ముందుగా రెక్కి నిర్వహించి పథకం ప్రకారం చోరీ చేసిన అల్యూమినియం వైర్లను ఆటోలలో, కార్లలో తరలించి సరంపేట గ్రామానికి చెందిన మోటం నాగరాజుకు అమ్మేవారని డిఎస్‌పి తెలిపారు. అదేవిధంగా ఈ నెల 25న మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామ పరిధిలోని సాగర్ మేడ్ హౌస్ వెంచర్లో విద్యుత్ వైర్ చోరీకి గురయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందడంతో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కారు, బొలేరో వాహనంలో అనుమానస్పదంగా ప్రయాణిస్తున్న నిందితులను ఆపి తనిఖీ చేయగా వారి వద్ద నుండి 13 క్వింటాళ్ళ వైరు, రూ. 1,80,000 నగదును, స్విఫ్ట్ కారు, అశోక్ లీలాండ్ ట్రాలీ, మహేంద్ర ట్రాలీని స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితులు లపంగి లిఖిత్ కుమార్ తండ్రి రాజయ్య, లపంగి యశ్వంత్ తండ్రి యాదయ్య, లపంగి శివ తండ్రి యాదగిరి, లపంగి శివసాయి తండ్రి మహేందర్, నక్క కిషోర్ తండ్రి యాదయ్య, మోటం నాగరాజు తండ్రి ఆంజనేయులు, కళ్ళెం లింగయ్య తండ్రి సంజీవలు మర్రిగూడ మండలానికి చెందిన వ్యక్తులు కాగా కంబాలపల్లి మహేష్ తండ్రి రాములు చింతపల్లి మండలానికి చెందిన ఘడియ గౌరారం గ్రామ నివాసి. వీరిపై మర్రిగూడ, చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినట్టు డిఎస్‌పి తెలిపారు. కేసును నల్లగొండ జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో నాంపల్లి సిఐ రాజు, స్థానిక ఎస్ఐ రామ్మూర్తి, మర్రిగూడ ఎస్ఐ రాంబాబు, కానిస్టేబుల్ అనిల్ హోంగార్డులు కోటయ్య, మహేందర్‌లు చాకచక్యంగా చేదించినందుకు ఎస్‌పి వారిని అభినందించారు.



‘ రవితేజ ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘ఇరుముడి’పై భారీ అంచనాలు ఉన్నాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం ‘ఫస్ట్ గ్లింప్స్’, చార్ట్‌బస్టర్ అయ్యప్ప భక్తి పాట ‘ఇరుముడి కట్టు’తో ప్రేక్షకులను అలరిస్తోంది. ’

## రీల్

## వెంకటేష్ కూతురు సంపూర్ణగా ‘యువినా పార్థవి’



విక్టరీ వెంకటేష్ ‘చిట్టిబాబు’గా, శ్రీనిధి శెట్టి ‘స్వర్ణ’గా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందిన తర్వాత, ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 ’ చిత్ర బృందం కుటుంబంలోని మరో సభ్యురాలిని పరిచయం చేసింది.ఈ చిత్రంలో చిట్టిబాబు, స్వర్ణ దంపతుల ముద్దుల కుమార్తె ‘సంపూర్ణ’ పాత్రలో బాలనటి యువినా పార్థవి నటిస్తోంది. అమాయకత్వం, చిలిపితనం, అల్లరితో నిండిన సంపూర్ణ పాత్ర చిట్టిబాబు జీవితంలో నవ్వులు పూయించడంతో పాటు, అనూహ్యమైన చిన్న చిన్న సంఘటనలకు కూడా కారణమవుతుంది. ఈ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునేలా ఉండనుందని చిత్ర బృందం తెలిపింది. పాత్రల పరిచయాలతో సినిమాపై రోజు రోజుకూ ఆసక్తిని పెంచుతున్న మేకర్స్, తదుపరి ‘సర్వ’ పాత్రలో నటిస్తున్న రాజా ప్రజ్వల్‌ను పరిచయం చేయనున్నారు.రచన,దర్శకత్వం త్రివిక్రమ్ శ్రీనివాస్ వహిస్తున్న ఈ చిత్రాన్ని హారిక & హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రవి. కె. చంద్రన్ సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లలో విడుదల కానుంది.

## ఆగస్టు 21న థియేటర్లలో ‘ఇరుముడి’



రవితేజ ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘ఇరుముడి’పై భారీ అంచనాలు ఉన్నాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం ‘ఫస్ట్ గ్లింప్స్’, చార్ట్‌బస్టర్ అయ్యప్ప భక్తి పాట ‘ఇరుముడి కట్టు’తో ప్రేక్షకులను అలరిస్తోంది. విడుదల తేదీకి సంబంధించి నెలకొన్న ఊహాగానాలకు తెరదించుతూ, అనుకున్న సమయానికే అంటే ఆగస్టు 21న ‘ఇరుముడి’ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని చిత్ర బృందం అధికారికంగా అనౌన్స్ చేసింది. విడుదల షెడ్యూల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేస్తూ, ‘25 days To Go’ పోస్టర్‌ను విడుదల చేశారు. కొత్తగా విడుదలైన ఈ పోస్టర్ సినిమాలోని ఎమోషన్ ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఇందులో రవితేజ, చిన్నారి నక్షత్ర మధ్య తండ్రీకూతుళ్ల అనుబంధం ఎంతో ఆప్యాయంగా కనిపిస్తోంది. రవితేజ పేకాటలో నిమగ్నమై ఉండగా, ఆ చిన్నారి వెనుక నుండి ఆప్యాయంగా అతన్ని కౌగిలించుకోవడం, ఈ కథలోని ఎమోషన్ ని ప్రజెంట్ చేస్తోంది. ప్రియా భవాని శంకర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక నిపుణుల బృందం పనిచేస్తోంది. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీని, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్‌ను, ప్రవీణ్ పూడి ఎడిటింగ్‌ను పర్యవేక్షిస్తుండగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలాలుగా నిలుస్తోంది. మాస్ మహారాజా రవితేజ, ప్రియా భవానీ శంకర్, సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, మీసాల లక్ష్మణ్, రాజ్ కుమార్ కసిరెడ్డి, రమణ భార్గవ్, కిషోర్ కంచెరపాలెం, కార్తీక్ అడుసుమల్లి, మహేష్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డిఒపి : విష్ణు శర్మ, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి.



## ‘షీ ఈజ్ మై..’ అంటూ పాడుకుంటున్న జివి

మల్టీ టాలెంటెడ్ జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్ జంటగా నటిస్తున్న డార్క్ ఫాంటసీ సూపర్ నేచురల్ థ్రిల్లర్ ‘ఇమ్మోర్టల్’ మరియప్పన్ చిన్న దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అరుణ్ కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ‘ఇమ్మోర్టల్’ నుంచి రొమాంటిక్ మెలోడీ ‘ షీ ఈజ్ మై’ లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు.ఈ పాటకు సామ్ సీఎస్ అందించిన సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అరవింద్ శ్రీనివాస తన వోకల్స్ పాటకు ప్రాణం పోయగా, రాజశ్రీ సుధాకర్ రాసిన సాహిత్యం ప్రేమలోని భావోద్వేగాలను అందంగా పలికించింది.ఈ పాటలో జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్ల మధ్య కెమిస్ట్రీ చాలా ఆసక్తికరంగా వుంది. మనసును హత్తుకునే ట్యూన్, లిరిక్స్‌తో ‘ షీ ఈజ్ మై’ సంగీత ప్రియులను ఆకట్టుకునే మెలోడీగా నిలిచింది. జివి ప్రకాష్ కుమార్, కయదు లోహర్, టిఎం కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్, ఆదిత్య కతిర్, అర్చు మహర్జన్, పెమ త్సంచో, సునీతా శ్రేష్ఠ నటిస్తున్నారు. ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: అరుణ్ రాధాకృష్ణన్, ఎడిటర్: రాజేష్ ఎం,ఆర్ట్ డైరెక్టర్: శివశంకర్, స్టంట్స్ : ఆర్.శక్తి శరవణన్, జి.ఎన్.మురుగన్, కొరియోగ్రఫీ : ఎం. షరీఫ్, శబరీష్.



## ఫ్యామిలీ మోటివేషనల్ చిత్రంగా ‘మకుటం’

సూపర్ గుడ్ ఫిలిమ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్టులో విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం ‘మకుటం’. దివంగత ఆర్ బి చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్ ‘ది రైజ్ అఫ్ లింగా’, ఫోక్ సాంగ్ ‘నచ్చాకే వచ్చేరా’ అనే పాటలు అన్నీ కూడా అందరిలోనూ అంచనాలు పెంచేశాయి. ఇక తాజాగా మరో పాటను చిత్ర యూనిట్ రిలీజ్ చేశారు. ‘కలతేలా’ అం టూ సాగే సాంగ్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇదొక ఫ్యామిలీ, మోటివేషనల్ సాంగ్‌లా కనిపిస్తోంది. ఇందులో విశాల్, దుషారలతో పాటుగా పిల్లలు కూడా కనిపిస్తున్నారు. ఈ పాటను రాజశ్రీ సుధాకర్ రచించగా. కృష్ణ తేజస్వీ ఆలపించారు. ఇక జివి ప్రకాష్ అందించిన బాణీ ఎంతో క్యాచీగా ఉంది. ఇక ఈ పాట యూట్యూబ్లో ఇట్టే ట్రెండ్ అయ్యేలా కనిపిస్తోంది. ఈ సినిమాకి రిచర్డ్ ఎం. నాథన్, అభినందన్ రామానుజం కెమెరామెన్లుగా, శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్ను ప్రకటించనున్నారు. విశాల్, అంజలి, దుషార విజయన్, జాన్ విజయ్, జయ ప్రకాష్, అజయ్, వంశీ కృష్ణ, అబూ సలీం, అర్జయ్, ఝాన్సీ, పదం కుమార్, సభమోన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: రిచర్డ్ ఎం. నాథన్ , అభినందన్ రామానుజం, సంగీతం: జి.వి. ప్రకాష్ కుమార్, ఆర్ట్ డైరెక్టర్: జి. దురైరాజ్, యాక్షన్ డైరెక్టర్: దిలీప్ సుబ్బరాయన్, ఎడిటర్: శ్రీకాంత్.

నాకు పర్సనల్ గా లవ్ స్టోరీస్ అంటే చాలా ఇష్టం. కోవిడ్ తర్వాత లవ్ స్టోరీస్ తగ్గిపోతుంటే బాధపడ్డాను. లవ్ స్టోరీస్ చూసేందుకు ప్రేక్షకులు థియేటర్స్ కు వెళ్తారా వెళ్లరా అని భయపడ్డాను. మెల్లిగా ఆ ట్రెండ్ మళ్లీ మొదలైంది. మనం ఎన్నో విభిన్నమైన ప్రేమ కథలు చూశాం. పెళ్లయ్యాక, లవ్ బ్రేకప్ అయ్యాక వాళ్ల కథలు ఎలా ఉంటాయి అనే సంక్లిష్టమైన బ్యాక్ డ్రాప్ లు కూడా వస్తున్నాయి. ఈ తరం ప్రేక్షకులు అలాంటి ప్రేమ కథలకే ఎక్కువ కనెక్ట్ అవుతున్నారు. ఒక జంట తమ జీవితంలోని ఎత్తుపల్లాలు, జయాపజయా లు గురించి డిస్కస్ చేసుకునే మూవ్ మెంట్స్ ను ఏ ప్రేమ కథల్లోనూ క్యాప్చర్ చేయడం లేదు. ఆ తరహా స్టోరీస్ రావాలని, ఆ టాపిక్స్ దర్శకులు ఎంచుకోవాలని ఎదురుచూస్తున్నాను. అలాంటి ప్రేమకథలు వస్తే నేను ఖచ్చితంగా సపోర్ట్ చేస్తాను అని నాగచైతన్య అన్నారు. ‘చెన్నై లవ్ స్టోరీ’ సక్సెస్ మీట్ లో నాగ చైతన్య మాట్లాడారు.

## నాకు లవ్ స్టోరీస్ అంటే చాలా ఇష్టం


హీరో నాగచైతన్య

## సిరీస్ చూసి చిరంజీవి మెచ్చుకున్నారు



మోస్ట్ పాపులర్ ఒటిటి ప్లాట్‌ఫామ్ జీ5 నుంచి మరో ఒరిజినల్‌ప్లే వెబ్ సిరీస్ ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే ‘అబ్జెక్షన్ మై లార్డ్’. శ్రీకాంత్, అనన్య శర్మ, ముఖేష్ రుషి, స్నేహాల్, సమీర్ ప్రధాన పాత్రధారులుగా నటించారు. ‘నోటరీ పరశురాం’ ట్యాగ్ లైన్. సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వంలో డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజు కుమార్ ఆకెళ్ల ఈ సిరీస్ను రూపొందించారు. 7 ఎపిసోడ్స్‌తో ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ ఒరిజినల్ 31 నుంచి జి 5లో స్ట్రీమింగ్ కానుంది. తాజాగా ఈ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్ నిర్వహించారు ఈ సందర్భంగా నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ జి 5లో నాది ఇది మూడో వెబ్ సిరీస్. ఈ మూడింటిలో డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయడమే చేశారు. జీతో నాకు మంచి అనుబంధం ఉంది. 3 సిరీస్ లు చేయడంతో పాటు డ్రామా జూనియర్స్ కూడా చేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది. సినిమాలో కంటే సిరీస్ లోనే కష్టం ఎక్కువగా ఉంది కానీ చాలా ఎంజాయ్ చేస్తూ చేశాము. ఇందులో నాకు మంచి క్యారెక్టర్ దొరికింది. దర్శకుడు ఎంతో మెలకువతో చాలా క్లారిటీతో ఈ సిరీస్ రూపొందించారు. షూటింగ్ సమయంలో నిర్మాత రాజు కుమార్ చాలా సపోర్ట్ చేశారు. ఈ సిరీస్ అవుట్ పుట్ చూశాక ఫిదా అయ్యాము. మంచి అవుట్ పుట్ వచ్చింది. నటీనటులంతా ఎంతో ఎనర్జీతో షూటింగ్ లో పాల్గొన్నారు. ముఖేష్ యాక్టర్ మాత్రమే కాదు ప్యూర్ హార్ట్ మనిషి. ప్రతి క్యారెక్టర్ లో మంచి ఎలివేషన్ ఉంటుంది. అందరూ బాగా చేశారు. చిరంజీవి కూడా చూసి చాలా బాగుందని శ్రీకాంత్ చెప్పారు. నటుడు ముఖేష్ రుషి తదితరులు ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు.



## దేవాదాయ శాఖలో పదోన్నతుల పండుగ

**51 మందికి ఇఒలుగా పదోన్నతులు..**
**15 మంది అర్చకులకు సంక్షేమ ఉత్తర్వులు**
**మంత్రి కొండా సురేఖ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని దేవాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ అన్నారు. తెలంగాణ దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ నెలకొంది. దశాబ్దాలుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త అందిస్తూ మొత్తం 51 మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారుల (ఇఒలు)గా పదోన్నతులు కల్పించింది. అలాగే 15 మంది అర్హులైన అర్చకులు, వారి కుటుంబ సభ్యులకు పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణాలకు సంబంధించిన ఉత్తర్వులను అందజేసింది. బొగ్గులకుంటలోని బుధవారం తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొండా సురేఖ పదోన్నతి ఉత్తర్వులను ఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదాయ శాఖలో సంస్కరణలకు పెద్దపీట వేస్తూ ఇప్పటికే మొత్తం 168 మంది ఉద్యోగులకు గ్రేడ్1,గ్రేడ్2, గ్రేడ్3 ఈవోలుగా పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. ఇటీవలే 191 మంది అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులకు నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఉద్యోగుల సంక్షేమం, ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు, అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచినట్లు మంత్రి వెల్లడించారు. సరస్వతి నది పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, 2027 గోదావరి, 2028 కృష్ణా పుష్కరాల నిర్వహణకు ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరెక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్జెసి రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ వినోద్ రెడ్డి, అదనపు కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఇఒల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, అర్చక ఉద్యోగ జెఎసి కన్వీనర్ డి.వి.ఆర్. శర్మతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు బకాయి వ్యక్తిగత వ్యవహారమే..

## ఉద్యోగిపై క్రమశిక్షణ చర్యలు చెల్లవు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బ్యాంకు ఉద్యోగి తీసుకున్న క్రెడిట్ కార్డు బ్యాంకుతో కుదిరిన వ్యక్తిగత వాణిజ్య ఒప్పందమే తప్ప యజమాని-ఉద్యోగి సంబంధానికి చెందినది కాదని హైకోర్టు స్పష్టం చేసింది. క్రెడిట్ కార్డు బకాయిలు సకాలంలో చెల్లించలేదనే కారణంతో ఉద్యోగిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం, నిర్బంధ పదవీ విరమణ శిక్ష విధించడం చట్టబద్ధం కాదని పేర్కొంది. ఈ మేరకు నిర్బంధ పదవీ విరమణ ఉత్తర్వులను రద్దు చేస్తూ ఉద్యోగికి రావాల్సిన అన్ని పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించాలని ఆదేశించింది.

యూనియన్ బ్యాంక్ (అప్పటి ఆంధ్రా బ్యాంకు) ఉద్యోగి ఎం. ప్రకాశ్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి ఈ తీర్పు వెలువరించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదిస్తూ, అనారోగ్యం, వైద్య ఖర్చులు, కుమార్తె వివాహం వంటి ఆర్థిక ఇబ్బందుల కారణంగా క్రెడిట్ కార్డు బకాయిలు పెరిగినా అనంతరం వాటిని పూర్తిగా చెల్లించినట్లు తెలిపారు. వ్యక్తిగత క్రెడిట్ కార్డు వ్యవహారాన్ని ఉద్యోగ విధులతో ముడిపెట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవడం చట్టవిరుద్ధమని వాదించారు.

బ్యాంకు తరఫు న్యాయవాది లక్ష్మీ నరసింహా వాదిస్తూ, బకాయిల చెల్లింపుపై పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో 2008లో అభియోగపత్రం జారీ చేసి శాఖాపరమైన విచారణ అనంతరం నిర్బంధ పదవీ విరమణ శిక్ష విధించినట్లు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి, క్రెడిట్ కార్డు బకాయిల చెల్లింపు పూర్తిగా వ్యక్తిగత అంశమని, అది ఉద్యోగ విధులకు సంబంధించినది కాదని స్పష్టం చేశారు. అలాంటి కారణంతో క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం చట్టబద్ధం కాదని, 30 ఏళ్ల సేవలందించిన ఉద్యోగికి నిర్బంధ పదవీ విరమణ వంటి కఠిన శిక్ష విధించడం కూడా సమంజసం కాదని పేర్కొన్నారు. దీంతో 2008లో జారీ చేసిన ఛార్జిషీట్, విచారణ కమిటీ నివేదిక, నిర్బంధ పదవీ విరమణ ఉత్తర్వులను రద్దు చేస్తూ తీర్పు చెప్పారు.

## మంత్రి ఉత్తమ్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం కట్టారు.. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో 2..3 టిఎంసిలు నిల్వ చేయమంటే 10 టిఎంసిలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డిఎస్‌ఎ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు.

## భారీగా ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)




(సివిల్) పోస్టులతో పాటు రిజర్వ్ ఎస్‌ఐలు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఫింగర్ ప్రింట్ బ్యూరో), డ్రైవర్, మెకానిక్ తదితర పోస్టులను భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో 1,424, ఫైర్ శాఖలో 790, జైళ్ల శాఖలో 223 పోస్టులు ఉన్నాయి. దరఖాస్తు చేసుకునే ముందు శారీరక, వైద్య ప్రమాణాలు నిర్ధారించుకోవాలని, అలాగే ఎస్‌సి, ఈడబ్ల్యూఎస్, బిసి నాన్‌క్రీమీ లేయర్, స్థానిక అభ్యర్థిత్వం తదితర ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని టిఎస్‌ఎల్‌పిఆర్‌బి అభ్యర్థులకు సూచించింది.

**పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి..**

మొత్తం పోస్టులు : 7,437
పోలీసు శాఖ – 5,000కు పైగా పోస్టులు
ఎస్‌పిఎఫ్ – 1,424 పోస్టులు
ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ – 790 పోస్టులు
జైళ్ల శాఖ – 223 పోస్టులు
ఎస్‌ఐ (సివిల్) – 148
రిజర్వ్ ఎస్‌ఐలు – 29
ఏఎస్‌ఐ (ఫింగర్ ప్రింట్ బ్యూరో) – 23
సివిల్ కానిస్టేబుల్ – 3,697
ఏఆర్ కానిస్టేబుల్ – 1,052
ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ – 1,380
ఫైర్ ఫైటర్ – 751
స్టేషన్ ఫైర్ ఆఫీసర్ – 39
వార్డర్ (పురుషులు) – 196
వార్డర్ (మహిళలు) – 12

## ఉదయ్‌కృష్ణారెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

అధికారిణి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. జాతీయ పోలీస్ అకాడమీలో బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసిన పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించగా, మెడపై, గొంతు వద్ద గాయాలు, చెంప, కాలిపై కమిలిన గాయాలు ఉన్నట్లు వైద్య నివేదికలో వెల్లడైనట్లు సమాచారం. కేసు నమోదు అనంతరం పరారీలోకి వెళ్లిన ఉదయ్ కృష్ణారెడ్డిని పట్టుకునేందుకు పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో గాలింపు చేపట్టిన అనంతరం మిర్యాలగూడ సమీపంలో గుర్తించి అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఇదిలా ఉండగా, తనపై నమోదైన కేసు అసత్య ఆరోపణల ఆధారంగా నమోదు చేశారని పేర్కొంటూ అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని తెలంగాణ హైకోర్టులో ఉదయ్ కృష్ణారెడ్డి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు బాధితురాలికి నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ ఘటన జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న అధికారుల మధ్య చోటుచేసుకోవడంతో దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కేసు దర్యాప్తును అత్తాపూర్ పోలీసులు కొనసాగిస్తున్నారు.

## కోసమే ‘సర్’

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియ పూర్తయిందన్నారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్,జిహెచ్‌ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ ప్రక్రియపై సంబంధిత డిఇఒలు ప్రత్యేక దృష్టి సారించాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్ లోడ్ చేసేలా బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబ ంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఒకే కుటుంబ పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు.

**నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు...**

డిజిటలైజేషన్‌లో నిర్లక్ష్యం వహించిన బిఎల్‌ఒలు,సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లు మారిన వారి వివరాలను, అందుబాటులో లేని వారి వివరాలను (ఎ.ఎస్.డి) జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్‌ఎల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒ, బిఎల్‌ఒ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాఫ్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, డిప్యూటీ ఎన్నికల అధికారి చారి, పిఎం ఐటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు

## దేశ భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఛత్రపతి సంభాజీనగర్ విమానాశ్రయంలో దిప్కే విలేకరులతో మాట్లాడారు. ఛత్రపతి సంభాజీనగర్‌లో దిగిన తర్వాత, తన తల్లిదండ్రులను కలుసుకోబోతున్నందుకు సంతోషంగా ఉందని దీప్కే అన్నారు. ‘దాదాపు 40 రోజుల తర్వాత నేను ఇంటికి వస్తున్నాను. నేను భారతదేశానికి వచ్చినప్పటి నుండే ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. ఆ తర్వాత దాదాపు 36 రోజుల పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉన్నాను. ఆందోళన విజయవంతమైంది. దేశంలోని విద్యార్థులు గెలిచారు... ఇప్పుడు ఇక్కడికి వచ్చాను, నా తల్లిదండ్రులను కలవబోతున్నందుకు సంతోషంగా ఉంది’ అని ఆయన అన్నారు. నిరసన తర్వాత అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని దీప్కే పేర్కొన్నారు. ‘ప్రభుత్వం ఇకనైనా సరిగ్గా వ్యవహరించాలి. ‘పార్లమెంట్ మార్చ్ సమయంలో వీధుల్లో విద్యార్థుల రక్తం చిందింది. అది చాలా దారుణం. అదంతా చాలదన్నట్లుగా, ఇప్పుడు కూడా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు. అనేక రాష్ట్రాల్లో పోలీసులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అరెస్టుల పేరుతో వారిని బెదిరిస్తున్నారు’ అని ఆయన అన్నారు. ‘ఈ విద్యార్థులు ఉగ్రవాదులు కాదు. వారు మన దేశ భవిష్యత్తు. దేశ భవిష్యత్తును ఇలా ఇబ్బంది పెడితే... ధర్మేంద్ర ప్రధాన్ ఎలాగైతే పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చిందో, అలాగే ప్రభుత్వం సరైన దారిలో నడవకపోతే మేము వెళ్లి ప్రభుత్వాన్ని మారుస్తాం’ అని సిజెపి వ్యవస్థాపకుడు జోడించారు. ఒక ప్రశ్నకు సమాధానంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేసి ’ఇన్‌ఫ్లుయెన్సర్’గా మారాలని, ఆ పనిలో ఆయన చాలా దిట్ట అని ఆయన అన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల ఆగ్రహం తగ్గిందని ప్రభుత్వం భావించకూడదని ఆయన అన్నారు. అవసరమైతే తాము మరింత భారీ స్థాయిలో కొత్త ఉద్యమాన్ని ప్రారంభిస్తామని దీప్కే చెప్పారు. వలుజ్ ఎంఐడిసి ప్రాంతంలోని తన ఇంటికి వెళ్లే ముందు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పట్ల గౌరవ సూచకంగా, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మరాఠ్వాడా విశ్వవిద్యాలయం సమీపంలోని ఆయన విగ్రహాన్ని దీప్కే సందర్శించారు.

## గడపగడపకూ తీసుకెళ్తాం

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ కార్యాలయం ‘ఇందిరా భవన్’లో బుధవారం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన టిపిసిసి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సి.దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ సీతక్క, ఎఐసిసి సెక్రెటరీ సిహెచ్.వంశీచందర్ రెడ్డి, సహా పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ భేటీ అనంతరం డి ప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడా రు. సమావేశంలో ప్రధానంగా మూడు అంశాలపై వి స్తృత చర్చ జరిగిందని, పార్టీ, ప్రభుత్వ సమన్వయం పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.

**పారదర్శకంగా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఆశావహుల ఎంపిక**

రానున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల గురించి సమన్వయ కమిటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు డిప్యూటీ సిఎం వెల్లడించారు. ముందుగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును వేగవంతం చేయడంతో పాటు, ఎమ్మెల్సీ బరిలో నిలిచే ఆశావహుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా చూడాలని నిర్ణయించామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా సంబంధిత జిల్లాల ఇన్చార్జి మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మంత్రులు తమ జిల్లాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు (డిసిసి), ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతంగా చర్చించి ముగ్గురు సభ్యులతో కూడిన ప్యానెల్‌ను పార్టీ అధిష్టానానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్‌ఐఆర్) ప్రక్రియపై తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్‌ఎలు) అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నారని, వారి పనితీరును ఎఐసిసి సైతం సమీక్షించి అభినందించిందని చెప్పారు. మిగిలిన ఓటరు నమోదు ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారన్నారు. మొత్తంగా ఓటరు నమోదు, ప్రభుత్వ పథకాల ప్రచారం, ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై భేటీలో స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకుని, వాటి అమలుకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు భట్టి విక్రమార్క వివరించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com